ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 28.02.2025 | సంపుటి : 11 సంచిక : 228 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# తెలంగాణ రైజింగ్‌సన్

## పెట్టుబడుల్లో దూసుకెళ్తున్నాం
## ఆపడం ఎవరితరం కాదు:సీఎం రేవంత్

- దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు సాధించాం
- అన్ని రంగాల్లో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోంది
- హెచ్‌సీఎల్ టెక్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో సీఎం



హైదరాబాద్(జనంసాక్షి): దేశంలోనే తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరని, 2025వ సంవత్సరంలోనే దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు సాధిం చామని, తెలంగాణ వన ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని రేవం త్ ధీమా వ్యక్తం చేశారు. ఇవి, బయోటెక్ సహా తదితర రంగాల్లో హైదరాబాద్ అగ్రగామిగా ఉందని ప్రశంసించారు. మాదాపూర్‌లో హెచ్‌సి ఎల్ టెక్ నూతన క్యాంపస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రసంగించారు. నూతన హెచ్‌సి ఎల్ క్యాంపస్ ఏర్పాటు చేసుకోవడం సంతోష కరమైన విషయమని పేర్కొన్నారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంగా వేగంగా

మిగతా 2లో..

## తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు

### మే 7 నుంచి 31 వరకు గ్రాండ్ ఫినాలె

**వరల్డ్ ఫెస్టివల్‌లో పాల్గొననున్న 120కి పైగా దేశాలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** మిస్ వరల్డ్ పోటీలు అంటే ప్రపంచంలోనే ఓ అరుదైన, అద్వితీయమైన వేడుక. వివిధ దేశాల నుంచి సుందరీమణులు పాల్గొనే ఈ వేడుకలకు ఈసారి తెలంగాణలోని హైదరాబాద్ వేదిక కానుంది. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం అనే మాట వింటుంటేనే హైదరాబాద్ జోష్ పెంచుతుంది. ఒక్కసారి ప్రపంచం

మిగతా 2లో..

## ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారంపై ప్రభుత్వం చొరవ

### వివాదాల పరిష్కారానికి అంగీకారం

### కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎమ్మార్ ప్రాపర్టీతో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. వారి న్యాయ కమిటీ అందించే సూచనలు,సలహాలు స్వీకరిస్తామని తెలిపింది. వివిధ కేసులతో పెండింగ్‌లో ఉన్న తమ ప్రాజెక్టుల వివాదాలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది.

మిగతా 2లో..





## మొదట తాగునీటిపై దృష్టిసారించండి


### రెండు జలాశయాల్లో ఉన్న కొద్దిపాటి నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలి

### ఏపీ, తెలంగాణలకు కేఆర్ఎంబీ సూచన

హైదరాబాద్(జనంసాక్షి): తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రెండు రాష్ట్రాల్లో ఉన్న పంటలను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో బోర్డు ప్రత్యేక సమావేశం హైదరాబాద్ జలసౌధలో జరిగింది.తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇంజనీర్లు సమావేశానికి హాజరయ్యారు. రెండు జలాశయాల్లో

మిగతా 2లో..

## ఇంజినీరింగ్, వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాల్లో సవరణలు




2లో



## రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తిచేస్తాం

### మరో రెండు నెలల్లో తిరిగి టన్నెల్ పనులు ప్రారంభిస్తాం

### ప్రమాదం జరిగిన చోట రాజకీయాలు చేయాలని చూస్తారా!

### ఎస్ఎల్‌బీసి వద్దకు వచ్చేందుకు హరీశ్ ప్రయత్నంపై మంత్రి ఉత్తమ్ మండిపాటు

### జగన్‌తో అంటకాగి నీటి చౌర్యానికి సహకరించిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం

### వేగంగా కొనసాగుతున్న బురద తొలగింపు చర్యలు .. ఇంకా వీడని ఉత్కంఠ

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో(జనంసాక్షి):** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు రెండ్రోజుల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రెండు నెలల్లో తిరిగి సొరంగం తవ్వకం పనులు చేపడతామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. టన్నెల్ కూలిపోవడానికి గత ప్రభుత్వ వైఫల్య మేనని ఉత్తమ్ ఆరోపించారు."గత ప్రభుత్వం టన్నెల్‌లో నీటి తొలగింపు పనులు కూడా చేపట్టలేదు. టన్నెల్‌లో నీటిని తోడివేసి ఉంటే.. ఇప్పుడీ ప్రమాదం జరిగేది కాదు. గ్రావిటీ ద్వారా 30 టీఎంసీలు తీసుకునే ప్రాజెక్టును పక్కకు పెట్టారు. టన్నెల్ పూర్తి చేసి ఉంటే 4.50 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవి. భారాస చేపట్టిన ప్రాజెక్టులన్నీ వాళ్ల జేబులు నింపుకొనేందుకే. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం కడితే అది మూడేళ్లకే కూలింది.

మిగతా 2లో..

## పురోగతి లేదు :హరీశ్

- ప్రచారాల మీద ఉన్న శ్రద్ధ ప్రాణాల మీద లేదు
- ఘటనపై సీఎం రేవంత్ భాధ్యతారాహిత్యం
- సహాయక చర్యల్లో ఘోరంగా వైఫల్యం
- ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లనీయకుండా భారాస నేతను అడ్డుకున్న పోలీసులు



హైదరాబాద్(జనంసాక్షి):ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు వెళ్లే ముందు హైదరాబాద్ హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ ఘటనలో సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం

మిగతా 2లో..

### సీఎం రేవంత్‌దే పూర్తి బాధ్యత

పనులపై అవగాహన లేక ఇతరులపై నిందలు : కేటీఆర్

2లో

## కుంభమేళాతో ప్రపంచమే ఆశ్చర్యపోయింది

### ఐక్యత కోసం జరిగిన గొప్ప మహాయజ్ఞమిది

### ఎవరికైనా అసౌకర్యం కలిగితే క్షమించండి

### కుంభమేలా ముగింపుపై ప్రధాని మోడీ వెల్లడి



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం

మిగతా 2లో..



## ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

### భారీగా పోలింగ్ నమోదు

### 3న ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆంధ్రా,తెలంగాణలో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఆంధ్రప్రదేశ్ లో 3, తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే, సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. తెలంగాణలోని మూడు

మిగతా 2లో..

### చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి

## కావలసిన నిధులు సమకూరుస్తాం

### దేశంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దుతాం: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్(జనంసాక్షి):దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీని తీర్చిదిద్దడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు కావలసిన నిధులను సమకూరుస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గురువారం వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ (కోటి ఉమెన్స్ కాలేజ్)ని సందర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న హెరిటేజ్ బిల్డింగ్స్ ను పరిరక్షణ చేయడంతో పాటు పునరుద్ధరణ చేయడానికి కావలసిన నిధులను ప్రభుత్వం ఇస్తుందని వెల్లడించారు. మహిళా విద్యార్థులకు కావలసిన తరగతి గదులు, ల్యాబ్స్, లైబ్రరీ, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉండడానికి కావలసిన వసతి గృహాలు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కార్యాలయం, అతిథి గృహం, ఆడిటోరియం, పరిపాలన

మిగతా 2లో..



## అసెంబ్లీకి రాకుండా ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్నారు

### మాజీ సీఎం అతిషి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ సమావేశాల వేళ భాజపా సర్కారుపై ప్రతిపక్ష ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ ప్రాంగణంలోకి రానివ్వకుండా బారికేడ్లు పెట్టి మరీ అడ్డుకుంటున్నారని ఆరోపించింది. ఈ మేరకు మాజీ సీఎం, శాసన సభలో ప్రతిపక్ష నేత ఆతిశీ ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు. 'భాజపా నేతలు అధికారంలోకి రాగానే నియంతృత్వంలో అన్ని హద్దులు

మిగతా 2లో..



### కోవిడ్ వ్యాక్సిన్ దుష్ప్రభావంతో

## చనిపోయిన వారి సంగతేంటి?

### వారికి పరిహారంపై కేంద్రం స్పందించాలి

### సుప్రీం కోర్టు ధర్మాసనం సూటి ప్రశ్న

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కోవిడ్ వ్యాక్సినేషన్ దుష్ప్రభావాల కారణంగా చనిపోయిన వారికి పరిహారంపై కేంద్రం స్పందించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. కరోనా వ్యాక్సిన్ తీసుకున్న దేశ ప్రజల్లో కొందరు టీకా పడకపోవడంతో దుష్ప్రభావాల కారణంగా చనిపోయారు. ఇలా చనిపోయిన వారి బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు

మిగతా 2లో..



## మెట్రోను అడ్డుకున్నట్లు నిరూపిస్తారా?

- కేంద్రాన్ని అడిగే హామీలు ఇచ్చారా?
- సిఎం రేవంత్ స్థాయిని మరిచి విమర్శలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎవరిని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారు...ఎవరిని మీరు విమర్శిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మెట్రో రెండోదశను అడ్డుకున్నట్లు రుజువులు చూపాలని సవాల్ చేశారు. విస్తరణకు పైసా లేకున్నా పనులు ఎలా చేపడతారని కూడా ఎదురు ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

మిగతా 2లో..

# త్వరలో ఈయూపైనా సుంకాలు

- ఐరోపా సమాఖ్యపై 25శాతం అదనపు టారిఫ్ విధిస్తా
- మిత్ర దేశాలనూ వదలని ట్రంప్



**న్యూయార్క్(జనంసాక్షి):**అదనపు సుంకాల వడ్డనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రులను కూడా వదలడం లేదు. ఐరోపా సమాఖ్యపై త్వరలోనే 25శాతం అదనపు టారిఫ్‌లను విధిస్తానని వెల్లడించారు. అసలు ఈయూ ఏర్పడిందే అమెరికాను కట్టడి చేయడానికని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మేము ఒక నిర్ణయానికి వచ్చాము. దానిని త్వరలోనే ప్రకటిస్తాను. 25శాతం అని అనుకొంటున్నాం. అది కార్లు సహా అన్నింటిపైనా వర్తిస్తుంది. అమెరికాను బిగించడానికే ఐరోపా సమాఖ్య ఏర్పడింది. అది దాని పని బాగా చేసింది. ఇప్పుడు నేను అధ్యక్షుడిని అయ్యాను" అని పేర్కొన్నారు.ఈయూ ప్రస్తుతం దిగుమతి చేసుకొంటున్న కార్లపై 10 శాతం టారిఫ్‌లను విధిస్తోంది. దీనికితోడు వ్యాట్, ఇతర పన్నులు కలిపి అది 17.5శాతానికి చేరుతోంది. అదే సమయంలో అమెరికా కేవలం 2.5శాతం మాత్రమే వసూలు చేస్తోంది.ఐరోపా సమాఖ్య అమెరికాకు మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. చైనాతో కూడా అమెరికాకు ఇదే స్థాయిలో బిజినెస్ జరుగుతుంది. ఇక కెనడా, మెక్సికోలతో అమెరికా వ్యాపారం అత్యధికంగా చేస్తుంది. ఇప్పటికే ఈ మూడు దేశాలపై అదనపు సుంకాలను ట్రంప్ ప్రకటించారు. ఇవి మార్చి 4వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి.ట్రంప్ వ్యాఖ్యలు ఈయూలో కలకలం రేపాయి. యూరోపియన్ కమిషన్ స్పందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అయిన ఈయూ అమెరికాకు వరమని పేర్కొంది. "స్వచ్ఛ, పారదర్శక వాణిజ్యానికి అన్యాయమైన అడ్డంకులపై ఈయూ తక్షణమే స్పందిస్తుంది. ఈ సుంకాలు చట్టాలను,

మిగతా 2లో..

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాటో వల్లే మొదలైంది

### జెలెన్‌స్కీ ఇక దాన్ని మర్చిపోవచ్చు స్పష్టం చేసిన ట్రంప్

2లో

### మరో విడత రష్యా-అమెరికా

## చర్చలు మొదలు

### తుర్కియేలో దౌత్యవేత్తల ఆధ్వర్యంలో సమావేశం

2లో

## బెంగాల్ ఓటర్ల జాబితాలో అవకతవకలు

### పట్టించుకోపోతే ఈసీ ముందు నిరవధిక దీక్ష చేస్తా : మమతా బెనర్జీ



**కోల్‌కత్తా(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం సాయంతో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో భాజపా చేర్చుతోందని దుయ్యబట్టారు. వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడతానని హెచ్చరించారు.తృణమూల్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడిన దీదీ భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించడంపైనా

మిగతా 2లో..




## ముచ్చెమటలే..

- ఫిబ్రవరిలోనే భానుడిఉగ్రరూపం
- క్రమంగా పెరుగుతున్న ఎండలు

**హైదరాబాద్(జనంసాక్షి):**రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఫిబ్రవరిలోనే భానుడు ఉగ్రరూపం దాల్చాడు. మహాశివరాత్రి తర్వాత వేడి, ఉక్కపోత మరింత పెరగనుంది. మార్చి రెండు లేదా మూడో వారంలోనే రాష్ట్రంపై వడగాలులు ప్రభావం చూపుతాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్-జూన్ మధ్యలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ వడగాలుల హెచ్చరికలు జారీ చేసింది. 1961-2020 మధ్యకాలంలో సేకరించిన వివరాల ప్రకారం.. మార్చి-జూన్ మధ్యలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో వడగాలుల తీవ్రత

మిగతా 2లో..

## ఎన్ని చట్టాలు చేసినా.. కఠినంగా అమలు చేస్తేనే ఫలితం



మహిళలకు భద్రత ఉందన్న నమ్మకం కలిగించాలి

పుణె అత్యాచార ఘటనపై మాజీ సీజేఐ చంద్రచూడ్

**ముంబై,ఫిబ్రవరి27(జనంసాక్షి):** మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన చటాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని సుప్రీం మాజీ సిజె జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు.. ఎక్కడికి వెళ్లినా

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
28.02.2025

## తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు

దేశాలన్ని హైదాబాద్ వైపు చూపుతిప్పుకునే ఆ రోజు అతి చేరువలోనే ఉంది. ఈ ఏడాది ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్‌లో చెయ్యాలని నిర్వాహకులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. దీంతో 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నది. చారిత్రక, వారసత్వ సంపదను ప్రపంచానికి చాటడానికి తెలంగాణకు ఇదొక గొప్ప అవకాశం కానుంది. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటేందుకు అరుదైన ఘట్టం కానుంది. ఈ ఏడాది అందాల పోటీలకు అనువైన ప్రదేశంగా తెలంగాణను ఎంచుకోవడం, అందులోనూ హైదరాబాద్ వంటి మహానగరం ఈ వేడుకులకు సిద్దమవ్వడం ఈ ప్రభుత్వంలో జరిగే ఓ అద్వితీయం వేడుకగా చెప్పవచ్చు. ఈ ఏడాది మేనెలలో నాలుగు వారాల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతోపాటు గ్రాండ్ ఫినాలేను సైతం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

## త్వరలో ఈయూపైనా సుంకాలు

వివక్ష రహిత విధానాలను సవాలు చేస్తాయి" అని ఈయూ ప్రతినిధి పేర్కొన్నారు. తైవాన్‌ను ఆక్ర మించుకోవడానికి చైనాకు అమెరికా అనుమతి స్తుందా..? అన్న ప్రశ్నకు ట్రంప్ సమాధానం చెప్పలేదు. ఆ సమస్యపై ఎప్పుడూ కామెంట్ చేయను అని ముక్తసరిగా బదులిచ్చారు. చైనాతో సీమాంతర పెట్టుబడుల అంశాల్లో మంచి సంబంధాలను కలిగి ఉండాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు.అమెరికా ఇతర దేశాలకు యూఎస్ఎయిడ్ రూపంలో అందించే సాయానికి సంబంధించిన 90శాతం కాంట్రాక్టులను రద్దు చేసింది. కోర్టు కేసుల్లో ఉన్న కొన్ని ప్రాజెక్టులు మాత్రం కొనసాగుతున్నాయి. ఈమేరకు కోర్టుకు దాఖలు చేసిన ఓ పత్రంలో పేర్కొంది.

## మరో విడత రష్యా-అమెరికా చర్చలు

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా, రష్యాలు శాంతి చర్చల దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఇరు దేశాలకు చెందిన కీలక దౌత్యవేత్తలు నేడు తుర్కియేలో భేటీ అయ్యారు.ఇందుకు అమెరికా రాయబారా కార్యలయం వేదికగా మారింది. గురువారం రష్యా అధికారుల బృందం అక్కడకు చేరుకొంది. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపర్చుకొనేందుకు చేస్తున్న యత్నాల్లో భాగంగా.. వాషింగ్టన్ , మాస్కోలోని దౌత్య కార్యాలయాల్లో ఉన్న వివాదాలను ఈ సందర్భంగా చర్చించుకొన్నారు. దౌత్య సిబ్బంది ఇరు దేశాల్లో పనిచేసే వాతావరణంపై చర్చించనున్నారు. దీనిలో ఉక్రెయిన్, ఇతర రాజకీయ, భద్రతా పరమైన అంశాలను చేర్చలేదు. ఈ చర్చలపై అమెరికా విదేశాంగశాఖ మాట్లాడుతూ "ఈ చర్చలు చాలా నిర్మాణాత్మకంగా కనిపిస్తున్నాయి.

## బెంగాల్ ఓటర్ల జాబితాలో అవకతవకలు

ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని కూడా భాజపా ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. 2006లో భూసేకరణ వ్యతిరేక ఆందోళనల క్రమంలో చేపట్టిన 26 రోజుల నిరాహార దీక్షను ఆమె గుర్తుచేశారు. ఓటర్ల జాబితాను సరిచేసి, తప్పుడు ఓటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈసీ కార్యాలయం ముందు దీక్ష చేపడతానని అన్నారు.ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు హరియాణా, గుజరాత్ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. దిల్లీ, మహారాష్ట్రల్లోనూ భాజపా ఈ తరహా వ్యూహాలను అమలు చేసిందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే విజయం సాధించలేమని భాజపాకు తెలుసునని, అందుకే తప్పుడు జాబితాను రూపొందించే పనిలో పడిందన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇక్కడ రావని, బయట వ్యక్తులు (భాజపా) బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడాన్ని తాము అనుమతించబోమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకు 215 చోట్ల విజయం సాధిస్తామని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.

## మార్చి నుంచి ముచ్చెమటలే..

గణనీయంగా పెరిగింది. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 8 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి.వాతావరణ మార్పుల ప్రభావంతో గత 30 ఏళ్లలో వడగాలుల వ్యవధి 2.5 రోజులు పెరిగింది.2015లో విపత్తు మాదిరిగా వడగాలులు విజృంభించాయి. ఆ ఏడాది మే 23 నుంచి 27 మధ్యకాలంలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వేడి వాతావరణం నెలకొంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. 2-3 రోజుల వ్యవధిలోనే 7 నుంచి 10 డిగ్రీలు పెరిగాయి.వడగాలులు సాధారణంగా 4 నుంచి 8 రోజులుంటాయి. కోస్తాంధ్ర, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో ఆ వ్యవధి 8 రోజుల కంటే ఎక్కువే.కొన్నేళ్లుగా భారత్‌లో వడగాలుల ప్రభావం పెరుగుతోంది.

## చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి కావలసిన నిధులు సమకూరుస్తాం

విభాగానికి సంబంధించిన భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రదేశాలను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులు రూపొందించిన భవన నిర్మాణ నమూనాలను తిలకించారు. ఇటీవల పునరుద్ధరణ చేసిన దర్బార్ మహల్ హెరిటేజ్ బిల్డింగును పరిశీలించారు. దర్బార్ మహల్ పై అంతస్తులో 1779 - 1947 మధ్య, హైదరాబాదులో పనిచేసిన 57 మంది బ్రిటిష్ రెసిడెంట్లకు సంబంధించిన చిత్రపటాలు, వారి పదవీ కాలంలో హైదరాబాద్ నగర రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో చేసిన అభివృద్ధికి సంబంధించి ప్రదర్శించిన చిత్రపటాలను ఆసక్తిగా తిలకించారు. పూర్వపు బ్రిటిష్ రెసిడెన్సి కి సంబంధించిన చరిత్రను విజిటర్ మేనేజర్ సతీష్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సమగ్రంగా వివరించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో నూతనంగా నిర్వహించే భవనాలకు సంబంధించి రూపొందించిన నమూనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాశాఖ అధికారుల సమక్షంలో ఇంజనీరింగ్ అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు వివరించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న గార్డెన్స్ లో పచ్చదనాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు అందరిని ఆకట్టుకునే విధంగా మూసిని అనుసంధానం చేయడానికి తయారు చేసిన ప్రతిపాదనలను ఉప ముఖ్యమంత్రి కి చూపించారు. యూనివర్సిటీలో నూతనంగా నిర్మాణం చేసే భవనాలు రాబోయే తరాలకు వారసత్వ కట్టడాలుగా చరిత్రలో మిగిలిపోయే విధంగా ఉండాలని, ఆ విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రానా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పూజారి గౌతమి, తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్‌న్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి రెడ్డి, యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ సూర్య ధనుంజయ్, ప్రిన్సిపల్ లోక పావని తదితరులు పాల్గొన్నారు

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాటో వల్లే మొదలైంది

**న్యూయార్క్(జనంసాక్షి):**నాటోలో సభ్యత్వం విషయాన్ని ఉక్రెయిన్ మర్చిపోవచ్చని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఆయన అధికారం చేపట్టాక తొలిసారి తన కార్యవర్గంతో సమావేశమయ్యారు.దీనికి డోజ్ సారథి మస్క్ సహా పలువురు కీలక సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉక్రెయిన్ సమస్యపై ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "నాటోనా..? దానిని మీరు మర్చిపోవచ్చు. అసలు ఈ సంక్షోభం మొత్తం దాంతోనే మొదలైంది. మేము అత్యుత్తమమైన పనే చేయాలనుకుంటున్నాం. ఇద్దరికీ బెస్ట్ డీల్ కుదురుస్తాం. ముఖ్యంగా ఉక్రెయిన్‌కు మంచి సంధి కుదిరేటట్లు చేసి.. కోల్పోయిన దానిలో.. వీలైనంత ఎక్కువ వెనక్కి ఇప్పిస్తాం" అని పేర్కొన్నారు. అదే సమయంలో శాంతి కోసం పుతిన్ కూడా కొన్ని రాయితీలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.మరోవైపు ఖనిజాలపై అమెరికాతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు శుక్రవారం ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ వాషింగ్టన్‌లో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా వెల్లడించారు. "అది అరుదైన ఖనిజాలపై చేసుకొనే చాలా పెద్ద ఒప్పందం" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతకుమించి డీల్ గురించి ఆయన ఏమీ వెల్లడించలేదు.



# తెలంగాణ రైజింగ్‌సన్

అభివృద్ధి చెందు తున్న నగరంగా మారిందని కొనియాడారు. దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం ఏడాదిలోనే దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చా యని తెలిపారు. ఉద్యోగ కల్పనలో నంబర్‌వన్‌గా నిలిచామని చెప్పారు. ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నానన్నారు. 'తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని నేను చెప్పినప్పుడు అది సాధ్యం కాదని కొందరన్నారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు. మా పోటీ ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నైతో కాదని నేను చెప్పినప్పుడు.. కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారు. ఈవీ అడాప్షన్‌లో హైదరాబాద్‌ను నంబర్ వన్‌గా చేశాక.. రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అంటున్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్‌ను ఇటీవలే ప్రారంభించాం. ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాల్లో ఒకటైన బయో ఆసియా సదస్సును నిర్వహించాం. గ్లోబల్ కంపెనీగా హెచ్‌సీఎల్ టెక్ దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఇది 2.2 లక్షల మందికిపైగా ఉద్యోగులతో 60 దేశాల్లో ఆపరేట్ చేస్తోంది. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తున్నారు. 2007లో హైదరాబాద్‌కు వచ్చినప్పటి నుంచి హెచ్‌సీఎల్ అంచలంచెలుగా పెద్ద స్థాయికి ఎదిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు, సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

## ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారంపై ప్రభుత్వం చొరవ

గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మార్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎమ్మార్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలబ్బర్, భారత్ లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా, ఎమ్మార్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్, ఆ కంపెనీ ఇంటర్నేషనల్ ఆ÷ర్స్ హెడ్ ముస్తఫా అక్రమ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి,పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2001లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయ్‌కు చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాలు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మార్ ప్రాపర్టీస్ కు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ఛీఫ్ సెక్రెటరీ సారధ్యంలో అయిదుగురు సెక్రెటరీల కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు కేంద్ర విదేశాంగశాఖ, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాకూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఎమ్మార్ ప్రతినిధులతో జరిగిన చర్చల సందర్భంగా ఈ అంశాలన్నింటినీ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, ఛార్జీ షీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## మొదటి తాగునీటిపై దృష్టిసారించండి

అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే విషయమై సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తమకు 63 టీఎంసీలు కావాలని తెలంగాణ, 55 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నిన్నటి సీఈల సమావేశం అనంతరం వివరాలు సమర్పించాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో కనీస వినియోగ మట్టానికి ఎగువన 60 టీఎంసీలకు పైగా నీరు ఉంది. ఉన్న కొద్ది పాటి నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు రెండు రాష్ట్రాలకు సూచించింది. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన నీటిని ప్రణాళికతో వాడుకోవాలని తెలిపింది. పక్షం రోజులకు ఒకసారి పరిస్థితులను సమీక్షించుకుంటూ ముందుకెళ్లాలని రెండు రాష్ట్రాలకు సూచించింది.

## కుంభమేళాతో ప్రపంచమే ఆశ్చర్యపోయింది

అని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా' అని మోదీ రాసుకొచ్చారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు.

## పురోగతి లేదు: హరీశ్

దారుణంగా విఫలమైందని ఆరోపించారు. వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని సాధించడంలో కూడా ప్రభుత్వం ఫెయిల్ అయిందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ బృందాలు, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు, ఏజెన్సీ మధ్య సమన్వయం లోపించినట్టు కనిపిస్తుందన్నారు. వీరికి డైరెక్షన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది అని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రులు అక్కడికి వెళ్లి హెలికాప్టర్లలో టీవీ ఇంటర్వ్యూలు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు తప్ప, సహాయక చర్యలు చేపట్టడంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. పైనుంచి హెలికాప్టర్‌లో చూస్తే సొరంగం లోపల ఏమన్నా కనిపిస్తాదా, ప్రత్యేకంగా చూడడానికి వీఎక్స్ రే కెమెరాలు ఉన్నాయా? హెలికాప్టర్లలో చెక్కర్లు కొట్టుడు టీవీ ఇంటర్వ్యూలు ఏమిటో నాకు అర్థం కావడం లేదని తెలిపారు. వారి ప్రాణాలు కాపాడటానికి ప్రతి నిమిషం కూడా చాలా ముఖ్యమైనదని.. క్షణం కూడా చాలా విలువైనదని తెలిపారు.

**ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లనీయకుండా హరీశ్‌నుఅడ్డుకున్న పోలీసులు**

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు వద్దకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డితో పాటు పలువురు నేతలు చేరుకున్నారు. అయితే సొరంగంలోకి వెళ్లనీయకుండా హరీశ్‌రావు బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో హరీశ్‌రావు, ఇతర నాయకులు రోడ్డుపైనే బైఠాయించిన నిరసన తెలిపారు. పోలీసుల తీరుపై హరీశ్‌రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనను పరిశీలించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్ నుంచి గురువారం బయల్దేరిన సంగతి తెలిసిందే. కల్వకుర్తిలో బీఆర్ఎస్ నేతలతో కలిసి హరీశ్‌రావు టీ తాగారు. అనంతరం అక్కడ్నుంచి నేరుగా ఎస్ఎల్బీసీ సొరంగం వద్దకు చేరుకున్నప్పటికీ.. లోపలికి పోలీసులు అనుమతించడం లేదు. భారీగా పోలీసులు మోహరించారు. మీడియాపై కూడా పోలీసులు ఆంక్షలు విధించారు.

## సీఎం రేవంత్‌దే పూర్తి బాధ్యత

**హైదరాబాద్(జనంసాక్షి):**సీఎంకు ఏపని ఎలా చేయాలో తెలియక ఇతరులపై ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్ల నాటి ప్రాజెక్టు పనులను నిపుణులను సంప్రదించకుండానే ప్రారంభించారని, 8 మంది కార్మికులు టన్నెల్ చిక్కుకోవడానికి అదే కారణమైందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఇతరులను నిందించడం మానుకుని పనిపైన దృష్టిపెట్టాలని సూచించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో 8 కార్మికులు చిక్కుకున్న ఘటనకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌ను నిందించడంపై కేటీఆర్ స్పందించారు. రేవంత్ రెడ్డికి పని చేతగాదని మండిపడ్డారు. 'ఆయనకు ఎలా పని చేయాలో తెలియకపోతే ఇతరులపై ఆరోపణలు చేయడం సులభంగా ఉంటుందని ఎద్దేవా చేశారు. పదేళ్ల కిందటి ప్రాజెక్టు పనులను నిపుణులను, ఇంజినీర్లను సంప్రదించకుండానే మొదలుపెట్టారని విమర్శించారు. అదే ఇప్పుడు 8 మంది కార్మికులు టన్నెల్‌లోపల చిక్కుకోవడానికి కారణమైంది' అని కేటీఆర్ ఆరోపించారు.

## ఇంజినీరింగ్, వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాల్లో సవరణలు

హైదరాబాద్(జనంసాక్షి): ఇంజినీరింగ్, వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం సవరణలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజినీరింగ్, వృత్తి విద్యలో 85శాతం సీట్లు స్థానిక విద్యార్థులకే కేటాయించాలని నిర్ణయించింది.15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా సీట్ల కేటాయింపులో కొన్ని మార్పులు చేసింది. 15శాతం సీట్లకు 4 రకాల వారు అర్హులుగా గుర్తిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ కోటాలో తెలంగాణ స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల్లో చదివిన వారు కూడా అర్హులని పేర్కొంది. ఇతర రాష్ట్రాల్లో చదివిన వారు తెలంగాణలో పదేళ్లు చదివి ఉండాలని నిబంధన పెట్టింది. కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో పనిచేస్తోన్న వారి పిల్లలు, ఉద్యోగుల జీవిత భాగస్వాములు 15శాతం సీట్లకు అర్హులని తెలిపింది.

## కోవిడ్ వ్యాక్సిన్ దుష్ప్రభావంతో చనిపోయిన వారి సంగతేంటి?

కేంద్రం ఏదైనా పాలసీ చేసిందో.. లేదో చెప్పాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటిని అడిగింది. కోవిడ్-19 వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత తన భర్త ఆరోగ్యం క్షీణించి చనిపోయాడని, తనకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కేరళకు మిసెస్ సయ్యద్ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ సుప్రీంలో విచారణకొచ్చిన సందర్భంలో ఎక్స్‌గ్రేషియాపై కేంద్రం స్పందించాలని ఆదేశించింది.కరోనా సమయంలో?ఎమ్జ్గ÷న్సీ పేరుతో క్లినికల్ ట్రయిల్స్ లేకుండానే కొవిషీల్డ్ వ్యాక్సిన్‌కు కేంద్రం అనుమతి ఇచ్చిందని, దీంతో వ్యాక్సిన్ వేసుకున్న వారిలో దుష్ప్రభావం ఇప్పటికీ ఉందని అవేకెన్ ఇండియా మూమెంట్ ఆరోపించిన సంగతి తెలిసిందే. కొవిషీల్డ్ వ్యాక్సిన్ వేసుకున్న వారిలో గుండెపోటు, క్యాన్సర్, నరాల వ్యాధులు వంటివి వస్తున్నాయని అవేకెన్? ఇండియా మూమెంట్ ప్రతిధులు ఆరోపించారు. ఇప్పటికే చాలామంది మృతి చెందారని, వారికి కేంద్ర ప్రభుత్వంతో పాటు వ్యాక్సిన్ ?తయారీ సంస్థ నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వంతో పాటు వ్యాక్సిన్ ను ?ప్రమోట్? చేసిన సెలబ్రెటీలు కూడా సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

ఎమ్మెల్సీ స్థానాల్లో సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ముగిసింది. ఉమ్మడి కరీంనగర్- మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 40.61 శాతం, ఇవే జిల్లాల్లో జరుగుతున్న టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 63.49 శాతం పోలింగ్ నమోదు కాగా, వరంగల్- నల్లగొండ- ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 76.35 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. కాగా, వచ్చే నెల 3వ తేదీన తుది ఫలితాలను ఎన్నికల కమిషన్ వెల్లడించనుంది. మంచిర్యాలలో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణలుతెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. కొన్ని చోట్ల ప్రశాంతంగా, మరి కొన్ని చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా, నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్ పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది.

# రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తిచేస్తాం

గతంలో శ్రీశైలం పవర్ ప్లాంట్ అగ్ని ప్రమాదంలో ఆరుగురు ఉద్యోగులు చని పోతే కనీసం వెళ్లి చూడలేదు. పాలమూరు పంప్ హౌస్‌లో ప్రమాదం జరిగి ఆరుగురు చనిపోతే స్పందించలేదు .కొండగట్టు బస్సు ప్రమా దంలో 62 మంది చనిపోతే.. నాడు కేసీఆర్ వెళ్లలేదు. కేసీఆర్ ఫామ్‌హౌస్ దగ్గర్లోనే మాసాయిపేట రైలు ప్రమాదం జరిగింది. రైలు ప్రమాదంలో చిన్నారులు చనిపోతే కేసీఆర్ కనీసం పరామర్శించలేదు. ప్రమాదం జరిగిన చోట రాజకీయం చేయడానికి హరీశ్‌రావు వచ్చారు. హరీశ్‌రావుకు అనుభవం ఉంటే పదేళ్లలో ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదు. నిపుణుల చర్యలకు ఇబ్బంది కావొద్దని అందరినీ లోపలికి పంపట్లేదు. టీబీఎం వెనుక ఉన్న బురద తొలగింపు పనులు జరుగుతున్నాయి. బురద తొలగింపు పూర్తికాగానే మిషన్ శిథిలాలు తొలగిస్తాం" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అనుమతుల గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. అప్పుడు మాట్లాడని నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఎందని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాటలు పూర్తి అబద్దాలు, గొబెల్స్ ప్రచారమేనని విమర్శించారు. ఎస్ఎల్బీసీ ద్వారా 30 టీఎంసీలు గ్రావిటీ ద్వారా వస్తుంటే బీఆర్ఎస్ నేతలె పనులు వదిలిపెట్టి వెళ్లారని చెప్పారు. వాళ్లు సరైన పని చేసి ఉంటే తెలంగాణలో 30 టీఎంసీలు నీళ్లు వచ్చి మూడు నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు సాగులోకి వచ్చేవని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదాన్ని అందరికీ చూడటానికి అనుమతిస్తున్నామని చెప్పారు. వారి హయాంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రతిపక్షంలో ఉన్న తమకు ఎలాంటి అనుమతులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వాళ్ల హయాంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టి నామమాత్రపు పనులు చేశారని మండిపడ్డారు. వాళ్ల హయాంలో నీటిపారుదుల శాఖను నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్, హరీష్ రావులకు దక్కుతుందని చెప్పారు. తాము ప్రజాస్వామ్యతంగా పారదర్శకంగా ముందుకు పోతున్నామని చెప్పారు. వాళ్లు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం బ్లాస్ట్ జరిగి.. 9 మంది చనిపోతే ఒక్కరూ కూడా ఎందుకు పరామర్శకు రాలేదని ప్రశ్నించారు. ఆరోజు రేవంత్ రెడ్డి వస్తుంటే కారులో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని గుర్తుచేశారు. దేవాదులలో ఏడు మంది చనిపోతే.. ఆస్తిపంజరాలు ఐదేళ్ల తర్వాత దొరికాయని చెప్పారు. అప్పుడు హరీష్ రావు ఎప్పుడైనా ఆ విషయం గురించి మాట్లాడావా అని నిలదీశారు. ఎన్నో ప్రమాదాలు జరిగినప్పుడు వారి హయాంలో అడిగే నాథుడే లేరన్నారు. ఇక్కడికి వచ్చి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీరు జగన్‌తో కుమ్మక్కై ప్రగతిభవన్‌లో విందులు, వినోదాలు చేసుకుంటుంటే జగన్ కృష్ణానదిని దోచుకువెళ్లారని విమర్శించారు.. పాలమూరు రంగారెడ్డిలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 27,500 కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరాకు కూడా నీరందించలేదని ధ్వజమెత్తారు. ఎస్ఎల్‌బీసీకి కరెంట్ కట్ చేస్తే డీ ఓటరింగ్ చేయలేక పనులు ఆగిపోయాయని చెప్పారు. అప్పుడు జగదీశ్ రెడ్డి మంత్రిగా ఉన్నాడు ఏమి చేశారని ప్రశ్నించారు. తనకు హెలికాప్టర్‌లో తిరగాలని తనకు ఏ మాత్రం లేదని..తాను గతంలో పైలట్‌ను అని గుర్తుచేశారు. భారతదేశంలో టన్నెల్ ప్రమాదాల్లో అత్యంత నిపుణులను కలిగిన 11 ఏజెన్సీలను తీసుకువచ్చి సమర్థవంతంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పిన మాటలు అబద్దాలు అని.. ఆ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

**వేగంగా కొనసాగుతున్న బురద తొలగింపు చర్యలు**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో పేరుకుపోయిన బురదను తొలగించే ప్రక్రియ షురూ అయింది. గురువారం నాడు సహాయక చర్యల్లో భాగంగా ఒక వైపు డీ వాటరింగ్ చేస్తూ, మరో వైపు బురదను లోకో ట్రైన్ ద్వారా బయటికి తీసుకువస్తున్నారు. టీబిఎం మిషన్ సమీ పంలో పడి ఉన్న సామాగ్రిని కూడా తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే తప్ప సహాయక చర్యలు చేపట్టే అవకాశం లేదని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. బురద తొలగించే పనులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌లు పర్యవేక్షిస్తున్నారు. సొరంగం నుంచి పెద్ద ఎత్తున బురద బయటకు తీస్తున్నారు. లోకో ట్రైన్ వెళ్లి రావడానికి గంట సమయం పడుతుంది. పెద్ద ఎత్తున కూలీలను ఉపయోగించి.. లోపల హిట్యాచి ద్వారా బురదను బయటికి తకలిస్తున్నారు. భారీ యంత్రం సహాయంతో వీటిని తీసి టిప్పర్‌లలో తరలిస్తున్నారు.

## మెట్రోను అడ్డుకున్నట్లు రుజువు చేస్తారా?

చేసిన విమర్శలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. సీఎంగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకి సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుంది.. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారు. రేవంత్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా?' అని కిషన్‌రెడ్డి నిలదీశారు. తెలంగాణకు సిఎం రేవంతా లేక తానా అని ప్రశ్నించారు. ప్రధాని మోడీ నాయకత్వంలో మైనింగ్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. గనుల శాఖలో నూతన పాలసీ తీసుకొచ్చామని.. 12 ఖనిజాల రాయల్టీని పెంచామని తెలిపారు. ఈ ఏడాది జీఎస్ఐ 448 ప్రాజెక్టుల్లో గనుల అన్వేషణ చేపట్టిందని పేర్కొన్నారు. గనుల అన్వేషణలో ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేస్తున్నామని.. ఇందులో భాగంగానే ఈ ఏడాది 12 ప్రైవేట్ కంపెనీలు గనుల అన్వేషణలో భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఆఫ్ షోర్ ఏరియాలో ఖనిజాల ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. పలు ఆఫ్ షోర్ మినరల్స్ గుర్తించి వేలం వేయబోతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 103 బ్లాకుల గనులను వేలం వేశాయని.. ఈ వేలం ప్రక్రియలో 14 రాష్ట్రాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్??పై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డే అడ్డుకున్నారు. తన మిత్రుడు కేసీఆర్ పదేళ్లలో చేయని పని ఇప్పుడు చేస్తే రేవంత్‌రెడ్డికి పేరొస్తుందనే అలా చేశారని రేవంత్ ఆరోపించారు. నాకు రాష్ట్ర ప్రయోజనాల కంటే పేరు ముఖ్యం కాదు. కావాలంటే అనుమతులు, నిధులు తెప్పించి ఆ పేరును కిషన్‌రెడ్డినే తెచ్చుకోమనండి. నేను కూడా ఆయన పేరే ఊరూరా ప్రచారం చేస్తా. సన్మానం చేసి గండపెండేరం తొడుగుతా. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన 5 ప్రాజెక్టులకు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విన్నవించాం. వాటికి అనుమతులు, నిధులు తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదే. లేకపోతే వారిద్దరూ గుజరాత్‌కో.. ఇంకో రాష్ట్రానికో వెళ్లిపోవాలి. తెలంగాణలో వారికి తిండి దండగ' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి కిషన్ రెడ్డి ఘాటుగా బదులిచ్చారు.

## ఎన్ని చట్టాలు చేసినా.. కఠినంగా అమలు చేస్తేనే ఫలితం

తాము సురక్షితంగా ఉన్నామనే నమ్మకాన్ని మహిళలకు కలిగించాలన్నారు. ఇలాంటి కేసుల్లో సరైన దర్యాప్తు, కఠిన చర్యలు అత్యంత కీలకం అన్నారు.. న్యాయవ్యవస్థ, పోలీసులకు పెద్ద బాధ్యత ఉంది. వీరితో పాటు సమాజానికి కూడా అంతే బాధ్యత ఉందని జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. మహారాష్ట్రలోని పుణెలో 26 ఏళ్ల యువతిపై బస్సులో ఓ దుండగుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. రాజకీయంగా దుమారం రేపుతోంది. దీనిపై సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్ర చూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు .నిర్భయ ఘటన తర్వాత చట్టాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. కేవలం చట్టాలతోనే అలాంటి ఘటనలను నివారించలేం. అం దుకు ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు కూడా బాధ్యతతో వ్యవహరించాల్సి ఉందన్నారు.

## అసెంబ్లీకి రాకుండా ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్నారు

దాటేశారు. సభలో జై భీమ్ అని నినాదాలు చేసినందుకు మా పార్టీ ఎమ్మెల్యేలను మూడు రోజుల పాటు సస్పెండ్ చేశారు. ఇప్పుడు విధాన సభ ప్రాంగణంలోకి రాకుండా మమ్మల్ని అడ్డుకుంటున్నారు. దిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి దారుణం ఎన్నడూ చోటుచేసుకోలేదని ఆమె దుయ్యబట్టారు.

# ఐటీ రంగ అగ్రగామిగా తెలంగాణను నిలబెడతాం

- ఐటీ మంత్రి శ్రీధర్ బాబు




మంథని, (జనంసాక్షి) : హైదరాబాద్‌లో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ గ్లోబల్ డెలివరీ సెంటర్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డితో కలిసి మాట్లాడటం అద్భుతం అని, ఈ కొత్త క్యాంపస్ గేమ్ ఛేంజర్, 5,000 కొత్త ఉద్యోగాలను సృష్టించి, ఐటీ రంగ అగ్రగామిగా తెలంగాణ స్థానాన్ని పదిలపరుస్తుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. పరిశ్రమలలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులకు తెలంగాణను గమ్యస్థానంగా మార్చడమే తమ దృష్టి అని, దీన్ని సాధించడానికి, మేము స్కిల్ యూనివర్సిటీని స్థాపించాము మరియు స్కిల్లింగ్ ఇనిషియేటివ్‌లలో మాతో సహకరించడానికి హెచ్సిఎల్ టెక్నాలజీస్‌ను ఆహ్వానిస్తున్నామన్నారు. గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌లను గ్లోబల్ వాల్యూ సెంటర్‌లుగా మార్చడానికి మేము కట్టుబడి ఉన్నామని, తెలంగాణ యువతకు అధిక-విలువైన ఉద్యోగ అవకాశాలను భరోసా కల్పిస్తుందని, అత్యాధునిక డొమైన్‌లలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.

# మా చిన్న పరిశ్రమలు బతకాలంటే సింగరేణి బొగ్గు ధర తగ్గించాలి

- సింగరేణి ధర అందుబాటులో లేనందునే వేరే చోట కొనుగోలు చేస్తున్నాం
- మాపై ఆధారపడిన వేల మంది చిన్న ఉద్యోగుల ఉపాధి కూడా మాకు ముఖ్యమే
- సింగరేణితో ఏళ్ల తరబడి ఉన్న అనుబంధం కోల్పోవాలని కూడా లేదు
- సీఎండీ ఎన్.బలరామ్‌కు విద్యుత్తేతర బొగ్గు వినియోగదారుల విజ్ఞప్తి

(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)



బొగ్గు ఆధారిత సిమెంటు, స్పాంజ్, ఐరన్, సిరామిక్స్, ఫార్మా వంటి పరిశ్రమలు నేటి క్లిష్ట మార్కెట్ పరిస్థితుల్లో మనుగడ సాగించాలంటే సింగరేణి సంస్థ తన బొగ్గు ధరను తగ్గించాల్సిన అవసరం ఉందని విద్యుత్తేతర పరిశ్రమల యాజమాన్యాలు సింగరేణి సంస్థకు మొర పెట్టుకున్నాయి. ముఖ్యంగా తమ పరిశ్రమల మనుగడ, తమపై ఆధారపడిన వేల మంది స్థానిక చిరు ఉద్యోగుల భవిష్యత్ దృష్ట్యా తక్కువ ధరకు బొగ్గును విదేశాల నుంచి లేదా ఇతర బొగ్గు సంస్థల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు.

తొలిసారిగా అన్ని ఏరియాల జీఎంలు, క్వాలిటీ జీఎంలు, క్వాలిటీ ఇన్చార్జీలతో కలిసి సింగరేణి భవన్ లో గురువారం సంస్థ నిర్వహించిన విద్యుత్తేతర వినియోగదారుల సమావేశంలో దాదాపు 60కి పైగా సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. గత ఏడాది సింగరేణి ఉత్పత్తి చేసిన 70 మిలియన్ టన్నుల బొగ్గులో 9 మిలియన్ టన్నులను విద్యుత్తేతర వినియోగదారులు కొనుగోలు చేశారని, ఈ ఏడాది కేవలం 5 మిలియన్ టన్నులను మాత్రమే తీసుకోవడానికి కారణాలను ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ తెలుసుకున్నారు.

దీనిపై అన్ని సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ... సింగరేణి తో తమకు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. రవాణా సమస్యలు లేకుండానే సింగరేణి నుంచి బొగ్గు తీసుకునే అవకాశం కూడా ఉందన్నారు. కానీ, పోటీ మార్కెట్లో ఇప్పటికే తాము ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని, సింగరేణి బొగ్గు ధరలు ఎక్కువ ఉన్నందున తాము అంతకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కోలిండియా మరియు విదేశీ బొగ్గు వైపు మొగ్గు చూపాల్సి వస్తుందని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి బొగ్గును కొనుగోలు చేస్తున్నప్పటికీ సింగరేణి ధరతో పోల్చితే తక్కువకే లభిస్తోందన్నారు. బొగ్గు ధరను తగ్గిస్తే సింగరేణి నుంచి స్వీకరించడానికి సంసిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

బొగ్గు నాణ్యత విషయంలోనూ లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులకు సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ చేశారు. నాణ్యత విషయంలో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వినియోగదారుల ప్రయోజనాలను, సింగరేణి మార్కెట్ను రక్షించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలపై సమాలోచనలు జరిపి తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన రోజుల్లో సింగరేణి నుంచి బొగ్గును స్వీకరించాలని కోరారు. త్వరలో మరొక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), ఎగ్జిక్యూటివ్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభానీ , జీఎం(మార్కెటింగ్) డి.రవి ప్రసాద్, జీఎం(సీపీపీ) మనోహర్, ఓఎస్డీ (మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖరరావు, డీజీఎంలు సురేందర్ రాజు, శ్రీవాస్తవ, అడిషనల్ మేనేజర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నవభారత్, ఐటీసీ, ఓరియంట్ సిమెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, దివీస్ ల్యాబరేటరీస్, హెటిరో ఫార్మా, సిర్పూర్ పేపర్ మిల్స్ తదితర సంస్థల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

# 28న టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం



హైదరాబాద్ (జనంసాక్షి) : ఈనెల 28వ తేది శుక్రవారంనాడు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ లోని గాంధీభవన్ లో టిపిసిసి అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన టిపిసిసి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరుగుతుందని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జిగా నూతనంగా నియమితులైన మీనాక్షి నటరాజన్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఎఐసిసి కార్యదర్శులు విష్ణు నాథ్, విశ్వనాథన్ లతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర, జాతీయ రాజకీయాలు, కాంగ్రెస్ పార్టీ సంస్థాగత అంశాలపై చర్చ జరుగనున్నట్లు పేర్కొన్నారు.

# అబద్ధాలు పదేపదే చెబితే నిజాలుకావు

- పచ్చిఅబద్ధాలతోనే పరిపాలన సాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- హైడ్రాతో కూరుకపోయిన రియల్టీరంగం
- రాష్ట్రంలో పడిపోతున్న ఆదాయం : ఎమ్మెల్సీ కవిత




హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రజలకు పదేపదే అబద్ధాలు చెబితే అవి నిజాలు అవిపోతాయని సీఎం రేవంత్‌రెడ్డి భ్రమిస్తున్నారని.. కానీ అలా ఎప్పటికీ కావనే నిజాన్ని ఆయన గుర్తించాలని ఎమ్మెల్సీ కవిత ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. నెలకు రూ.6500 కోట్ల వడ్డీ కడుతున్నామని అబద్ధాలు చెబుతున్న సీఎం.. కాగ్ నివేదిక ప్రకారం ఏనెల కూడా రూ. 2600 కోట్లకు మించి వడ్డీ కట్టలేదని పేర్కొన్నారు. మరి రూ. 6500 కోట్లు కడుతున్నామని సీఎం ఎందుకు అబద్దాలు చెబుతున్నారు..? అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కనీసం ఇప్పుడైనా నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆదాయంపై కూడా రేవంత్ రెడ్డి తప్పుడు లెక్కలు చెబుతున్నారని ఆరోపించారు. ప్రతీ నెల 18 వేల కోట్ల ఆదాయం వస్తున్నదని సీఎం చెబుతున్నారు. కానీ కాగ్ ప్రకారం 12 వేల కోట్లకు మించి ఈ ఏడాది ఆదాయం రాలేదన్నారు. మరి ఈ అబద్ధలు లెక్కలు ఎందుకు చెప్తున్నట్లు..? ఎవరిని మభ్యపెట్టడానికి చెబుతున్నారు..? అని కవిత ప్రశ్నించారు. ఆదాయం పడిపోవడానికి ప్రధాన కారణం హైడ్రా అని తేల్చిచెప్పారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా 18 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. కానీ హైడ్రా విధ్వంసం వల్ల దాని ద్వారా ఆదాయం 5800 కోట్లకు పడిపోయిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్బీసీ పనులే జరగలేదని సీఎం పచ్చి అబద్ధాలు చెబుతున్నారని తెలిపారు. కేసీఆర్ విశాల హృదయం తెలవాలంటే ఎస్ఎల్బీసీ విషయంలో అర్థమవుతుందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఈ ప్రాజెక్టుపై కేసీఆర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ విషయంలో అప్పటి ప్రతిపక్ష నేత జానా రెడ్డిని ముందుపెట్టి కాంట్రాక్టర్‌కు 100 కోట్లు అడ్వాన్స్ కేసీఆర్ ఇచ్చారన్నారు. కరోనా తర్వాత కాంట్రాక్టర్ పనులు చేపట్టలేమంటే మళ్లీ 100 కోట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు 30 ఏళ్లలో ఈ ప్రాజెక్టుపై పెట్టిన ఖర్చు 3340 కోట్లు. కానీ కేవలం 10 ఏళ్లలో కేసీఆర్ పెట్టిన ఖర్చు 3890 కోట్లు. ఇంత ఖర్చు పెట్టి 11 కీమీ మేర టన్నెల్ తవ్విస్తే ముఖ్యమంత్రి అబద్దాలు చెబుతున్నారని కవిత మండిపడ్డారు. సొంత జిల్లాలో సొంత ఊరు పక్కన విపత్తు జరిగితే పట్టించుకోకుండా సీఎం ఢిల్లీ వెళ్లారన్నారు. 8 మంది ప్రాణాలు చిక్కుకుంటే ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారానికి వెళ్లడం సరికాదన్నారు. ఉత్తరాఖండ్‌లో టన్నెల్‌లో కార్మికులు చిక్కుకుంటే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెళ్లి వాళ్ల ప్రాణాలతో బయటపడేవరకు అక్కడే ఉన్నారని గుర్తుచేశారు. కానీ మన ముఖ్యమంత్రికి సోయి లేదు.. ఐరన్ లెగ్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నాలుగు ప్రాజెక్టులు కొట్టుకుపోయాయన్నారు. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిపోతే ఇప్పటికీ అతీగతీ లేదు.. ఖమ్మం జిల్లాలో పెద్దవాగు మీద మొత్తం ప్రాజెక్టు కొట్టుకుపోతే ప్రభుత్వం స్పందించలేదని దుయ్యబట్టారు. మెఘా కృష్ణా రెడ్డి కడుతున్న ప్రాజెక్టుల గురించి మాట్లావద్దన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సుంకిశాల ప్రాజెక్టు మీద ఒకరు ఆర్టీఐ వేస్తే దేశ భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి జవాబు ఇవ్వమని ప్రభుత్వం చెప్పింది అని కవిత గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు ముఖ్యమా కాంట్రాక్టర్లు ముఖ్యమా..? అని నిలదీశారు.

# నజాఫ్‌గఢ్ పేరును 'నహర్‌ఘర్'గా మార్చాలి

- ఢిల్లీ అసెంబ్లీలో ఎమ్మెల్యే నీలం పహల్వాన్ డిమాండ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) : తమ నియోజకవర్గాల్లో ఉన్న ముస్లిం పేర్లను మార్చాలంటూ గురువారం బిజెపి ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. 'నజాఫ్‌గఢ్' పేరును 'నహర్‌ఘర్'గా మార్చాలని బిజెపి ఎమ్మెల్యే నీలం పహల్వాన్ తన ప్రతిపాదనలలో పేర్కొన్నారు. మొఘల్ పాలకుడు ఔరంగజేబు నియోజకవర్గం పేరును మార్చారని, అసలు పేరును పునరుద్ధరించాలని ప్రతిపాదనలో పేర్కొన్నారు. ఆర్‌కెపురం నియోజకవర్గంలోని మహ్మద్‌పూర్ పేరును మాధవపూర్‌గా మార్చాలంటూ ఆర్‌కెపురం ఎమ్మెల్యే అనిల్ శర్మ సైతం అసెంబ్లీలో ప్రతిపాదన సమర్పించారు. తన నియోజకవర్గం ఢిల్లీ గ్రామీణ ప్రాంతానికి చెందినదని, హర్యానాలోని మూడు ప్రాంతాలకు సరిహద్దుగా ఉందని నీలం పహల్వాన్ అసెంబ్లీకి తెలిపారు. మొఘల్ పాలకుడు, చక్రవర్తి షాఆలం-2 నజఫ్‌గఢ్‌ను స్వాధీనం చేసుకున్నప్పుడు ఈ ప్రాంతంలో చాలా అణచివేత జరిగిందని అన్నారు. అనంతరం 1857 తిరుగుబాటు సమయంలో.. రాజానహర్ సింగ్ పోరాడి తిరిగి ఈ ప్రాంతాన్ని ఢిల్లీ ప్రావిన్స్‌లోకి తీసుకువచ్చారని అన్నారు. అప్పటి నుండి ఎంపి పర్వేష్ వర్మతో సహా తాము నజాఫ్‌గఢ్ పేరును నహర్‌ఘర్‌గామార్చేందుకు యత్నిస్తున్నామని అన్నారు. ఈమారు చాలా ముఖ్యమని, ముస్లింల హయాంలో ప్రజలు తీవ్ర అణచివేతకు గురయ్యారని, ఈ ప్రాంత రాజులు వారి ఉనికి కోసం పోరాడారని అన్నారు.

# నాగర్ కర్నూల్‌లో స్నేహ చికెన్ మేళా





- పెద్ద ఎత్తున హాజరైన మాంసాహార ప్రియులు
- చికెన్ పై అపోహాలు వద్దు : స్నేహ చికెన్ గ్రూప్ ఏజీఎం జి కృష్ణారెడ్డి

నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 27(జనంసాక్షి): చికెన్ పై అపోహలు వద్దని, నిరభ్యంతరంగా చికెన్ ను తినవచ్చని స్నేహ చికెన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఏజీఎం జి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో చికెన్ మేళాను స్నేహ చికెన్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ మేళా కు పెద్ద ఎత్తున మాంసాహార ప్రియులు హాజరై చికెన్, గుడ్లతో చేసిన వంటకాలను కడుపారా ఆరగిస్తూ ఆనందపడ్డారు. ఈ సందర్భంగా స్నేహ చికెన్ గ్రూప్ ఏజీఎం జి కృష్ణారెడ్డి మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వచ్చిందని చికెన్ తినవద్దని కొందరు ప్రచారం చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. చికెన్ కానీ, గుడ్లు కానీ 70 డిగ్రీల సెల్సియస్ వేడిలో ఉడికించే తింటే ఎలాంటి వైరస్ ఉన్నా పనిచేయదన్న విషయాన్ని గుర్తించాల న్నారు. అపోహాలు సృష్టించి చికెన్ తినవద్దని చెప్పే వారి మాటలు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహ చికెన్ గ్రూప్ నాగర్ కర్నూల్ జిల్లా టీం లీడర్ ప్రవీణ్ , శైలెందర్ రెడ్డి లతో పాటు చికెన్ సెంటర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన మహాకుంభ మహోత్సవం


- శివరాత్రి స్నానాలతో కుంభమేళాకు ముగింపు
- నభూతో..న భవిష్యత్ అన్న చందంగా సాగిన క్రతువు



ప్రయాగరాజ్, ఫిబ్రవరి27 (జనంసాక్షి) : మహాకుంభమేళా సంబరం ముగిసింది. అనూహ్యంగా ప్రపంచమంతా భారత్ వైపు చూసేలా ఈ ఆధ్యాత్మిక క్రతువు సాగింది. కోట్లాదిమంది హాజరై పుణ్యస్నానాలు చేసిన ఇతివృత్తం గతంలో ఎప్పుడూ జరగలేదని చెప్పవచ్చు. ఓ రకంగా ఇది న భూతో..న భవిష్యత్ అన్న తీరుగా సాగింది. 144 ఏళ్లకోసారి వచ్చే మహాకుంభమేళా మహాఘట్టం బుధవారంముగిసింది. జనవరి 13న మొదలైన ఈ మహా కుంభమేళా.. మహా శివరాత్రి పర్వదినంతో ముగిసింది.. చివరి రోజున భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహాకుంభమేళాలో మహాశివరాత్రి రోజున 2.5 కోట్లకు పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు.. ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున 45 రోజుల పాటు జరిగిన మహాకుంభమేళాలో ఇప్పటివరకు 65 కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు చేసినట్టు యూపీ ప్రభుత్వం వెల్లడించింది.. చివరి రోజున గణాంకాలు చూసుకుంటే.. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.. ఏడు శైవ అఖారాలకు, మహాకుంభ్-2025 బుధవారం నాడు గొప్ప ఊరేగింపుల తర్వాత కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలతో మహాశివరాత్రి నాడు ముగిసింది. ఊరేగింపులో భాగంగా, 10,000 మందికి పైగా నాగ సాధువులు, పండుగ ఉత్సాహాన్ని పెంచుతూ, కాశీ రోడ్ల గుండా తమ దేవతలు, జెండాలతో, త్రిశూలాలు, కత్తులు, గదలను ప్రదర్శిస్తూ 'హర్ హర్ మహాదేవ్' నినాదాల మధ్య పాడుతూ, నృత్యం చేస్తూ ప్రదర్శన చేశారు. శివరాత్రి రోజున పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తారు. చివరిరోజున కుంభమేళాలో భక్తులపై హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించారు.. ఆధ్యాత్మిక యాత్రకు వచ్చే వారిలో మరింత భక్తిభావం పెంచేలా ఇలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి పర్వదినం కూడా కలిసిరావడంతో 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీసంగమం ఘాట్లు మార్మోగాయి. కుంభమేళాలో చివరి అమృతస్నానం ఆచరించేందుకు భక్తులు అర్ధరాత్రి నుంచే పెద్దసంఖ్యలో ఘాట్ల వద్దకు చేరుకొన్నట్లు అధికారులు తెలిపారు. దేశం నలుమూలలతోపాటు నేపాల్ నుంచి కూడా భక్తుల బృందం ఒకటి తరలివచ్చింది. కుంభమేళా ప్రాంతంలోని అయిదు ప్రధాన శివాలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలీవుడ్ ప్రముఖనటి ప్రీతి జింటా బుధవారం త్రివేణీసంగమంలో పుణ్యస్నానం చేశారు. కుంభమేళాకు తాను రావడం ఇది మూడోసారి అంటూ ఆమె తన 'ఎక్స్' హ్యాండిల్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సీనియర్ అధికారులతో కలిసి గోరఖ్‌పుర్ కంట్రోల్ రూములో తెల్లవారుజామున 4 గంటల నుంచే ఏర్పాట్లను పర్యవేక్షించారు. జనవరి 13న మొదలై నాగ సాధువుల ఊరేగింపులు, మూడు అమృత స్నానాలతో వైభవంగా 45 రోజులపాటు కొనసాగిన మహా కుంభమేళా ప్రశాంతంగా ముగిసింది. మహాశివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతుండటంతో మరోసారి యూపీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడ ఆంక్షలను అమలు చేస్తూ? అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. కుంభమేళా ప్రాంతాన్ని ఇప్పటికే నో వెహికిల్ జోన్‌గా ప్రకటించి.. సిబ్బందిని భారీగా మోహరించారు. కాగా.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు సీనియర్ అధికారులతో మాట్లాడుతూ.. శివరాత్రి వేడుకలు సజావుగా జరిగేలా చూశారు.

# నిధులు తీసుకెళ్తే భరిస్తున్నాం.. సీట్లు తగ్గిస్తే ఊరుకోం

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్..



కరీంనగర్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) : దక్షణాది రాష్ట్రాల్లో పునర్విభజనలో భాగంగా పార్లమెంట్ సీట్లు తగ్గిస్తే దేశం విచ్ఛిన్నం అవుతుందని మాజీ పార్లమెంట్ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బోయినపల్లి వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. గురువారం కరీంనగర్‌లోని వాణీనికేతన్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్న వినోద్‌కుమార్ అనంతరం స్థానిక మీడియాతో మాట్లాడారు. దక్షిణ భారత దేశంలో జనభా లెక్కల ప్రకారం పార్లమెంట్ సీట్లు తగ్గిస్తే ఎవ్వరు ఊరుకోరని అన్నారు. అయితే, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వాఖ్యల ప్రకారం చూస్తే సీట్లు తగ్గించే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం లేదని అనుకోవల్సి వస్తోందన్నారు. ప్రస్తుత జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేపడితే ఉత్తరాదికంటే దక్షిణ భారతంలో సీట్లు తగ్గుతాయని తమిళనాడు సీఎం స్టాలిన్ చేసిన ప్రతిపాదనలో వాస్తవం ఉందన్నారు. దీనిపై అఖిలపక్షాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. స్టాలిన్‌తోపాటు చంద్రబాబు మరింత ముందుకెళ్లి సీఎంలు ఎక్కువ మంది పిల్లల్ని కనాలని దక్షిణ భారత దేశ పౌరులకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. పార్లమెంట్ స్థానాల పునర్విభజనలో దక్షిణ భారత దేశంలో సీట్లు తగ్గుతాయని స్టాలిన్ చెప్పిన విషయంలో వాస్తవం ఉందని, అలాగే సీట్లు తగ్గవని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెప్పిన విషయంలోనూ వాస్తవం ఉందని అన్నారు. ఎందుకంటే 1971లో డీలిమిటేషన్ ప్రకటించిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ అప్పట్లోనే దక్షిణ భారత దేశంలో జనాభా తగ్గుతుందన్న విషయాన్ని గమనించి రాజ్యాంగ సవరణ చేశారని, 20 ఏండ్ల వరకు 1971 సెన్సెస్ ప్రకారమే పార్లమెంట్ స్థానాలు కొనసాగాలని రాజ్యాంగ సవరణ తెచ్చారని అన్నారు. 2001లో వాజ్‌పాయ్ ప్రభుత్వం మరో ఈ రాజ్యాంగ సవరణను 25 ఏండ్ల వరకు కొనసాగేలా సవరణ చేసిన విషయాన్ని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ గుర్తు చేశారు. 2026తో ఈ గడువు ముగుస్తుందని, తిరిగి రాజ్యాంగ సవరణ చేసే ఉద్దేశంతోనే దక్షిణ భాతర దేశంలో పార్లమెంట్ సీట్లు తగ్గవని ప్రకటన చేసి ఉంటారని తాను భావిస్తున్నానని స్పష్టం చేశారు. జనాభా లెక్కల ప్రకారం దక్షిణ రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయని తమిళనాడు సీఎం స్టాలిన్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్న వాఖ్యలు కరెక్టేనని తెలిపారు. అదే విధంగా అమిత్ షా సీట్లు తగ్గవని చేసిన ప్రకటనలు కూడ కరెక్టేనని అనుకొవచ్చునని అయితే దానికి గతంలో చేసిన రాజ్యాంగ సవరణను కొనసాగించాలన్నారు. 2026లో మరోసారి రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్ సీట్ల పెంపు విషయంలో 1971లోని నిష్పత్తి కొనసాగించాలన్న ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని తాను భావిస్తున్నానని తెలిపారు. అందుకే అమిత్ షా అలాంటి ప్రకటనలు చేశారని అనుకుంటున్నట్లు తెలిపారు. అలాంటి చట్టానే కేంద్ర ప్రభుత్వం 2026లో తీసుకువస్తుందని భావిస్తున్ననని పేర్కొన్నారు. ఇదే జరిగితే పార్లమెంట్‌లో సీట్లు పెరిగిన కూడ 1971లోని నిష్పత్తిలోనే సీట్లు పెరుగుతాయని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.100 కేంద్రానికి ఇస్తే తిరిగి రూ.49 మాత్రమే తెలంగాణకు ఇస్తుందన్నారు. అదే ఉత్తరప్రదేశ్ రూ.100 కేంద్రానికి ఇస్తే ఆ రాష్ట్రానికి రూ.499 ఇస్తున్నదని, అలాగే బీహార్ రూ.100 కేంద్రానికి ఇస్తే వారికి రూ. 600 తిరిగి ఇస్తున్నదని అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు వినోద్‌కుమార్ వెంట ఉన్నారు..

# ముగిసిన ఈస్ గాం జాతర ఉత్సవాలు



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 27 ( జనం సాక్షి) : కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం లోని ఈస్ గాం శివాలయంలో జరుగుతున్న జాతర ఉత్సవాలు గురు వారంతో ముగిశాయి. ఈనెల 25వ తేదీన ప్రారంభమైన జాతర ఉత్సవాలు మూడు రోజులపాటు జరిగాయి. ఈ సందర్భంగా దేవస్థానం కార్య నిర్వాహక అధికారి వేణుగోపాల్ గుప్తా, ఆలయ చైర్మన్ మైలారపు మురలీధర్ ల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారు. కాగజ్ నగర్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రామానుజన్ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ రూరల్ సిఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ఇస్గం ఎస్ఐ మహేందర్, కాగజ్ నగర్ రూరల్ ఎస్సై సందీప్ కుమార్ ఆధ్వర్యంలో 250 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటు నిర్వహించారు. 3 వ రోజున భక్తులు శివ మల్లన్న స్వామికి బోనాలు నైవేద్యంగా వండి సమర్పించారు. జాతర సందర్భంగా భక్తులకు దాతలు అన్నప్రసాదాలు, మంచినీరు, పండ్లు పంపిణీ చేశారు.



## అడ్వొకేట్ సవరణ బిల్లు 2025

# న్యాయపరమైన స్వాతంత్ర్యానికి - న్యాయవాదుల హక్కులకు ముప్పు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అడ్వొకేట్ సవరణ బిల్లు 2025, దేశంలోని న్యాయవాదులు, న్యాయపరమైన వృత్తిపరుల మధ్య విస్తృత ఆందోళనలను రేకెత్తించింది. ఈ బిల్లు న్యాయవాదుల హక్కులను తగ్గించడమే కాకుండా, న్యాయపరమైన స్వాతంత్ర్యానికి గణనీయమైన ముప్పును తెస్తుందని విమర్శకులు వాదిస్తున్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) పై కేంద్ర ప్రభుత్వానికి అపూర్వమైన నియంత్రణను అందించడం మరియు న్యాయవాదులపై కఠినమైన నిబంధనలను విధించడం ద్వారా, ఈ బిల్లు న్యాయవృత్తి యొక్క స్వయంప్రతిపత్తిని తగ్గించే ప్రయత్నంగా పరిగణించబడుతోంది. ఇది న్యాయవ్యవస్థ యొక్క స్వాతంత్ర్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఈ బిల్లులోని అత్యంత వివాదాస్పదమైన నిబంధనలలో ఒకటి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో కేంద్ర ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యులను ఉండాలనే నిబంధన. ఈ చర్య బిసిఐని కార్యనిర్వాహక శాఖ యొక్క ప్రత్యక్ష ప్రభావంలోకి తీసుకువస్తుంది. ఇది న్యాయవ్యవస్థ యొక్క పనితీరులో రాజకీయ జోక్యానికి దారితీస్తుందనే భయాలు అడ్వకేట్స్ లో కలిగిస్తున్నాయి. ఈ బిల్లు బిసిఐకి చట్టం క్రింద నియమాలను అమలు చేయడానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలను జారీ చేసే అధికారాన్ని ఇస్తుంది. ఇది కౌన్సిల్ పై కేంద్ర ప్రభుత్వం యొక్క నియంత్రణను మరింత బలోపేతం చేస్తుంది. న్యాయపరమైన నిపుణులు, అటువంటి చర్యలు ప్రజాస్వామ్య సమాజం యొక్క పనితీరుకు మూలాధారమైన అధికారాల విభజన సూత్రానికి బహిరంగంగా ఉల్లంఘనగా వాదిస్తున్నారు.

ఈ బిల్లు న్యాయవాదులకు కఠినమైన శిక్షలను కూడా ప్రవేశపెట్టింది. ఇందులో హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ద్వారా ధృవీకరించబడిన మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించబడిన ఏ న్యాయవాది అయినా బార్ కౌన్సిల్ సభ్యత్వం అటోమ్యాటిక్‌గా రద్దు చేయబడుతుంది. ఈ నిబంధన నైతిక ప్రమాణాలను పాటించడానికి అని పైకి కనిపించినప్పటికీ, ఇతర వృత్తులకు లేదా రాజకీయ నాయకులకు లేనటువంటి కఠినమైన నియమాలు వర్తింపచేయటం తగదని విమర్శకులు భావిస్తున్నారు.

ఈ అసమానత, న్యాయ వాద వృత్తి లోపల అసమ్మతిని అణచివేయడానికి ఎంపిక చేసిన లక్ష్యంగా కనపడుతుంది. అదనంగా, మూడు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష విధించబడే నేరం కోసం విచారణలో ఉన్న ఏ న్యాయవాది అయినా బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా చేసే నిబంధన, కూడా అభ్యర్థులపై తప్పుడు కేసులను రూపొందించడానికి చట్టాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని అడ్వకేట్లు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాల కాంతిలో, అడ్వొకేట్ సవరణ బిల్లు 2025కి వ్యతిరేకంగా ప్రతి బార్ అసోసియేషన్ నిలబడటం చాలా అవసరం. న్యాయవృత్తి యొక్క స్వాతంత్ర్యాన్ని, న్యాయపరమైన వృత్తిపరుల హక్కులను అలాగే న్యాయవ్యవస్థ యొక్క స్వయంప్రతిపత్తిని కాపాడటానికి న్యాయవృత్తి పరులు ఐక్యతకలిగి ఉండాలి. అలా చేయకపోతే, ప్రజాస్వామ్యం యొక్క మూల స్తంభంగా న్యాయవ్యవస్థ తన స్వాతంత్ర్యం కోల్పోవడానికి దారితీస్తుంది. ఈ బిల్లు గురించి చర్చ కొనసాగుతున్నప్పటికీ, ప్రజాస్వామ్యం యొక్క బలం దాని సంస్థల స్వాతంత్ర్యంలో ఉందని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యమైన విషయం. ఇప్పుడు ఆ స్వాతంత్ర్యాన్ని రాజీ పడే ఏ ప్రయత్నాన్ని అయినా అచంచలమైన దృఢత్వంతో వ్యతిరేకించితీరాలి.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్. 9849328496.**

# లింగ సమానత్వ సాధనలో మహిళా-గ్రంథాలయాలు

గ్రంథాలయాలు జ్ఞాన మార్గాలుగా భావించబడుతున్నప్పటికీ, ఇవి అందరికీ సమానంగా అందుబాటులో లేవు. గతంలో నుండి నేటి వరకు, మహిళలు గ్రంథాలయాలకు వెళ్లడంలో అనేక అడ్డంకులను ఎదుర్కొన్నారు. సామాజిక నియంత్రణలు, ఆర్థిక పరిమితులు, లైంగిక వివక్ష ఇవన్నీ మహిళల గ్రంథాలయ ప్రవేశాన్ని నిరోధించాయి. ఆధునిక యుగంలోనూ పూర్తిస్థాయిలో కలిసివెళ్లే వాతావరణం నెలకొని ఉందని కూడా చెప్పలేం.

గత చరిత్రను పరిశీలిస్తే, పురుషాధిపత్యం ఉన్న సమాజాలలో మహిళలకు గ్రంథాలయ ప్రవేశం నిషేధితంగా ఉండేది. అనేక దేశాలలో మహిళలకు లింగ వివక్షతతో విద్యను అందించటంలో స్వయంగా దూరంగా ఉండటంతో, గ్రంథాలయాల ప్రాముఖ్యత జనభాలో దాదాపు సగ భగస్వామ్యం ఉన్నప్పటికీ వారికి అర్థం కాకపోయింది. అందుకే గ్రంథాలయ సేవలు పూర్తిగా వినియోగించుకోలేక పోయారు. మరికొన్ని సమాజాల్లో, మహిళలు కొన్ని ప్రత్యేకమైన ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన గ్రంథాలను మాత్రమే పఠించాలనే నియమాలు ఉండేవి. తదనంతర కాల ప్రవాహంలో మహిళల విద్య, అక్షరాస్యత, మేధో స్వేచ్ఛ కోసం జరిగిన అనేక పోరాటంల ఫలితంగా గ్రంథాలయ ప్రవేశం కూడా ఒక భాగంగా మారింది. 19వ మరియు 20వ శతాబ్దాల్లో, మహిళలు గ్రంథాలయాలకు వెళ్లలేకపోవడంతో, తమ వ్యక్తిగత పుస్తకసంపదలను కొందరు సంపన్నులు ఉన్నత వర్గాలు, కుటుంబాలు పరిమితంగా ఏర్పాటు చేసుకున్నాయి.

సమాజ అభివృద్ధి క్రమంలోనే జ్ఞాన ముపార్జనపై లింగ ఆధారిత నిర్బంధాలు క్రమంగా తొలగించాల్సిన అవసరం సమాజం చేత గుర్తించబడింది. పశ్చిమ దేశాలలో ప్రభుత్వ గ్రంథాలయాలు మహిళలకు స్వాగతం పలుకుతూ అందుబాటులోకి వచ్చాయి. మహిళా గ్రంథపాలకుల సంఖ్య కూడా క్రమంగా పెరగడం వల్ల ప్రభుత్వ పాలసీలు మరింత స్త్రీ-స్నేహంగా మారా యి. అయితే, ఈ మార్పు అన్ని దేశాలలో,అన్ని ప్రాంతాల్లో సమానంగా జరగలేదు. ఇంకా చాలా దేశాల్లో మహిళలు గ్రంథాలయాలను ఉపయో గించడంలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతి అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. పని సమయాలు, రవాణా సమస్యలు, భద్రతా భయాలు ఇవన్నీ మహిళలను ఈ జ్ఞాన కేంద్రాలుగా పిలువబడే (నాలెడ్జ్ సెంటర్స్) గ్రంథాలయాల నుండి దూరం చేయిస్తున్నాయి. డిజిటల్ గ్రంథాలయాలు అలాగే ఆన్‌లైన్ వనరులు అందుబాటులోకి రావడంతో పరిస్థితిలో కొంత మెరుగయ్యింది, కానీ సమస్య పూర్తిగా పరిష్కారమయ్యిందని చెప్పలేం. మహిళలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు, డిజిటల్ టూల్స్, ఇంటర్నెట్ యాక్సెస్, తగిన స్థాయిలో టెక్నికల్ నాలెడ్జ్ లేకపోవడం



వల్ల కూడా ఈ వనరులను సమర్థంగా ఉపయోగించ లేకపోతున్నారు. పైగా, కుటుంబం, సమాజిక నియంత్రణలు ఇంకా కొన్ని దేశాలలోనూ,సమాజాలలోనూ కొనసాగుతున్నాయి. మహిళలు ఏవి చదవాలి? ఏవి చదవకూడదు? అనే విషయాల్లో మహిళేతరులే ఇంకా నిర్ణయాలు తీసుకుంటున్నారు.

ఈ అసమానతలను తగ్గించాలంటే గ్రంథాలయ వ్యవస్థను మరింత ఉద్దేశపూర్వకంగా రూపొందించి,వాటి సేవలను మెరుగు పర్చాలి. ఉద్యోగాల్లో ఉన్న మహిళల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రంథాలయాల పనివేళలను సౌకర్యవంతగా మార్చాలి. మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలి. వారికి అవసరమైన శాస్త్రీయ, సాహిత్య, రాజకీయ, సామాజిక అంశాలపై మరింత సమాచారం అందుబాటులో ఉంచాలి. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ లైబ్రరీలు సంఖ్య పెంచాలి. అలాగే ప్రతి గ్రామంలో గ్రంథాయాలను ఏర్పాటు చేసి,వాటి పట్ల అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎక్కువ మందిని గ్రంథాలయ సభ్యులుగా చేరుకోవచ్చు. పుస్తకాలను,పేపర్లను చదవడం ఒక అలవాటుగా, వ్యసనంగా మార్చటం అవసరం. బాలబాలికల, గ్రంథాలయాలను ప్రతి గ్రామంలోనూ, పాఠశాలల్లోనూ ఏర్పాటు చేయాలి, ఇదో ఉద్యమంలా కొనసాగే ప్రక్రియ. స్థానిక, ప్రాంతీయ గ్రంథాలయాల స్థాపన ప్రభుత్వంతో పాటు, స్వచ్ఛంద సంస్థలుఅందుకు పూనుకోవాలి. మహిళలు గ్రంథాలయాల నిర్వహణలో అధిక పాత్ర పోషిస్తే, మరింత సమానత్వాన్ని సాదించగలిగే పాలసీలు రూపొందించవచ్చు.

గ్రంథాలయాల్లో మహిళల హాజరు కేవలం ప్రవేశ హక్కుతో మాత్రమే సంబంధం కలిగిందని భావించరాదు. వారి ప్రాతినిధ్యం కూడా చాలా ముఖ్యమైన అంశం. ఒక మహిళ గ్రంథాలయానికి వెళ్తే, తనకు తగిన సమాచారం అక్కడ కనిపించాలి. సాహిత్యం, శాస్త్రీయ పరిశోధనలు, రాజకీయ భావజాలయిఇవన్నీ మహిళా రచయితల కృషిని ప్రతిబింబించాలి. పురుషాధిక్యత ఉన్న సమాజాలలో శాస్త్రీయ, సాంకేతిక రంగాల్లో మహిళల కృషిని ప్రదర్శించ గలిగే అవకాశాలు ఏర్పడితే, తదుపరి తరాలకు అవి స్ఫూర్తినిస్తాయి.

గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిల్వగదులుగా కాకుండా, అభ్యాసం, చర్చల వేదికలుగా ఉండాలి. సమాజిక అభివృద్ధిలో భాగంగా మహిళలు గ్రంథాలయాల వినియోగంలోనూ,సేవల విస్తరణలో ఎక్కువగా పాల్గొంటే, అది వ్యక్తిగత స్థాయిలోనే కాకుండా, సామూహిక పురోగతికి దోహదం చేస్తుంది. ఒక సమానత్వ ప్రధానమైన గ్రంథాలయ వ్యవస్థ, మహిళల విద్య లోటుపాట్లను తీర్చడంలో, వారి కెరీర్ అభివృద్ధిని మెరుగుపరచడం లోనూ, స్వతంత్ర ఆలోచనలను ప్రోత్సహించడంలోనూ సహాయపడుతుంది.

ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ సంస్థలు, విద్యా సంస్థలు ఈ అంశాన్ని ప్రాముఖ్యతనిచ్చేలా చూడాలి. గ్రామీణ ప్రాంతాలలో, అణగారిన వర్గాలల్లో గ్రంథాలయాల విస్తరణకు, నిర్వాహణకు మరింత నిధులు కేటాయించాలి. బాలికలకు ప్రత్యేకంగా పఠన కార్యక్రమాలు (రీడింగ్ రూమ్)అవకాశాలు మెరుగు పర్చాలి. మహిళలకు లైబ్రరీ సైన్స్‌లో విద్యార్థి వేతనాలు, మహిళా పరిశోధకులకు మార్గదర్శకత్వం వంటి అవకాశాలను ప్రభుత్వ పరంగా వికేంద్రీకృతం చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

గ్రంథాలయాలు లింగ సమానత్వానికి ఒక బలమైన సాధనంగా మారగలుగుతాయి. కానీ, ప్రవేశం మాత్రమే సరిపోదు. ప్రతి మహిళల జీవన స్థాయి, సామాజిక నేపథ్యం, భౌగోళిక పరిమితి ఏదైనా అయినా సరే, ఆమెకు గ్రంథాలయ సేవలు పూర్తి స్థాయిలో అందించటానికి కృషి చేయాలి. ఈ ప్రయత్నాలు జరిగితే, గ్రంథాలయాలు నిజమైన ప్రజా జ్ఞాన కేంద్రాలుగా (నాలెడ్జ్ హబ్‌లుగా) మారతాయి. మహిళలను పురుషులతో పాటు సమానంగా గ్రంథాలయాల్లో చేర్చుకోవడం అనేది ఒక ప్రక్రియ మాత్రమే. ఇది కేవలం లింగ సమానత్వం మాత్రమే కాదు, అది మరింత జ్ఞానం, పురోగతి, సమగ్ర సమాజాన్ని ఆవిష్కరించే దిశగా ముందడుగు వేయటం అవుతుంది.



**డాక్టర్. రాధికా రాణి**
అసిస్టెంట్ ప్రొఫెసర్,
హెడ్ లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ డిపార్ట్మెంట్, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్.
8074317172.



# ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగిసేనా!



మూడేళ్ల నుంచి కొనసాగుతున్న ఉక్రెయిన్- రష్యా యుద్ధం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో ముగిసే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. 2022 నుంచి జరుగుతున్న ఈ యుద్ధంలో లక్షల మంది తమ ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ సైనికులే 70 వేల మంది దాకా ప్రాణాలు కోల్పోయిన దాఖలాలు ఉన్నాయి. మూడు సంవత్సరాల నుంచి యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే 20 శాతం ఉక్రెయిన్ భూభాగాన్ని రష్యా ఆక్రమించుకున్నది. మరోవైపు ఉక్రెయిన్‌కు యూరప్ అమెరికా సహాయం అందిస్తూ వస్తున్నది.

**యుద్ధ విరమణ మీద రియాద్‌లో చర్చలు!**

ఇప్పుడు రియాద్‌లో ఉక్రెయిన్ లేకుండానే యుద్ధ విరమణపై చర్చలు కొనసాగుతున్నాయి. అయితే అధ్యక్షుడు జెలెన్స్కి లేకుండానే ఈ చర్చలు సఫలం అవుతాయా, అనేది చూడాల్సి ఉంది. అమెరికా, రష్యా ఆక్రమణ ప్రాంతాన్ని వదిలేయాల్సి ఉంటుందని, షరతు పెడుతున్నది. ఈ షరతు కూడా యుద్ధ విరమణ అంగీకారం జరుగుతే జెలెన్స్కీ అంగీకరించే అవకాశం ఉంది అంటున్నారు.

**ఉక్రెయిన్ సంపదపై అమెరికా కన్ను!**

ఏది ఏమైనా ఉక్రెయిన్ సహజ సంపద మీద అమెరికా కన్ను పడింది. అనేది చాలా స్పష్టంగా ఇక్కడ కనిపిస్తున్నది. ఉక్రెయిన్ సహజ సంపద మీద అటు రష్యా ఇటు అమెరికాకు దృష్టిపడింది. ఈ పరిస్థితిలో కూడా యుద్ధ విరమణకు ఉక్రెయిన్ ముందుకు వస్తున్నది. ఇప్పటికే పెద్ద ఎత్తున వ్యవసాయం దెబ్బతిన్నది. ఇతర వ్యాపార రంగాలు కూడా దెబ్బతిన్నాయి. విద్య , వైద్య రంగాలు దెబ్బతిన్నాయి. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆర్థికపరమైనటువంటి నష్టం భారీగా ఉక్రైన్‌కు జరిగింది. యుద్ధ విరమణ తర్వాత కూడా తేరుకోవడానికి ఉక్రెయిన్‌కు అయిదారు, సంవత్సరాలు పట్టే పరిస్థితి ఉంది. అక్కడ ఎన్నికలు కూడా జరగాల్సి ఉంది. ప్రస్తుతం మార్షల్ లా విధించి ఉంది. మరోవైపు యుద్ధం, ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని, ఎన్నికలు కూడా వాయిదా వేసే అవకాశం ఉంది ఎన్నికలు జరిగినా దేశాన్ని కాపాడడానికి మూడేళ్ల నుంచి కృషి చేసిన జిలెన్స్కి వైపే జనం మొగ్గు చూపే అవకాశం ఉంది. సహజ వనరుల మీద ఆక్రమణకు అమెరికా చాలా కాలంగా ఎదురుచూస్తున్నది. ఇప్పుడు ఆ అవకాశం అమెరికాకు లభించింది. ఈ అవకాశాన్ని పోగొట్టుకోకూడదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భావిస్తున్నాడు మల్లె కనిపిస్తున్నది. అటు గాజా మీద ఇజ్రాయిల్ యుద్ధ విరమణ కోసం ట్రంప్ ప్రయత్నం చేసింది కూడా గాజా ఆక్రమణ ఉద్దేశంతోనే అనేది జగం ఎరిగిన సత్యం!ఈ మేరకు ఉక్రైన్‌కు షరతులు విధించే పరిస్థితి ఉంది.

**భారతీయ కంపెనీల కట్టడి!**

ఇటు భారతదేశానికి సంబంధించి నాలుగు భారతీయ కంపెనీల మీద అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ పలు కట్టడులను విధించడానికి సిద్ధమయ్యారు.. అమెరికా , రష్యా లు కలిసి ఉక్రేన్ ను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. మన దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా పరిణామాలపై ట్రంప్ మాటల మీద ఏ మాత్రం స్పందించడం లేదు. కనీసం మాట్లాడడం లేదు. 21 మంది జవాన్ల ను బలిగొన్న చైనా మన ప్రాంతాల్లో ఆక్రమణకు గురిచేసినా కనీసం మన పీఎం నోరు తెరవలేదు. ఆయన విదేశీ పాలసీ ఏమాత్రం అర్థం కావడం లేదు. రాహుల్ గాంధీ లాంటి వారు వాస్తవ పరిస్థితులను వెల్లడిస్తే, ఆయనను బీజేపీ వాళ్లు ఒక టూల్ కిట్ పట్టుకుని దేశ ద్రోహి అంటారు. ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి సంబంధించి మన దేశం జోక్యం, మధ్యవర్తిత్వం, ఏమీ కనిపించడం లేదు. మొత్తంగా ఏకపక్షంగా ట్రంప్ అన్ని తానైనట్టు చేసుకుంటూ, మాట్లాడుకుంటూ ముందుకు వెళ్ళిపోతున్నారు. టారిఫ్ ల పెంపు తదితర విషయాలపై కూడా ఏమాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు.

**భారత్‌ను అవమానించే ఆరోపణలు!**

పైగా ఎన్నికలలో పోలింగ్ పెంచుకోవడం కోసం అమెరికా సహాయం తీసుకున్నారని, ఒక దుమారం లేపాడు. ఈ విధంగా ఇండియాను అవమాన పరిచే మాటలు ట్రంప్ మాట్లాడుతున్నాడు. ఇరాన్ నుంచి వస్తున్న ఆయిల్ పై కూడా నియంత్రణ చేసే పరిస్థితి ఆయన మాటలలో కనిపిస్తున్నది. ఇరాన్ ను ప్రపంచ పటం నుంచి మాయం చేసేస్తానంటాడు, ఆయన దాదాగిరికి అసలు అంతులేకుండా అవుతున్నది. మొత్తంగా ప్రపంచాన్ని తన గుప్పిట్లో పెట్టుకోవాలని అందులో ప్రత్యేకంగా బ్రిక్స్ భాగస్వామ్య దేశాల మీద ఆధిపత్యం కొనసాగించాలని ట్రంపు భావిస్తున్నట్లుగా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**ట్రంప్ ను అడ్డుకున్న ఫ్రెంచ్ అధ్యక్షుడు!**

ఇటీవల ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మునల్ మార్కోన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టినప్పుడు అమెరికానే ఉక్రెయిన్ కు సహాయం చేస్తూ వచ్చిందని, పేర్కొన్నప్పుడు అభ్యంతరం తెలుపుతూ ఫ్రెంచ్ అధ్యక్షుడు యూరప్ 60% సాయం అందించిందని స్పష్టం చేయడం జరిగింది. ఇలాంటి అభ్యంతరం మన ప్రధానమంత్రి మోడీ ట్రంపులు కలిసి అమెరికాలో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టినప్పుడు ట్రంపు ఇండియాకు సంబంధించి ఎన్నో అభ్యంతరకరమైన విషయాలను మాట్లాడిన సందర్భంగా కనీసం మన ప్రధాని నోరు తెరవలేదు ఫ్రెంచ్ అధ్యక్షుడు మాత్రం ఎలాంటి శషభిషలు లేకుండా ట్రంప్ మాటలను నిజం కాదు, అని ఆయన ముందే చెప్పేశారు. కనీసం ఈ విషయాలపై మన దేశానికి వచ్చిన తర్వాత కూడా ప్రధాని మోడీ మాట్లాడలేదు. ఒక క్లారిటీ ఇవ్వలేదు.ఋమీడియా ఆహా ఓహో!ఋ-ఇక మన ప్రభుత్వ ఒడిలో మీడియా మాత్రం ప్రధానికి ట్రంప్ ఘన స్వాగతం, ఆహా, ఓహో అంటూ ముచ్చట్లు చెప్పింది. మొత్తానికి అమెరికా ఇప్పుడు తన దాదాగిరీని ఇండియాపై కూడా ఇలాగే మౌనంగా ఉంటే తప్పనిసరిగా కొనసాగించే పరిస్థితి ఉంటుంది. ఉక్రెయిన్ ,రష్యా యుద్ధ విరమణ పై ఒక నిర్ణయం జరిగిన తర్వాత చాలా విషయాలపై ప్రపంచంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంటుందంటే అతిశయోక్తి కాదు. ఇందుకోసం మరికొంత కాలం వేచి ఉండాల్సిందే. ఇప్పటికే ట్రంప్ నిర్ణయాల మీద అమెరికా లోనూ , బయట ప్రపంచంలో నిరసన వ్యక్తం అవుతున్నది. నివురుగప్పిన నిప్పులా పరిస్థితి ఉన్నది !



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# లియో టాల్ స్టాయ్

## జీవితం, సాహిత్యం- విద్యా తత్త్వశాస్త్రంపై ప్రభావం

లియో టాల్ స్టాయ్, చరిత్రలో గొప్ప సాహిత్య ప్రముఖుల్లో ఒకరుగా మాత్రమే కాకుండా, విద్యావేత్తగా, తాత్త్వికుడిగా కూడా గుర్తింపు పొందారు. ఆయన అభ్యాసం, నైతికత, మరియు ఆత్మోన్నతిపై తన ఆలోచనల ద్వారా రష్యాతో సహా ప్రపంచవ్యాప్తంగా విద్యా వ్యవస్థలపై ప్రగాఢమైన ప్రభావాన్ని చూపారు. బాల్యం నుండి సాహిత్య, తాత్త్విక ప్రయాణం వరకు, టాల్ స్టాయ్ యొక్క కృషి విద్యారంగాన్ని ప్రభావితం చేస్తూ, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచింది.

1828లో ఒక ధనిక రష్యన్ కుటుంబంలో జన్మించిన టాల్ స్టాయ్ బాల్యంలోనే అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి, బంధువుల సంరక్షణలో పెరిగారు. అతని విద్యాభ్యాసం అసమంజసంగా ఉండడంతో, విశ్వవిద్యాలయంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొని మధ్యలోనే చదువు మానేశారు. ఈ అనుభవాలు ఆయనకు సంప్రదాయ విద్యా విధానాలపై అసంతృప్తిని కలిగించాయి, తద్వారా భవిష్యత్తులో విద్యా సంస్కరణలపై దృష్టి సారించేందుకు ప్రేరేపించాయి.

టోల్స్టాయ్ జీవిత ప్రయాణం అనేక మలుపులను ఎదుర్కొంది. ఆయన సైన్యంలో సేవలు అందించటమే కాకుండా, విస్తృతంగా ప్రయాణించి, రైతుల మధ్య జీవించి వారి కష్టాలను అర్థం చేసుకున్నారు. ఈ అనుభవాల నేపథ్యంలో "వార్ అండ్ పీస్", "అన్నా కరేనినా" వంటి అద్భుత సాహిత్య కృతులు రచించి, మానవ స్వభావాన్ని, నైతికతను, సామాజిక సమస్యలను లోతుగా అధ్యయనం చేశారు. ఆ భావాలను తన రచనలలో చక్కటి విశ్లేషణ చేశారు. అయితే,ఆయన సాహిత్య విజయాన్ని అధిగమించి, ఆయన విద్యావ్యవస్థపై తనదైన ఆలోచనలతోనూ,తన నిజ జీవితానుభవాల నుంచి తెలుసుకున్న, గ్రహించిన విషయాలను ఆయన సాహితంలో అనేక చోట్ల చొప్పించారు. అవి కాలక్రమంలో రష్యా విద్యా రంగంలో,ప్రపంచ విద్యా తాత్త్విక చరిత్రలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడానికి ఉపయోగపడ్డాయి.

విద్యారంగంలో టాల్ స్టాయ్ చేసిన కృషి సమకాలీన యుగానికి చాలా ముందుంది. 1860ల్లో, తన యాస్నయా పోల్యానా ఎస్టేట్‌లో రైతు పిల్లల కోసం ఒక పాఠశాలను స్థాపించి, విభిన్న బోధనా విధానాలను ప్రయోగించారు. నెమ్మదిగా పఠనంలోని, కఠినమైన పద్ధతులను,పాఠ్యాంశాలను "బట్టీ పట్టే" పడికట్టు సనాతన నియమాలను తిరస్కరించి, పిల్లల అభిరుచులను ప్రోత్సహించే, సృజనాత్మక ఆలోచనలను వికసింపజేసే విద్యకు ప్రాధాన్యత ఇచ్చారు. "విద్య అనేది కేవలం క్రమశిక్షణను బాహ్యంగా పై నుంచి విద్యార్థులపై రుద్దేందుకు కాదు. పిల్లల సహజ వాతావరణంలో తమంతట తాము విచారణాత్మకతను పెంచుకునేందుకు దోహదపడేది" అని ఆయన విశ్వసించారు.


టాల్ స్టాయ్ యొక్క విద్యా తత్త్వంలో నైతిక, ఆధ్యాత్మిక విశ్వాసాలతో ముడిపడి ఉంటుంది." విద్య అనేది వ్యక్తిగత పరివర్తన సాధనంగా ఉండాలి. అహింస, సత్యాన్వేషణ, ఆత్మోన్నతికి దోహదం చేయాలనే" వారు. విద్యను అణగారిన వర్గాలకు అందించాలి, ఇది కేవలం ఉన్నత వర్గాల హక్కుగా మిగలకూడదని పేర్కొన్నాడు. ఆన్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషన్ అండ్ కల్చర్ వంటి రచనల ద్వారా తన ఆలోచనలను ప్రపంచానికి పరిచయం చేశారు.

టాల్ స్టాయ్ విద్యా సిద్ధాంతాలు సోవియట్ రష్యా విద్యా వ్యవస్థపై మిశ్రమ ప్రభావాన్ని చూపాయి. ఆయన సాహిత్యాన్ని సోవియట్ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసినప్పటికీ, ఆయన విద్యా విధానం రాష్ట్ర నియంత్రణకు విరుద్ధంగా ఉండేది. సోవియట్ వ్యవస్థ అనుసరించిన కఠినమైన విద్యా నియంత్రణలతో టాల్ స్టాయ్ విద్యా సిద్ధాంతాలు పూర్తిగా సరిపోల్చ లేదు. అయినప్పటికీ, ఆయన నైతిక విద్యపై చేసిన గొప్ప అధ్యయనాలు, విద్య జీవితాంతం కొనసాగాలి అనే సిద్ధాంతం కొంత మేరకు సోవియట్ విద్యా సంస్కరణలపై ప్రభావం చూపాయి.

ప్రపంచవ్యాప్తంగా టాల్ స్టాయ్ విద్యా సిద్ధాంతాలు, మహాత్మా గాంధీ వంటి మహనీయులను "బేసికల్ విద్య" విధానంలో ప్రేరేపించాయి. గాంధీ అహింసా సిద్ధాంతానికి టాల్ స్టాయ్ ఆలోచనలు బలమైన ప్రేరణగా మారాయి. విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, నైతికత మరియు జీవిత బోధనలను కూడా కలిగి ఉండాలని టాల్ స్టాయ్ నమ్మారు. ప్రముఖ విద్యావేత్త జాన్ డ్యూయీ వంటి వారిపై కూడా ఆయన ఆలోచనలు ప్రభావం చూపాయి. "విద్య అనేది సామాజిక మార్పును కలిగించగల శక్తి" గా టాల్ స్టాయ్ విశ్వసించారు.

టాల్ స్టాయ్ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయాడు, కానీ ఆయన విద్యాపై చేసిన విశిష్టమైన కృషికి రష్యాలో సరైన గుర్తింపు పొందలేదు. ఆయన విద్యపై కలిగించిన ప్రభావం ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అనేక పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో కనిపిస్తోంది. విద్య అనేది కేవలం సమాచారం సేకరించడమే కాదు, అది మానవత్వాన్ని, నైతికతను, స్వతంత్ర ఆలోచనను పెంపొందించేందుకు ఉపయోగపడాలని ఆయన విశ్వసించారు.


ఈ రోజుల్లో కూడా విద్యా వ్యవస్థలు మరింత నిర్మాణబద్ధమైన మూస మోడల్స్‌ను గుడ్డిగా అనుసరిస్తున్నాయి. టాల్ స్టాయ్ ఉద్ఘాటించిన విద్యా మూల్యాలురచనాత్మకత, నైతికత, స్వతంత్ర ఆలోచనుఇంకా ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరం. ఆయన విద్యాపై ఉంచిన దృష్టి విద్యార్థులకు కేవలం ఉద్యోగం పొందే మార్గాన్ని మాత్రమే చూపించకుండా, ఒక సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంచే మార్గదర్శిగా మారింది. టాల్ స్టాయ్ సూచించిన మార్గంలో విద్యను చూడగలిగితే, అది సమాజాన్ని మరింత జ్ఞానం, సమతా భావం, నైతికత కలిగిన స్థాయికి తీసుకెళ్లగలదు.



**దండెబోయిన అశోక్ యాదవ్,**
గెజిటెడ్ హెడ్మాస్టర్,
పెద్దమదూర్,
జనగాం. 9440521990

## సింగరేణి విశ్రాంత ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లింపులో తారతమ్యం ఎందుకు?

గ్రాట్యుటీ చెల్లింపు 1972 అనేది ఒక భారతీయ చట్టం,దీని ప్రకారం ప్రభుత్వ,ప్రైవేట్ కంపెనీలలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు లేదా కనీసం 5 సంవత్సరాల సేవ చేసిన తర్వాత రాజీనామా చేసిన ఉద్యోగులకు ఒకేసారి గ్రాట్యుటీని చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం గతంలో గ్రాట్యుటీ సీలింగ్ ను రూ.03.50 లక్షల నుండి రూ.10 లక్షలకు తేదీ 24-5-2010 నుండి వర్తింపచేయడం జరిగింది. సింగరేణి యాజమాన్యం తేదీ-01-01-2007 నుండి అనగా మూడు సంవత్స రాల నాలుగు నెలల ఇరవై రోజుల వెనుక నుండి పది లక్షల రూపాయల సీలింగ్ ను అమలు పరిచింది. కానీ ప్రస్తుతం వెనుక తేదీ నుండి కాకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ధారించిన తేదీ అనగా 29-3-2018 నుండి మాత్రమే 20 లక్షల రూపాయల గ్రాట్యుటి ఉద్యోగులకు వర్తింపజేస్తున్నారు. అధికారులకు మాత్రం 01-01-2017 నుండి అనగా సుమారు 15 నెలలు వెనుక నుండి వర్తింపజేస్తున్నారు. గ్రాట్యుటీ చట్టం-1972 లో ఉద్యోగులు అని మాత్రమే వ్రాయబడింది. అంతే కాని అధికారు లు, కార్మికులు అని ఉటకాయించలేదు. చట్ట ప్రకారం కార్మికులు,అధికారులని తారతమ్యం ఉండదు. ఎటువంటి వివక్ష చూపరాదని, కార్మికులకు కూడా 20 లక్షల రూపాయల గ్రాట్యుటీ సీలింగ్ అమలు పరచాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్లు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుంది జనవరి 2017 నుంచి మార్చి 2018 సంవత్సరం వరకు సింగరేణి లో దాదాపు 4,000 మంది ఉద్యోగులు పదవి విరమణ పొంది ఉన్నారు. వీరికి కేవలం 10 లక్షల రూపాయల గ్రాట్యుటీ సీలింగ్ అమలు పరిచారు. వీరందరూ లేబర్ కమిషనర్ల చుట్టూ కోర్టుల చుట్టూ తిరగడం వయోధికతతో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. లేబర్ కమిషన ర్, కోర్టు ఆదేశాలు అమలు పరిచే లోపు విశ్రాంత ఉద్యోగి మరణిస్తే అతని నామినీ మరల కార్యాలయాల చుట్టు తిరగవలసిన పరిస్తితి నెలకొని ఉంది.



సింగరేణి కంపెనీ వందల కోట్ల రూపాయలు లాభాలు గడిస్తుంది. లాభాలు వచ్చే సంస్థలోని ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపు యాజమాన్యం తన ఇష్టమైన తేదీ నుంచి ఇచ్చుకోవచ్చని చట్టం వెసులుబాటు కల్పించింది. సింగరేణిలో గెలిచిన గుర్తింపు సంఘం పోరాటాలు చేసి ఉద్యోగులకు ఎన్నో హక్కులు సౌకర్యాలు కల్పించింది. కావున యాజమాన్యంతో చర్చించి రిటైర్ ఉద్యోగులకు కూడా అధికా రులు, ఉద్యోగులు అనే తేడా లేకుండా 20 లక్షల రూపాయల గ్రాట్యుటీ చెల్లించాలని విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు.

ఇట్లు
**ఆళవందార్ వేణు మాధవ్**
ఉప ప్రధాన కార్యదర్శి
సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం,హైదరాబాద్
8686051752.

# మార్చి 2న 721 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

● రాష్ట్ర అబ్కారి, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** మార్చి 2న వనపర్తి నియోజకవర్గంలో రూ.721 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారని రాష్ట్ర అబ్కారి, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, స్థానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచెత్తడంతో, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలకు అన్ని పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాద ఘటనకు సంబంధించి బాధితులను కాపాడడం కోసం నేవీ, ఎన్డీఆర్ఎఫ్ సహా 11 సంస్థలను రప్పించి బాధితులను కాపాడే ప్రయత్నం జరుగుతోందన్నారు. టన్నెల్ లో 11.8 కిలోమీటర్ల లోనికి తాను కూడా వెళ్లానని, అక్కడ భయానక పరిస్థితి నెలకొందన్నారు. దేశంలోని వివిధ సంస్థల ద్వారా నిష్ణాతులను పిలిపించి సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. సీఎం ఘటన స్థలికి రాకపోయినప్పటికీ ప్రతి రోజూ సహాయ కార్యక్రమాలపై సమీక్షిస్తున్నారన్నారు. వనపర్తిలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. మొదటిసారి సీఎం రేవంత్ రెడ్డి వనపర్తికి రాబోతున్నారని, తాను చదివిన పాఠశాల అభివృద్ధి సహా రూ.721 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి 14 నెలల్లో విద్యా, వైద్య, క్రీడల పరంగా సుమారు రూ.1000 కోట్ల అభివృద్ధి పనులను వనపర్తికి తెప్పించగలిగారన్నారు. జాబ్ మేళా, రుణమేళా, స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలు చేస్తున్నారని, సుమారు వెయ్యి మంది స్థానికులకు ఉద్యోగాలు కల్పించే పని చేస్తున్నారన్నారు. మొదటి సారి శాసనసభ్యులు అయినప్పటికీ నిత్యం ప్రజలతో ఉంటూ ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ సీఎంగా పదవి చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి తాను చదువుకున్న ఊరికి తొలిసారి రానున్నారని తెలిపారు. 14 నెలల కాలంలో వనపర్తిలో రూ.397 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించారన్నారు. మార్చి 2 తేదీ నాడు రూ.721 కోట్లకు సంబంధించి శంకుస్థాపనలు చేయబోతున్నారని చెప్పారు. వనపర్తిలో వెంకటేశ్వర స్వామి టెంపుల్ అభివృద్ధికి రూ.1 కోటితో, శంకుస్థాపన చేయనున్నారన్నారు. రూ.257 కోట్లతో హాస్పిటల్ నిర్మాణానికి, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. రూ.60 కోట్లతో తాను చదువుకున్న జడ్పీ స్కూల్, జూనియర్ కళశాల అభివృద్ధి కి శంకుస్థాపన చేయనున్నారన్నారు. రూ.22 కోట్లతో ఐటీ టవర్ కు, రూ. 81 కోట్లతో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి, రాజనగరం నుంచి పెద్దమందడి రోడ్డుకు రూ.40 కోట్లతో శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ సీఎం వనపర్తిలో చదువుకున్న నేపథ్యంలో, ఆయనకు ఇక్కడి ప్రాంతంలో మంచి అనుబంధం ఉన్న కారణంగా వనపర్తి అసెంబ్లీ అభివృద్ధి కోసం రూ.721 కోట్లతో శంకుస్థాపనలు చేయబోతున్నారన్నారు. సీఎం రేవంత్ ఆయనతో చదువుకున్న వారందరితో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొననున్నారన్నారు. ఆయన ఇక్కడి ఉన్నప్పుడు పార్వతమ్మ అనే వారి ఇంట్లో ఉండి చదవుకున్నారని, వారి ఇంటికి కూడా సీఎం రాబోతున్నారన్నారు.సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త లక్కకుల సతీష్,డిసిసి రాజేంద్రప్రసాద్,మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకుల మహేష్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ,ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ఛాంబర్ లో గురువారం అధికారులతో సమావేశమై, రంజాన్, సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్ష జరిపారు.ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లకు తావులేకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా ఎక్కడ కూడా తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి బాధ్యతలు పురమాయిస్తూ, నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం అంతరాయం లేకుండా చూడాలని, వీధి లైట్ల మరమ్మతులు జరిపించాలన్నారు. బోర్లు, పైప్ లైన్ మరమ్మతులు ఉంటే ముందస్తుగా చేపట్టాలని తెలిపారు. అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రార్థనా సమయాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ డి.ఈ. కి సూచించారు. మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్య సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడ కూడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కాగా, వేసవి సీజన్ ప్రారంభం అవుతున్న దృష్ట్యా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని మున్సిపల్ కమీషనర్లను సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు పోతామని తెలిపారు.పోలీస్,విద్యుత్ డిఎంహెచ్వో ఆర్డీవో సివిల్ సప్లై మున్సిపల్ కమీషనర్లు తదితర శాఖలు వారు సమిష్టి కృషి చేయాలన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ రెవిన్యూ సంబందించిన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు.మున్సిపల్ కమీషనర్ లు రంజాన్ పండుగ రోజు శ్యామ్యానాలు తాగునీరు తదితర ఏర్పాట్లు చేస్తామన్నారు.ఈ సమావేశంలో డీఎస్పీ లింగయ్య మాట్లాడుతూ రంజాన్ హెూలీ,ఉగాది పండుగలకు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.రంజాన్ పండుగ రోజు ఈద్గాలో దాదాపు పదివేల మంది ప్రార్థనలో హాజరు అవు తారని ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ బెంషాలం,డి. ఎస్. పి. లింగయ్య ఆర్. డి. ఓ. రాంచందర్,మైనారిటీ అధికారి ఎం. ఎ. రషీద్,డిఆర్డిఓ మొఘలాప్ప, విద్యుత్ శాఖ డి. ఈ. జితేందర్ నాథ్,మున్సిపల్ కమీషనర్లు సంబంధిత అధికారులు అమీరుద్దీన్ అడ్వకేట్ అబ్దుల్ ఖాదర్,రఫీక్ చంద్,మొహమ్మద్ తాకి తదితరులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణంలో పాల్గొన్న ఉప్పల





**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** నాగోల్ బండ్లగూడలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవంలో పాల్గొన్న ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చింతల ఆగ మలయ్య యాదవ్ చింతల కిరణ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితునికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

● ఎస్పి యోగేష్ గౌతమ్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కోర్టులో పోక్సో కేసులో నిందితుడుగా ఉన్న నరేష్ అనే వ్యక్తిపై నేరము రుజు నైనందున నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ గురువారం నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు 50 వేల రూపాయల జరిమానా విధించడంజరిగిందని,బాధితురాలికి పరిహారంగా ఐదు లక్షల రూపాయలు ఇవ్వ వలసిందిగా తీర్పు ఇవ్వడం జరిగిందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతం ఐపీఎస్ తెలిపారు.కేసు వివరాలను వెల్లడిస్తూ దామరగిద్ద మండలానికి చెందిన మైనర్ బాలికను బండగొండకు చెందిన ఆటో డ్రైవర్ నరేష్ దామరగిద్ద మండలం, పిడెంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి ముందే పెళ్లి అయ్యిం దని అయినా ఇంటర్ చదువు తున్న నా పెద్ద కూతురుతో నిన్ను ప్రేమిస్తున్నానని, వెంట పడి వేధిస్తుంటే నా కూతురు నాతో తెలుపగా మా కుటుం బ సభ్యులందరము అతని మా కూతురు జోలికి రావద్దని పలుమార్లు చెప్పి, నా కూతుర్ని నారాయణపేట లోని నా చెల్లెలు దగ్గర ఉంచడం జరిగిందనీ, అతను 19మార్చి2021నాడు మధ్యాహ్నం సమయంలో నా కూతురికి మాయమాటలు చెప్పి ఎత్తుకెళ్లి ముంబయిలో శారీరకంగా అనుభవించిన నరేష్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని 30 మార్చి.2021 నాడు నారాయణపేట పోలీస్ స్టేషన్లో అప్పటి ఎస్సై చంద్రమోహన్ కు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని ఎస్పి తెలిపారు.కేసు నమోదు చేయడం జరిగిందనీ అన్నారు. అప్పటి సిఐ శ్రీకాంత్ రెడ్డి కేసు ఇన్వెస్టిగేషన్ చేసి కోర్టులో చార్జీషీట్ నమోదు చేయడం జరిగిందనీ ప్రస్తుత సీఐ శివ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏ ఎస్సై కృష్ణయ్య గౌడ్, కోర్టు పిసి విజయ్ కుమార్, హెూమ్ గార్డ్ మీర్జాబేగ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ ఆకుల బాలప్ప కోర్టులో వాదనలు వినిపించి నేరస్తునిపై నేరము నిరుపనైనందున జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు 50 వేల రూపాయల జరిమానా ,బాధితురాలికి ఐదు లక్షల రూపాయల పరిహారం ఇవ్వవలసిందిగా తీర్పు ఇవ్వడం జరిగిందని ఎస్పీ తెలిపారు.ఈ కేసులో బాగా పనిచేసిన పోలీస్ అధికారులను,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అభినందించి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా పరిధిలో ఎవరైనా మహిళల ను, అమ్మాయిలను వేధిం చిన, హింసించిన చట్ట ప్రకారం శిక్షించబడతారని హెచ్చరించారు.

# చంద్రశేఖర్ అజాద్ ఉద్యమ స్ఫూర్తి ఎందరికో ఆదర్శం




**మక్తల్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ప్రాణాలకు తెగించి పోరాడిన చంద్రశేఖర్ అజాద్ ఉద్యమ స్ఫూర్తి ఎందరికో ఆదర్శమని మఖ్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి కొనియాడారు. గురువారం చంద్రశేఖర్ అజాద్ వర్థంతి సందర్భంగా నివాసంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలకు లెక్క చేయకుండా ఆజాద్ పోరాడి, ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్టా సురేష్ గుప్తా, మండలాధ్యక్షుడు గణేష్ కుమార్, టౌన్ ప్రెసిడెంట్ ఏ రవికుమార్, సీనియర్ నాయకులు చంద్రకాంత్ గౌడ్, కావలి తాయప్ప, కావలి రాజేందర్, వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్లు ఫయాజ్, రంజిత్ రెడ్డి, శంషుద్దీన్ , వాకిటి హన్మంతు, నగేశ్, కుర్మయ్య గౌడ్, చెన్నయ్య గౌడ్, కేశవ రెడ్డి, కల్లూరి గోవర్ధన్, గుంతలి రవి, వాకిటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 2న రాష్ట్ర ముఖ్యమంత్రి వనపర్తికి రాక



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** మార్చి 2న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వనపర్తి జిల్లా పర్యటనను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల పై గురువారం నాగర్ కర్నూలు పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, డిఎస్పీ వేంకటేశ్వర రావు, ఇతర జిల్లా అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు.కే.డి.ఆర్ పాలిటెక్నిక్ కళాశాల వెనక భాగంలో హెలిప్యాడ్ ఏర్పాట్లు, ముందు భాగంలో నిర్వహించనున్న ప్రజాపాలన – ప్రగతి బాట బహిరంగ సభకు చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు.అదేవిధంగా ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో నిర్వహించనున్న వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు ఎలాంటి ఏర్పాటు చేయాలి అనే విషయాలపై పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులతో చర్చించారు.వనపర్తి జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వారి చేతుల మీదుగా జరిగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, జాబ్ మేళా, నైపుణ్య శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పకడ్బందీగా ప్రణాళికలు చేసుకోవాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి కలక్టర్‌ను సూచించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు , ఇటీవల వనపర్తి జిల్లా నుండి బదిలీ పై వెళ్లిన అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, ప్రస్తుత ఇన్చార్జి యాదయ్య, రోడ్లు భావనాల కార్యనిర్వహక ఇంజనీరు దేశ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రమణ్యం, డిఎస్పీ వేంకటేశ్వర రావు, సి. ఐ, ఎస్సై లు తదితరులు పాల్గొన్నారు.

# న్యాల్‌కల్‌లో 69.34 శాతం ఓటరు నమోదు

● పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ మనోజ్ కుమార్



**న్యాల్‌కల్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండల ఎన్నికల అధికారి, స్థానిక తహసిల్దార్ భూపాల్ పర్యవేక్షణలో 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మండలంలోని 39 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉపాధ్యాయ ఓటర్లు 25 గురిలో 23 గురు ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు 92 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. 398 పట్టభద్రుల్లో 276 గురు ఓటు హక్కును వినియోగించుకోగా 69.34 శాతం పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కొనసాగుతున్న వేళ జిల్లా ట్రైనీ కలెక్టర్ మనోజ్ కుమార్, జహీరాబాద్ ఆర్డీఓ రామ్ రెడ్డి పోలింగ్ కేంద్రాలు, ఆవరణలో ఏర్పాటు చేసిన భద్రతను పరిశీలించారు. జహీరాబాద్ గ్రామీణ వలయాధికారి జక్కుల హనుమంతు, స్థానిక ఎస్సై చెల్లా రాజశేఖర్‌ల పర్యవేక్షణలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల అధికారి పర్యవేక్షణలో స్థానిక ఎన్నికల అధికారులు రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్ రావు, శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్, ఆరోగ్యం, అంగన్వాడి, తదితర శాఖలకు చెందిన అధికారులు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు దృష్టి సారించారు.

# భవనాల మంజూరు ఇకనుంచి వేగవంతం

● గ్రేటర్ హ్యాదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇలంబర్తి



**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** గ్రేటర్ హ్యాదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇకనుండి భవన నిర్మాణాల అనుమతులు వేగవంతంగా జరుగుతాయని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అన్నారు. గురువారం జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ రూపొందించిన బిల్డ్ నౌ పై జోనల్, డిప్యూటీ కమిషనర్‌లకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ... బిల్డ్ నౌ అప్లికేషన్ అప్లోడ్ చేసే విధానం పై పలువురికి శిక్షణ కల్పించినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మార్చి 9 వరకు నిర్వహించి, మార్చి 10వ తేదీ నుండి బిల్డ్ నౌ అప్లికేషన్ ప్రారంభించే అవకాశం ఉన్నందున జిహెచ్ఎంసి జోనల్, డిప్యూటీ కమిషనర్ లకు బిల్డ్ నౌ అప్లికేషన్ అవగాహన కల్పించేందుకు ఓరియంటేషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ టెక్నాలజీతో రూపొందించబడిన నేపథ్యంలో ప్లాన్‌లో అప్లోడ్ చేసే సమయంలో అందులో ఉన్న లోపాలను గుర్తిస్తుందని, మొత్తం ప్లాన్ మొదటి నుండి పరిశీలించాల్సిన అవసరం ఉండదని, గుర్తించిన అంశాన్నే సవరించి అప్లోడ్ చేసే వెసులుబాటు ఉందని అన్నారు. అప్లికేషన్ పరిశీలన చేసే సందర్భంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారంగా ప్లాన్, చెరువు పక్కన ఎంత దూరంలో ఉంది, కోర్టు కేసులు ఉన్నాయా అప్లికేషన్ లోనే పొందుపర్చడం జరుగుతుందని వివరించారు. వాటిని పరిశీలించి తొందరగా ఇచ్చే అవకాశం ఉంటుందని స్కెట్ కూడా పరిశీలన చేసే అవకాశం కలదన్నారు. అప్లై చేసే వారు చివరగా కోర్టు కేసులు గాని, ఇతర ఎలాంటి కేసులు లేవని ఏద్కెనా సమస్య ఉంటే మొత్తానికి నేనే బాధ్యత వహిస్తానని ధృవీకరణ సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సి సీపీ శ్రీనివాస్, జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంత్, హేమంత్ కేశవ్ పాటిల్, ఎపూర్వ్ చౌహాన్, రవి కిరణ్, వెంకన్న, అడిషనల్ సిసీపీ లు గంగాధర్, ప్రదీప్ వీరన్న టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీ బిల్లులపై అయోమయం

● ఇబ్బందులు పడుతున్న మహిళా సంఘాలు



**నాగార్జునసాగర్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మహిళలకు చేయూతనిస్తూ మహిళ సంఘాలను అభివృద్ధి చేసి , మహిళలను సంపన్నులుగా మార్చాలనే లక్ష్యంతో మహిళా సంఘాలకు కేటాయించిన నర్సరీ బిల్లులు రాక తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక మహిళా సంఘాల మహిళలకు కష్టాలపాలు చేసింది. 2022-23 ఎస్.జి.హెచ్చ్ మహిళ సంఘాలైన విజయ లక్ష్మి సమభావన సంఘంకు 4,79,000 లక్షలు కేటాయించగా, 2023-2024 సంవత్సరంలో ప్రగతి లక్ష్మి సమభావన సంఘానికి 4,00,000లక్షల రూ. కేటాయించారు. ప్రతి సంవత్సరం ఎండాకాలంలో పనులు ప్రారంభించి ఎరువును కలిపిన ఎర్ర మట్టిని ప్లాస్టిక్ సంచులలో కూలీలతో నింపి మొక్కలు నాటి మున్సిపాలిటీకి అందజేయడం జరిగింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రెండు సంవత్సరాలుగా మహిళా సంఘాలు అప్పు చేసి ఖర్చు చేసిన బిల్లులు రాకపోవడంతో అనేక కష్టాలు పడుతున్నారు. నందికొండ మున్సిపాలిటీ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగి మహిళలు తమ గోడు విన్నవించుకుంటున్న ఫలితం లేదు...

## కార్యాలయాల చుట్టూ తిరిగిన ఫలితం శూన్యం



నర్సరీ బిల్లులు రాక తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగిన ఫలితం శూన్యం. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో మాకు రావాల్సిన బిల్లులు చెల్లించలేదు కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మాకు రావాల్సిన బిల్లులు చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలి.

**సఫవత్ గులాబీ, సంఘ సభ్యురాలు**

# జీఎంఆర్ ఎరీనాలో కంట్రోల్ కాపర్ పవర్ కేబుల్ చోరీ

- సెక్యూరిటీగా పని చేసే వ్యక్తి సూత్రధారి ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు
- ఏడుగురు సభ్యుల ముఠాలో నలుగురి అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు
- సెల్‌ఫోన్లు, బొలెరో వాహనం, 20 లక్షల నగదు స్వాధీనం
- మీడియాకు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ కుమార్



**శంషాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డ్ కొందరు వ్యక్తులతో కలిసి కాపర్ కేబుల్‌ను దోచేసిండు. కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డు కొంతమంది వ్యక్తులతో చేతులు కలిపి పెద్ద ఎత్తున చోరీకి పాల్పడ్డ సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం జిఎంఆర్ ఎరీనాలో చోటుచేసుకుంది. సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

**కేసును చేదించిన పోలీసులు**

వివరాలను శంషాబాద్ జోన్ డిసిపి కార్యాలయంలో డీసీపీ రాజేష్ కుమార్ గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం జిఎంఆర్ ఎరీనాలో బ్యుమర్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన కాపర్ పవర్ కేబుల్ స్టోరేజీ ఉన్నది. స్టోరేజీలో ప్రధాన నిందితుడు అయిన బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామంలోని సిగ్నేచర్ వెంచర్‌లో నివాసం ఉంటున్న అదిల శ్రీకాంత్ (28) స్టోరేజీ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇతను ఉప్పుగూడ శివాజీ నగర్ కు చెందిన కేతావత్ భాష (32), ముషీరాబాద్ బోలక్ పూర్ కు చెందిన అబ్దుల్ వాహిద్ (44), బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాదర్ ఖాన్ (40), మహమ్మద్ హుస్సేన్, కుర్షీద్ హుస్సేన్, అలీ అనే ఏడుగురు తో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు. ప్రధాన నిందితుడు శ్రీకాంత్ స్టోరేజ్ కి సంబంధించిన నకిలీ తాళం చెవి ని తయారు చేసి, ఈ ముఠా సభ్యులతో కలిసి ఎవరికీ అనుమానం రాకుండా తాళం తెరిచి కాపర్ పవర్ కంట్రోల్ కేబుల్ చోరీ చేశారు. అనంతరం రికవరీ చేయడం సాధ్యం కాకుండా దాన్ని ముక్కలుగా చేసి వివిధ ప్రాంతాలలోని పాత ఇనుప సామాగ్రి దుకాణాలలో అమ్మేశారు. స్టోరేజీలో నవంబర్ 17 నుంచి 27వ తేదీ మధ్య పవర్ కేబుల్ దొంగతనం జరిగిందని ఆ సంస్థ గుర్తించింది. రహస్యంగా విచారణ చేపట్టిన సంస్థ యాజమాన్యం సెక్యూరిటీ గార్డు శ్రీకాంత్ కొంతమందితో కలిసి దొంగతనం చేసినట్లుగా నిర్ధారణకు వచ్చారు. ఈ నెల 11 వ తేదీన బ్యుమర్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధి అయిన పవన్ కుమార్ కడ్తాల్ శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీసులకు తమ సంస్థలో దొంగతనం జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపాడు. సెక్యూరిటీగార్డు శ్రీకాంత్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. ఏసిపికేవిస్ రావు పర్యవేక్షణలో సిఐ బాలరాజ్, డిఎస్‌హెచ్ కిషన్‌జితో విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా శ్రీకాంత్ తో పాటు మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టు విచారణ చేపట్టగా. అమ్మిన కేబుల్ విలువను వెలకట్టి రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నలుగురు నిందితులు శ్రీకాంత్, కేతావత్ భాష, అబ్దుల్ వహీద్, మహమ్మద్ ఖాదర్ ఖాన్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మిగతా ముగ్గురు కాపర్ కేబుల్ కోన నిందితులు పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసిన రెండు వారాల్లోపే కేసును చేదించి రూ .20 లక్షల నగదు, సెల్ ఫోన్లు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు శ్రీకాంత్ గతంలోనూ చోరీకి పాల్పడినట్లుగా గుర్తించారు. కేసు చేదించడంలో చురుకైన పాత్ర పోషించిన పోలీసులను ఆయన అభినందించి రివార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కె. రామ్‌కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన మసీద్‌ను ప్రారంభించిన ఒబెద్దుల కొత్వాల్



**వీపనగండ్ల, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామంలో నూతన మజీద్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా ముస్లిం మైనార్టీ రాష్ట్ర చైర్మన్ ఒబెద్దుల కొత్వాల్ ముస్లిం మైనార్టీ మత పెద్దల అలాగే మస్జిద్ కమిటీ సభ్యులు సమక్షంలో నూతన మజీద్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ రాష్ట్ర చైర్మన్ ఒబెదుల కోత్వాల్ మాట్లాడుతూ కల్వరాల గ్రామంలో గతంలో శిథిలావస్థలో ఉన్న మసీదును కూలగొట్టి నూతన మసీ దును ప్రారంభించినందుకు జామే మసీద్ కమిటీ సభ్యులకు సహకరించిన దాతలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే మసీదుకు సహాయ సహకారాలు అంది ఎంబి నజీర్, ఎండి సర్దార్, ఎండి జావీద్, కమిటీ సభ్యులు తమ సహాయ సహకారాలతో 6 నెలలోనే నిర్మాణం పూర్తి చేసుకొని నూతన మసీదును ప్రారంభించుకోవడం గొప్ప విషయమని అన్నారు. నూతన నిర్మించిన మసీదులో మత పెద్దల సమక్షంలో ఖురాన్ చదివి ప్రార్థనలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎండి గఫర్, ఎండి అఖిల్, ఎండి రషీద్, ఎండి ముజీబ్, ఎండి వశీమ్, ఎండి రషీద్, మైనారిటీ మత పెద్దలు, జిల్లా నుండి ఆయా మండలాల గ్రామ మైనార్టీ యువకులు అధిక సంఖ్యలో భారీగా పాల్గొన్నారు.

## గ్రీన్‌ల్యాండ్ డెవలపర్స్‌లో అక్రమ రిజిస్ట్రేషన్లపై కేసు నమోదు

**ఖమ్మం, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** కొనిజర్ల మండల పరిధిలోని గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్ లో ముగ్గురు పార్టనర్స్ చేసిన అక్రమ రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి వచ్చిన ఫిర్యాదు మేరకు 9 మందిపై ఫిబ్రవరి 25న కేసు నమోదు చేసినట్లు కొనిజర్ల పోలీసులు తెలిపారు. మక్కెన రాము, ముళ్ళ కిషోర్, కర్నాటి శరత్, బొబ్బల రాంబాబు, పుసులూరి అరవింద్, మేకల అజయ్, వసీం, పందిళ్ళపల్లి రాజు, భువనగిరి ఉపేందర్ తదితరులపై కేసు నమోదు అయింది. ఇక్కడ జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం విదితమే.

## ప్రశాంతంగా ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

- కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి



**నల్గొండ బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి)**
వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎం ఎల్ సి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు.గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైన తర్వాత జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల,సెయింట్ అల్ఫాన్సస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.అంతేకాక పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, పోలింగ్ నమోదు,తదితర విషయాలను పరిశీలించారు.

## ముగ్గురు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు ఖాయం

- బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు




**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురి బిజెపి అభ్యర్థుల గెలుపు ఖాయం అని నారాయణపేట జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామా జీ ఒక ప్రకటనలో ధీమా వ్యక్తంచేశారు.నేడు కరీం నగర్ అదిలాబాద్ మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ,కరీం నగర్ అదిలాబాద్ నిజామాబాద్ పట్ట భద్రుల ఎమ్మెల్సీ,వరంగల్ నల్గొండ ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన పోలింగ్ బిజెపి అభ్యర్థులకు అనుకూలంగా జరిగిందనీ ఎమ్మెల్సీలుగా మల్క కొమురయ్య,అంజిరెడ్డి,పుల సరోత్తం గెలుపు ఖాయం అన్నారు.ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎప్పుడో కాడి వదిలేసింది అన్నారు.అధికారంలో ఉన్న కాంగ్రెస్ హామీల అమలులో పూర్తిగా విఫలం అయిందని అన్నారు.సాక్షాత్తు సి ఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేయడంతో ఆపార్టీ సగం ఒడిపోగా ప్రచారంలో సి ఎం ఎమ్మెల్సీ ఒడినంత మాత్రాన తన ప్రభుత్వానికి వచ్చిన ముప్పు ఏమి లేదని నిర్విరంగా మాట్లాడడంతో ఓటమిని ఒప్పుకున్నారని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న బిజెపిని పట్టభద్రులు,మేదావులు ఆదరించారని ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపు ఖాయం అని విజయాన్ని ఎవరు అడ్డుకోలేరని అన్నారు.

## ఎమ్మెల్సీకి పోటెత్తిన ఓటర్లు



**పాపన్నపేట, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటుకై యువకులు బారులు తీరారు.పాపన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియ గురువారం సజావుగా జరిగింది.ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తమ పత్రాలతో,గుర్తింపు కార్డులతో వెళ్లి ఓటు వేశారు.పోలీస్,రెవెన్యూ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించారు.సాయంత్రం 4 గంటలకు పాఠశాల గేటు మూసివేశారు. పోలింగ్ కేంద్రంలో ఉన్నా వారు ఓటు హక్కుని వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఓట్లు 822 ఉండగా 556 ఓట్లు పోలయ్యాయి.పోలింగ్ శాతం 67 నమోదు అయింది. ఉపాధ్యాయుల ఓట్లు 86 ఉండగా 81 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 94 నమోదు అయింది.మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు పాపన్నపేట కేంద్రానికి వచ్చి ఓటింగ్ సరళిని పరిశీలించారు.మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఏండ్లు గడుస్తున్నా రోడ్డేది..



**చేర్యాల, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ఈ దేశం రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుంది అని గొప్పలు చెపుతున్న నాయకులు, ఈ దేశానికి పట్టుకొమ్మలు అయిన పల్లెలను విస్మరిస్తున్నారా..! ఏళ్లు గడుస్తున్న చేర్యాల జనగామ జాతీయ రహదారికి కూత వేటు దూరంలో ఉన్న వీరన్న పేట స్టేజి నుండి చుంచనకోట గ్రామానికి ఇప్పటివరకు తారు రోడ్డు లేకపోవడంతో ఈ గ్రామల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో ఒకప్పుడు వీరన్న పేట గ్రామం పట్టుపురుగుల పంటకు ప్రసిద్ధి. ఈ గ్రామం నుండి హైదరాబాద్ జూబ్లీ బస్టాండ్ కు నేరుగా ఉదయం బస్సు సౌకర్యం కల్పించిన అప్పటి ప్రభుత్వం ఇప్పటికి కొనసాగుతూనే ఉంది. వర్షాకాలం వచ్చిందంటే మట్టి రోడ్డుపై బురద పేరుకుపోవడం, కంప చెట్లు ఏపుగా పెరిగి దారి కనిపించకుండా అవడంతో చుంచనకోట గ్రామం నుండి వీరన్నపేటకు గ్రామం వరకు బస్సు రాకపోకలు ఆగిపోతూ వస్తున్నాయి. వీరన్న పేట స్టేజి నుండి చుంచన కోట గ్రామం వరకు తార్ రోడ్ అనేది ఈ రెండు గ్రామాల ప్రజల చిరకాల కోరిక, సంవత్సరాలు గడుస్తున్న ఈ కోరిక అలాగే ఉండిపోయింది. ఈ రెండు గ్రామల ప్రజలు స్థానిక నాయకులకు,అధికారులకు అనేక మార్లు అర్జీలు పెట్టుకున్న ఫలితం మాత్రం శూన్యం. ఇప్పటికైనా నాయకులు, అధికారులు కళ్ళు తెరిచి ప్రజల వెతలను అర్థం చేసుకొని రోడ్డు మరమ్మతు చేయించాల్సిందిగా రెండు గ్రామల ప్రజలు కోరుతున్నారు.


## మానవత్వం చాటుకున్న ఎస్సై



**పాలకుర్తి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** జనగాం జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా దైవదర్శనానికి వచ్చి మూర్ఛతో స్పృహ తప్పి పడిపోయిన భక్తురాలిని భుజాలపై మోసి వైద్య శిబిరానికి చేర్చి, తన మానవత్వం చాటుకున్నాడు పాలకుర్తి ఎస్సై. దూలం పవన్ కుమార్, ఈ ఘటన గురువారం మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరింహస్వామి ఆలయంలో కోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహాశివరాత్రి సందర్భంగా ఉపవాసం ఉండి జాగారణ చేసిన మహిళా భక్తురాలు స్థానిక దేవాలయానికి వచ్చి దైవదర్శనానికి క్యూలో నిల్చుంది. ఎక్కువ సేపు నిలబడడంతో అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి స్పృహ తప్పి పడిపోయింది. బంధోబస్తు విధుల్లో ఉన్న ఎస్సై పవన్ కుమార్ వెంటనే స్పందించి, మహిళా భక్తురాలిని భుజాలపై మోసి ఆలయ సమీపంలో వైద్య శిబిరానికి చేరవేశాడు. ఇదంతా ఐదు నిమిషాల్లో పూర్తయింది. అక్కడ వైద్యులు సదరు మహిళను పరిశీలించి, ప్రధమ చికిత్స అందించి స్వాంతన చేర్చారు, ప్రస్తుతం అ మహిళా భక్తురాలి పరిస్థితి నిలకడగా ఉంది. క్షణాల్లో స్పందించి మహిళా ప్రాణాలు కాపాడిన ఎస్సై పవన్ కుమార్ ను వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐ మహేందర్ రెడ్డి అభినందించారు.

## చేర్యాల ప్రాంత రైతుల కన్నీటికి కారకులెవరు..?

- సాగునీరు లేక తలడిల్లుతున్న చేర్యాల జనం
- జనంపక్షాన "జనంసాక్షి" ప్రత్యేక కథనం



**చేర్యాల, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** చేర్యాల ప్రాంతం రైతులు వేసిన పంటలకు నీరు లేక పంటలు ఎండిపోతుంటే కన్నీరు కారుస్తున్నారు.. శివుడు తలపై గంగలా చేర్యాల ప్రాంతానికి తపాస్ పల్లి రిజర్వాయర్ ఉన్నా ఈ ప్రాంత చెరువుల నింపకుండా ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తూ ఈ ప్రాంత రైతుల కన్నీటికి కారకులెవరు? ఇక్కడి అధికారులా..! నాయకులా..! తపాస్ పల్లి రిజర్వాయర్ కోసం ఈ ప్రాంత రైతులు విలువైన భూమిని కోల్పోయి అప్పటి ప్రభుత్వం రిజర్వాయర్ కోసం సేకరించిన భూమికి ధర తక్కువగా చెల్లించినా ఊరుకోవడానికి కారణం ఈ ప్రాంత రైతులు బాగుపడతారని, ప్రస్తుతం ఎండ తీవ్రత అధికం కాకముందుకే చేర్యాల ప్రాంత చెరువులు, బోరుబావులు ఎన్నడూ లేని విధంగా అడుగంటి పోవడం తపస్ పల్లి రిజర్వాయర్ నుండి ఈ సంవత్సరం చెరువులలోకి నీటిని విడుదల చేయకపోవడంతో గ్రౌండ్ వాటర్ రోజు రోజుకి అడుగంటి చెరువులు బీటలు వారుతున్నాయి. నేడు బొమ్మకూర్ డ్యాం నుండి తపాస్ పల్లి రిజర్వాయర్ కు పైప్ లైన్ ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ నీరు తపాస్ పల్లి రిజర్వాయర్ నిండి కాలువల ద్వారా గ్రామాలకు రావడానికి చాలా రోజులు పడుతుంది, పైప్ లైన్ వెళ్లే దారిలో ఉండే చెరువులకు ఎక్కడికక్కడ గేట్ వాళ్లను ఓపెన్ చేసి చెరువులను నింపితే గాని పంట వేసిన రైతులకు నీళ్లు సకాలంలో అందే అవకాశం లేదు, ఒక్కో రైతు లక్షల్లో అప్పు చేసి వరి పంట వేస్తే పంట బాగా వస్తున్న నీళ్లు లేకపోవడంతో కొద్ది రోజుల్లో చేతికి వచ్చే పంట కళ్ల ముందే పశువులకు మేతగా అవ్వడంతో రైతు ఏం చేయని పరిస్థితిలో దుఃఖాన్ని దిగమింగి నీళ్ల కోసం ఎదురుచూస్తూ చేర్యాల ప్రాంత రైతులను ఆదుకోవాలని, లేని పక్షంలో చేర్యాల ప్రాంత రైతులు అందరూ ఏకమై ఏకం ధర్నాలు చేస్తాం అంటూ రైతులు హెచ్చరిస్తున్నారు.

## ఎన్నికలు ఏవైనా ఆధిక్యమే మా లక్ష్యం

- అధికార, విపక్ష పార్టీ నేతల ముమ్మర కసరత్తు



**న్యాల్‌కల్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, సహకార సంఘాలు, ఎమ్మెల్యే, ఎంపీ, తదితర ఎన్నికలు ఏవైనా ప్రతిష్టాత్మకంగా, సవాలుగా స్వీకరించి విజయం, ఆదిక్యమే లక్ష్యంగా శ్రమిస్తారు మండలానికి చెందిన అధికార, విపక్ష పార్టీ నేతలు. సాధారణంగా పార్టీలకు అతీతంగా జరగాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం తమ అభ్యర్థులే విజయం సాధించాలని, మండలంలో అధికంగా ఆదిక్యం పొందాలనే ప్రధాన లక్ష్యంతో మండలానికి చెందిన అధికార కాంగ్రెస్, విపక్ష భాజపా, వివిధ ఉపాధ్యాయ సంఘాల శ్రేణులు విజయం, ఆధిక్యం సాధించేందుకు ముమ్మర కసరత్తు చేపట్టారు. గురువారం మండల కేంద్రమైన న్యాల్ కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు మండల ఎన్నికల అధికారి, స్థానిక తహసిల్దార్ భూపాల్ పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా స్థానిక సంస్థల మాదిరిగా అధికార, విపక్ష పార్టీల నేతలు తీవ్రంగా శ్రమించారు. ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు ముమ్మర కసరత్తు చేపట్టారు. మార్చ్ 3న ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యేంతవరకు వేచి చూడాల్సిందే మరి.

## మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పెండింగ్ లేకుండా చూడాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం నాడు భూదాన్ పోచంపల్లి మున్సిపల్ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న టాక్స్ కలెక్షన్ ఇప్పటివరకు 49% పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ తెలుపగా ,టాక్స్ కలెక్షన్ డిమాండ్ సమయానికి నోటీసులు జారీ చేస్తున్నారా లేదా అని అడిగి టాక్స్ కలెక్షన్ స్పీడ్ అప్ చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. వార్డ్ ఆఫీసర్ లు ప్రతిరోజు ఎంత టాక్స్ కలెక్షన్ చేస్తున్నరని కలక్షన్ చేసిన డబ్బును బ్యాంకులో జమ చేస్తున్నారా లేదా అని తెలుసుకొని ఎప్పటికపుడు బ్యాంకులో జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్ కుమార్ రెడ్డి, ఇన్చార్జి తహసిల్దార్ నాగేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి రానివ్వొద్దు




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** రానున్న వేసవిలో త్రాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో మిషన్ భగీరథ బడ్జెట్ పన్నుల వసూలు పై సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మిషన్ భగీరథ గురించి మాట్లాడుతూ గ్రామ గ్రామాన మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా అవు తున్నాయని వచ్చే వేసవిలో కూడా అలాగే సరఫరా చేయాలన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని ఏవీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు.ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 991 ఓట్లకు గాను 935 ఓట్లు పోలయ్యాయని తెలిపారు.పురుషులు 548, స్త్రీలు 387మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.జిల్లాలో 2664 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు.జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని అన్నారు.ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు 2530 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, డిఎస్పి రవి, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఘనపురంలోనే ఏర్పాటు చేస్తాం



**ఖిల్లా ఘనపురం, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలోనే వ్యవసాయా మార్కెట్ యార్డు ను ఏర్పాటు చెయ్యాలని స్థానికంగా హమాలీ కూలీలు అధికంగా ఉన్నారని మార్కెట్ యార్డ్ స్థానికంగా నిర్మాణం చేపడితే మాకు తాగు జీవానోపాధి దొరుకుతుంది అని స్థానిక హమాలీ సంగం నాయకులు గురువారం ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి ని వనపర్తి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం ద్వారా తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఘనపురం హమాలీ సంగం అధ్యక్షులు బాయని శేఖర్, ఆంజనేయులు, బాలయ్య, కుర్మన్న, హమాలీ సంగం నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**
**ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పరిశీలన**

**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 27 (జనంసాక్షి)**



ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ జరిగిందని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల ఇంజనీరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి నమోదైన ఓటింగ్ శాతం వివరాలను కంట్రోల్ రూమ్ నకు అందజేయాలన్నారు. ఓటర్ల కోసం ఏర్పాటుచేసిన త్రాగునీరు, అత్యవసర వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఎన్నికలు పూర్తయ్యేంతవరకు నిరంతరం పటిష్ట పోలీసు బందోబస్తు కొనసాగించాలన్నారు. ఇప్పటివరకు నమోదైన పోలింగ్ శాతం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలోకి సెల్ ఫోన్లు అనుమతించకూడదని సూచించారు. వరుసలో నిలబడిన ఓటర్లను, పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని కోరారు. అనంతరం కడెం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ కు అందజేయాలని అధికారులను కలెక్టర్ సూచించారు.

# క్షయ వ్యాధి రహిత గ్రామాలుగా మార్చాలి

**జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ**

**వీపనగండ్ల, ఫిబ్రవరి 28 (జనం సాక్షి)**




వీపనగండ్ల మండల పరిధిలో ఆయా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి టీబీ( క్షయ) వ్యాధి నిర్మూలన కోసం గ్రామాలలో ప్రతిష్టాత్మకంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా టీబీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలో వంద రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని అలాగే గురువారం మండల పరిధిలోని కల్వరాల పుల్గర్ చర్ల గ్రామాలలో టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని,టీబీ వ్యాధి లక్షణాలున్న రోగులను గుర్తించి వారికి అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి సరిపడా టాబ్లెట్స్ ఇస్తున్నామని తెలిపారు.క్షయ వ్యాధిని నిర్ధారించడానికి చర్మపరీక్ష,రక్త పరీక్ష, చాతి ఎక్స్-రే, మూత్ర పరీక్షలు నిర్వహించి క్షయ వ్యాధిని నిర్ధారించడం జరుగుతుందని అన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు రోగి బలహీనత లేదా అలసటగా ఉండటం,రోజురోజుకు బరువు తగ్గటం, ఆకలి లేకపోవడం, జ్వరం రాత్రిపూట చెమటలు పట్టడం, గొంతు బొంగురు పోవడం, వంటి లక్షణాలు ఉంటాయని, ఇలాంటి లక్షణాలున్న ప్రతి ఒక్కరు వెంటనే వైద్యులను సంప్రదించి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. టీబీ వ్యాధి ఉన్నవారు బహిరంగ ప్రదేశాల్లో తుమ్మటం,తగ్గటం, ఉమ్ము వేయటం చేయరాదని సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని %శ్రీ%,వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యకమైన వాతావరణం ఉండాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సలహాలు సూచనలతో మందులు వాడితే టీబి వ్యాధిని నివారించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్స్ శ్వేత,కరుణశ్రీ,హెల్త్ ఎజుకేటర్ కేశవులు, హెల్త్ అసిస్టెంట్స్ రాములు,జహంగీర్, ఏఎన్ఎంలు సునీత,శోభా,సునందన, టీబీ ప్రోగ్రామ్ సిబ్బంది ప్రవీణ్,రత్నం,ధర్మ, గోవిందు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ బిడ్డ ఫ్లెక్సీల చించివేత దుర్మార్గమైన చర్య




**ఈఆర్ ఫౌండేషన్ సభ్యుడు అర్గుల్ సురేష్**

**ఆర్మూర్, ఫిబ్రవరి 27 ( జనం సాక్షి):**

ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్దుల గుట్టపై మహాశివరాత్రి సందర్భంగా ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీసీ బిడ్డ ఈరవత్రి రాజశేఖర్ భక్తులకు స్వాగతం కోసం ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను కొందరు కావాలని చింపివేశారని ఈఆర్ ఫౌండేషన్ సభ్యుడు అర్గుల్ సురేష్ చెప్పారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎందరో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు రాందాస్ పేరుతో సేవా కార్యక్రమాలు చేయడానికి కొందరు మిత్రులతో కలిసి ఈఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలు, అనాధలు, విద్యార్థులను ఆదుకోవడానికి ఏడాది నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. మహాశివరాత్రి సందర్భంగా సిద్దుల గుట్ట ఆలయ కమిటీ సభ్యులు ఈరవత్రి రాజశేఖర్ వద్దకు వచ్చి ఆర్థిక సాయం అడగగా రూ. 27 వేలు ఇచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా సిద్దుల గుట్టపై వచ్చే భక్తులను ఆహ్వానించడానికి ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 ఫ్లెక్సీలను గుట్టపై ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిద్దులగుట్టపై మూడు ఫ్లెక్సీలు పెట్టగానే ఆలయ కమిటీ సభ్యులు గంట గంటకు ఫోన్ చేసి ఫ్లెక్సీలను తొలగించాలని తమపై తీవ్ర ఒత్తిడి చేశారన్నారు. మంచి ఉద్దేశంతో దాతగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే గౌరవం ఇవ్వవలసింది పోయి కొందరు ఫ్లెక్సీలను చింపివేశారని చెప్పారు. ఈ విషయాన్ని ప్రశ్నించగా ఫ్లెక్సీలను కోతులు చింపివేసినట్లు చెప్పారని, తాము వెళ్లి పరిశీలించగా కోతులు చింపివేసినట్లు లేదన్నారు. మహాశివరాత్రి ముందు రోజు ఒక ఫ్లెక్సీని చింపివేశారని, అన్నదాన కార్యక్రమంలో పాల్గొనానికి వెళ్లినప్పుడు మరో రెండు ఫ్లెక్సీలు చింపివేసి ఉన్నాయన్నారు. తమ ఫౌండేషన్ కు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదన్నారు. సేవా కార్యక్రమాలు మాత్రమే చేస్తున్నామన్నారు. సిద్దుల గుట్టపై ఫ్లెక్సీల చింపివేతను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఫ్లెక్సీల చింపివేత బిసి బిడ్డ రాజశేఖర్ పై జరిగిన దాడిగా వర్ణించారు. ఇఆర్ ఫౌండేషన్ ఇలాంటి చిన్న చిన్న సంఘటనలకు భయపడదని మరింత పట్టుదలతో సేవా కార్యక్రమాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈ ఆర్ ఫౌండేషన్ సభ్యులు బాదాం రాజ్ కుమార్, రాంప్రసాద్, విటోబా శేఖర్, కొండి రామచందర్, కిట్టు, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

# చెదురు మధురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 27 (జనం సాక్షి)**



గురువారం జిల్లా వ్యాప్తంగా జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయా మండల కేంద్రాల్లో చెదురు మధురు సంఘటనలు మినహా .కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగినట్లు జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. 27 పోలింగ్ లొకేషన్లో 54 పోలింగ్ కేంద్రాలలో ఉపాధ్యాయ మరియు విద్యావంతుల పోలింగ్ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.
312 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు. చేశామని,కామారెడ్డి పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ సింధు శర్మ వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ 144 సెక్షన్ అమలులో ఉంచామన్నారు.ఎన్నికలు ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు పోలీసింగ్ కొనసాగుతుందన్నారు.

# ఓటు వేసిన కలెక్టర్, ఎమ్మెల్యేలు

**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి)**



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేష్, సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కలెక్టర్ వెంకటేష్, జిల్లా పోలీసు అధికారి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ కాగజ్ నగర్ డీఎస్పీలు కరుణాకర్, రామానుజం ఆధ్వర్యంలో పోలీసులు పట్టిస్తే బందోబస్తు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విట్టల్, ఎమ్మెల్యే హరీష్ బాబు, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాసులు జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో పర్యటించి ఓటింగ్ సరళిని నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 6200 పట్టభద్ర ఓటర్లు, మరో 6137 ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు.

# మునిపల్లి బీజేపీలో ముసలం

**ఎమ్మెల్సీ ఎన్నికలో బయట పడ్డ గ్రూపు తగాదాలు**

**మునిపల్లి,ఫిబ్రవరి 27(జనం సాక్షి )**

మునిపల్లి మండల బీజేపీలో గ్రూప్ తగాదాలకు తెర లేచింది.ఎంపీ ఎన్నికలో పార్టీలో చేరిన నాయకులు,సంఘ్ పరివార్ నాయకుల మధ్య ముసలం తారా స్థాయికి చేరింది.వీరి మధ్య గల అంతర్గత విభేదాలు గురువారం నాడు బజారున పడ్డాయి.రెండు వర్గాలు చెరో క్యాంపు ఏర్పాటు చేసుకుని ఓటింగ్ స్లిప్పులు అందజేశారు.దీంతో బీజేపీ అభిమానుల్లో గందరగోళం నెలకొంది.బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపు కోసం ఒక వర్గం తహసీల్దార్ కార్యాలయం ముందు స్వంత ఖర్చుతో కుర్చీలు తదితర సామాగ్రి ఏర్పాటు చేసుకుని ఓటర్లకు స్లిప్పులు పంపిణి చేస్తూ అవగాహన కల్పించారు.మరో వర్గం పార్టీ ఫండ్ తో జడ్పీ హైస్కూల్ సమీపంలో టెంట్ ఏర్పాటు చేసుకుని స్లిప్పులు అందజేశారు.ఎన్నిక పరిశీలనకు వచ్చిన చేవెళ్ల నియోజకవర్గం నాయకులు రత్నయ్య నాయకుల తీరును చూసి వెనుదిరిగి పోయారు.హైదరాబాద్ నుంచిఅభిమానంతో ఓటు వేయడానికి వచ్చిన తమకు కనీసం భోజనం సౌకర్యం ఏర్పాటు చేయలేదని పట్టభద్రులు ఆవేదన వ్యక్తం చేయడం కన్పించింది. పార్టీని పటిష్ట పరిచవల్సిన నాయకుల తీరుతో పార్టీ ఎటు పోతుందని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.జిల్లా నాయకులు తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని సీనియర్ బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తూ వస్తున్నారు.ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపు కోసం తాము స్వచ్ఛందంగా పనిచేస్తున్నా తమ కృషి గుర్తించడం లేదని వారు వాపోతున్నారు.పార్టీ మూలాలు తెలియని వ్యక్తులకు బాధ్యతలు ఎలా అప్పజేపుతారని వారు ప్రశ్నినిస్తున్నారు.సీనియర్ నాయకులు,కార్యకర్తలను కలుపుగోకుండా ఒంటెద్దు పోకడ పాతే సహించేది లేదని అందరు కలిసి పనిచేసి పార్టీని ముందుకు తీసుకుపోవడానికి జిల్లా, రాష్ట్ర నాయకులు చోరువ తీసుకోవాలని కార్యకర్తలు కోరుతున్నారు.

# కలెక్టర్ స్పందించకపోవడం బాధాకరం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి)**



పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీకి గురువారం జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియలో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలలు పాఠశాలల్లో పని చేస్తున్న అధ్యాపకుల ఓట్లను తొలగించారని కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన స్పందన కరువైందని డాక్టర్ బాలు అన్నారు,పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం తప్పుడు ఫిర్యాదు చేస్తే స్పందించిన అధికారులు,తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని కోరితే మాత్రం స్పందించలేరని తెలంగాణ లెక్చరర్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన విద్యావంతులకు ఓటు వేసే అవకాశం లేకపోవడం బాధాకరమని మండలాల్లో ఉన్న తహసిల్దార్లు ఏ ప్రాతిపదికన ఓటర్లను తొలగించారో అడిగితే కూడా చెప్పే పరిస్థితి లేదన్నారు,అవగాహన లోపంతో అర్హులైనటువంటి వారి ఓట్లను తొలగించడం అప్రజాస్వామ్యమని,దీనికి కారకులైన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని అన్నారు.అన్ని ధ్రువీకరణ పత్రాలు అందజేసిన తర్వాతనే తుది జాబితాలోకి ఓట్లు రావడం జరిగిందని అన్నారు. పోలింగ్ బూత్ లోకి వెళ్లి అడిగితే మీ యొక్క ఓట్లు డిలీట్ కావడం జరిగిందని అన్నారన్నారు.

# అధికారుల పనితీరుపై అసహనం

**ఝరాసంగం, ఫిబ్రవరి 27(జనం సాక్షి):**



మండల కేంద్రమైన ఝరాసంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం గురువారం రెండు పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పట్టాభద్రులు 68.94 శాతం నమోదు కాగా 96.15 శాతం టీచర్లు ఓటింగ్ నమోదైంది. పట్టభద్రురాలైన తెలంగాణ వికలాంగుల వేదిక రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి వసీమ వికలాంగురాలు వీలుచైర్ ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతూ ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వచ్చింది. అధికారుల పని తీరుపై ఆమె అసహనం వ్యక్తం చేసింది. పోలింగ్ కేంద్రం వద్ద ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# తోగరురామయ్యపల్లెలో పులి కలకలం

**అది పులి కాదు హైనా : అటవీ శాఖ అధికారులు**

**వరంగల్ ప్రతినిధి :ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :**



వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తొగరు రామయ్య పల్లెలో ఓ రైతు చేనులో పులి పాదముద్రలు ఉన్నట్లు తెలియడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సోమ, దుగ్గొండి ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి వచ్చి పాదముద్రలను పరిశీలించారు. తొగరామయ్య పల్లెకు చెందిన రైతు మొక్కజొన్న చేన్లో పులి పాదముద్రలు చాలా పెద్దగా ఉంటాయని గోర్ల గుర్తులు పడవని ఇక్కడ గోర్ల గుర్తులు ఉన్నందున అవి పులి అడుగులు కావని హైనా గా పేర్కొన్నారు. అడుగులు ప పరిశీలించినట్లయితే పులి అడుగుల మాదిరిగా లేవని హైనా లేదా కోన్ రీస్ అడుగులు అయి ఉండవచ్చని ఫారెస్ట్ అధికారులు పేర్కొన్నారు అన్నదాతలు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన తెలిపారు.. సమీప రైతులు అన్నదాతలు రాత్రిపూట సంచరించకుండా ఒంటరిగా వెళ్లకూడదని తగు జాగ్రత్తలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు పోలీసు అధికారులు సమీప గ్రామ ప్రజలకు తెలిపారు.

# పన్ను వసూళ్లలో పురోగతి అవసరం

**ఎల్బీనగర్ లో క్షేత్రస్థాయిలో పన్ను వసూళ్ల తీరు పరిశీలన**

**వరంగల్ ఎంజీఎం,ఫిబ్రవరి 27(జనంసాక్షి):**



పను వసూళ్లను పురోగతి అవసరం అని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అన్నారు .బల్దియా పరిధి 21వ డివిజ న్ ఎల్బీనగర్ గురువారం కొనసాగుతున్న పన్ను వసూళ్ల తీరును కమిషనర్ ఆకస్మికం గా క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి నిర్వహణ తీరును అధికారు లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే ఆర్ ఐ లు బిల్ కలెక్టర్ల వారిగా రోజువారి లక్ష్యాలను కేటాయించడం జరిగిందని, ఖచ్చితంగా ప్రతిరోజు 100 వసూళ్లు జరపాలని, సుదీర్ఘకాలం పన్నులు చెల్లించకుండా ఉన్న యాజమాన్యాలకు రెడ్ నోటీసులు అందజేయాలని, బడా బాకాయిదారుల జాబితా అందుబాటు లో ఉంచుకొని బృందాలుగా వెళ్లి వసూళ్లు జరపాలని, పన్ను చెల్లించని మొండి బకాయిదారులకు హెచ్చరికలు జారీ చేయాలని , ఆర్వోలు పన్ను వసూళ్ల తీరును నిత్యం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, రెవెన్యూ అధికారి షహజాది బేగం,ఆర్ ఐ సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల తూకపు యంత్రాలను పరిశీలించిన తహసిల్దార్

**పాలకుర్తి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి)**



పాలకుర్తి మండలంలోని ఉన్న రేషన్ షాపులలో గల కాంటాలను గురువారం తహసిల్దార్, జిల్లా తునికల కొలతల అధికారి వి. శ్రీనివాసులు పరిశీలించి స్టాంపింగ్ లు వేశారు, మండల కేంద్రంలోని పాలకుర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో రేషన్ డీలర్ల తోకపు యంత్రాలను అధికారులు పరిశీలించి స్టాంపింగ్ వేశారు, ఈ యంత్రాలను ఆర్ ఐ రాకేష్, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు,

# కరీంనగర్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :**




**పోలింగ్ స్టేషన్లను సందర్శించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**
**అధికారుల సమన్వయంతో పోలింగ్ ప్రక్రియ విజయవంతం**
**పకడ్బందీగా పోలీస్ బందోబస్తు.**

కరీంనగర్ జిల్లాలో మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. దీంతో ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా ముగిసింది. ముక్రంపురలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన గ్రాడ్యుయేట్ ఎన్నికల పోలింగ్ స్టేషన్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి క్యూ లైన్ లో వెళ్లి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 85 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు ,18 టీచర్స్ పోలింగ్ స్టేషన్లలో గ్రాడ్యుయేట్లు ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేల సత్పతి ఎమ్మెల్సీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అటు అధికారులు కిందిస్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక ప్రణాళికను రచించారు.కరీంనగర్ లోని బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఎన్నికల సామాగ్రి బ్యాలెట్ బాక్స్ ల స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచనున్నారు. ఈ మేరకు వాటిని స్వీకరించినందుకు అధికారులు రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెదక్, నిజాంబాద్, కరీంనగర్, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చే ఎన్నికల సామాగ్రి బ్యాలెట్ బాక్స్ లను ఎక్కడికి అక్కడ అధికారులు స్వీకరించి భద్రపరచనున్నారు. ఈ మేరకు అంబేద్కర్ స్టేడియంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూముల 24 గంటల పాటు నిఘా నీడన పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. గురువారం అర్ధరాత్రి వరకు అన్ని జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూములకు చేరుకొనున్నాయి.

**కరీంనగర్ జిల్లాలో..**

కరీంనగర్ జిల్లాలో 71 వేల 545 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, 4 వేల 305 మంది టీచర్స్ ఓటర్లు ఉన్నారు. మొత్తం 103 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ జరిగింది. ఇందులో 85 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు కాగా, 18 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. రెవెన్యూ డివిజన్లో వారీగా పరిశీలిస్తే కరీంనగర్ రెవెన్యూ డివిజన్లో 69 గ్రాడ్యుయేట్, 12 టీచర్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. హుజురాబాద్ రెవెన్యూ డివిజన్లో 16 గ్రాడ్యుయేట్ 6 టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్ల లో ప్రశాంతంగా పోలింగ్ సాగింది. కరీంనగర్ జిల్లాలో మొత్తం 103 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 312 మంది పోలింగ్ ఆఫీసర్లు, 36 మంది రిజర్వు సిబ్బంది, మొత్తం 451 మంది పోలింగ్ విధుల్లో పాల్గొన్నారు. జిల్లాలో 36 మంది మైక్రో అబ్జర్వర్లు, 12 మంది సెక్టార్ ఆఫీసర్లు విధులు నిర్వర్తించారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ జరిగింది. పలు ప్రాంతాల్లో నాలుగు గంటల లోపల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. అధికారులు ఆయా చోట్ల ఆరు ఏడు గంటల వరకు కూడా పోలింగ్ జరిగింది. పోలింగ్ ముగిసిన అనంతరం అన్ని జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో గల రిసెప్షన్ సెంటర్‌కు తరలించనున్నారు. మార్చి 3న ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. కరీంనగర్ లోని బిఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియం ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నారు. .

# చికెన్ భయాలు అసత్యం

- అల్వాల్‌లో చికెన్ మేళ, ప్రజలకు అవగాహన



**అల్వాల్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** ఈ మధ్యకాలంలో గుడ్డు, చికెన్ సంబంధించి పలు వదంతులు వ్యాపిస్తున్నాయి. దీని కారణంగా ప్రజలు చికెన్ తినడాన్ని దూరంగా పెడుతున్నారు. అయితే, అల్వాల్ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ఈ అపోహలను తొలగించేందుకు ముందుకొచ్చింది. లక్ష్మి కళామందిర్ థియేటర్ సమీపంలో ఏర్పాటు చేసిన చికెన్ మేళలో అసోసియేషన్ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉడకబెట్టిన గుడ్లు, ఫ్రై చేసిన చికెన్ పదార్థాలను ఉచితంగా పంపిణీ చేశారు. "ప్రస్తుత పరిస్థితుల్లో గుడ్లు, చికెన్ తినడం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి హాని లేదు" అని అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ కొండల్, కోశాధికారి కృష్ణారెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. వైద్య, పోషకాహార నిపుణుల ప్రకారం, గుడ్డు మరియు చికెన్‌లో ఉన్న ప్రోటీన్లు శరీరానికి ఎంతో అవసరం. కాబట్టి ప్రజలు అపోహలను నమ్మకుండా, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని అసోసియేషన్ సూచించింది.

## హైదరాబాద్‌లో ఫెనటిక్స్ డిజిటల్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ సెంటర్

హైదరాబాద్లో ఫెనటిక్స్ కొత్త డిజిటల్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ సెంటర్ను ప్రకటించింది. దీనికి అభిషేక్ ధస్మానాను వైస్ ప్రెసిడెంట్గా, జనరల్ మేనేజర్గా నియమించింది. 2026 నాటికి ఈ సంస్థ మరింతో బలోపేతం కానుందని తెలిపింది. రాబోయే రెండేళ్లలో డిజిటల్ స్పోర్ట్స్ విభాగంలో ఉపాధి అవకాశాల సంఖ్య రెట్టింపు కానుందని ధీమా వ్యక్తం చేసింది.

### వచ్చే ఏడాదికి మరింత విస్తరణ

ఫెనటిక్స్ ప్రముఖ గ్లోబల్ డిజిటల్ స్పోర్ట్స్ ప్లాట్ఫామ్. 80 ప్రాంతాల్లో, 22వేల మంది ఉద్యోగులతో తమ కంపెనీని మరింత బలోపేతం చేస్తున్నట్లు ప్రకటించింది. సంస్థ విస్తరణ కోసం నిబద్ధతతో పని చేస్తామని వివరించింది. 2026 నాటికి హైటెక్ సిటీలో ప్రస్తుతం ఉన్నదాని కంటే సంస్థ విస్తరణ మూడు రెట్లు అధికమవుతుందని పేర్కొంది. హైదరాబాద్లో ఫెనటిక్స్ కార్యాలయంలో అభిషేక్ ధస్మానాను వైస్ ప్రెసిడెంట్గా నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ఈ సంస్థలో ప్రతిభావంతులు పని చేస్తున్నారని, ఈ బృందంలో తనను చేర్చుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సాంకేతికత, ఏఐను ఉపయోగించుకుని మా సంస్థ భవిష్యత్తును రూపొందించడానికి ఎంతోగాను ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

# చర్లపల్లి నుంచి కాకినాడ, నర్సాపూర్‌కు స్పెషల్ ట్రైన్స్




- ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. చర్లపల్లి నుంచి కాకినాడ, నర్సాపూర్ కు 20 ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి నెల 30 వరకు ఈ స్పెషల్ ట్రైన్స్ రాకపోకలు సాగిస్తాయని తెలిపింది. చర్లపల్లి-కాకినాడ టౌన్ (07031) రైలు ఫిబ్రవరి 28, మార్చి 7, 13, 21, 28 తేదీల్లో రాత్రి 7.20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 4.30 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని పేర్కొంది. ఇక తిరుగు ప్రయాణంలో కాకినాడ టౌన్ %-% చర్లపల్లి (07032) మార్చి 2, 9, 16, 23, 31 తేదీల్లో సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పింది. చర్లపల్లి నర్సాపూర్ (07233) రైలు ఫిబ్రవరి 28, మార్చి 7, 13, 21, 28 తేదీల్లో రాత్రి 8.15 గంటలకు బయలుదేరి.. తెల్లవారి 5.50 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని తెలిపింది. తిరిగి నర్సాపూర్-చర్లపల్లి (07234) రైలు మార్చి 2, 9, 16, 23, 31 తేదీల్లో రాత్రి 10 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజున ఉదయం 6 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని చెప్పింది. చర్లపల్లి-కాకినాడ-చర్లపల్లి రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుందని పేర్కొంది. చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, విరవసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే వివరించింది.

# చిట్టీల పేరుతో 500 మందికి కుచ్చుటోపి


- తెలుగు రాష్ట్రాల్లో మోసాలు.. బాధితుల ఆందోళన
- తాజాగా ఎస్ఆర్‌నగర్‌లో మరో కేసు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో చిట్టీల పేరుతో మోసాలు పెరిగిపోతున్నాయి. ఇంటి దగ్గర ఉండే అమాయక మహిళలను చిట్టీల పేరుతో బుట్టలో వేసుకుని ఆ తర్వాత చల్లగా ఉడాయిస్తున్నారు చీటర్లు. చిట్టీల పేరుతో కుచ్చుటోపి పెట్టిన మరో కేటుగాడి కేసు వెలుగులోకి వచ్చింది. కోట్ల రూపాయల మేర నట్టేట ముంచినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్ సీ టైప్ కాలనీలో నివాసం ఉంటున్న పుల్లయ్య ఈ మోసానికి పాల్పడ్డాడు. అనంతపురం జిల్లాకు చెందిన పుల్లయ్య, ఎస్ఆర్ నగర్‌లో మేస్త్రి పని చేసుకుంటూ చిట్టీల బిజినెస్ ప్రారంభించాడు. 5 లక్షల నుంచి 50 లక్షల రూపాయల వరకు చిట్టీలు ప్రారంభించాడు. సుమారు 500 మంది నుండి చిట్టీలు వసూలు చేసిన పుల్లయ్య.. చిట్టి గడువు ముగిసిన డబ్బులు ఇవ్వకుండా అధిక వడ్డీ ఇస్తానంటూ నమ్మించాడు. ఈనెల 23 నుంచి చిట్టి డబ్బులు అందరికీ ఇస్తానంటూ చెప్పిన పుల్లయ్య.. ఆ తర్వాత నుంచి కనిపించకుండా పోయాడు. సీ టైప్ కాలనీలో మోసగాడికి చెందిన జీ ప్లస్ ఫోర్ భవనం ముందు బాధితులు ఆందోళనకు దిగారు. గతంలోనూ అనంతపురంలో ఇదేవిధంగా మోసం చేసి హైదరాబాద్‌కు వచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. ఫిర్యాదు అనంతరం ఈ అంశంపై పోలీసు చర్యలు తీసుకోనున్నారు.

# గల్లీ నుండి ఢిల్లీ దాకా ఎదురులేకుండా మోడీ

## ఎన్నికల సరళిని పర్యవేక్షించిన మాజీ మంత్రి గుండె విజయ రామారావు

**స్టేషన్ ఘన్పూర్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో గల స్టేషన్ ఘనపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్నటువంటి ఎన్నికల సరళిని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు మాజీమంత్రి గుండె విజయరామారావు పర్యవేక్షించారు. అనంతరం జనగామ జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్‌తో కలిసి మాట్లాడుతూ బిజెపి హవా గల్లినుండి డిల్లీదాకా ఎదురులేకుండా పోయిందని, మోడీ పథకాలకు ఆకర్శితులైన ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, నేటితో ఉపాధ్యాయ, అద్యాపకులు కూడా బలపరుస్తున్నారని, ఓటింగ్ లో పాల్గొన్న టీచర్లకు ధన్యవాదాలు తెలియ జేసారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటిలో నిలబెట్టె అభ్యర్థులుకూడా లేని పార్టీలకు మోదీని విమర్శించే హక్కు జన్మలో లేదని ఎద్దేవజేసారు. ఈ



కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ కో-కన్వీనర్ ఇనుగాల యుగేంధర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజి రెడ్డి, మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణా గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాయ ఎల్లయ్య,జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రడపక ప్రదీప్, జిల్లా కార్యవర్గ సభ్యులు కందిమల్ల కృష్ణమూర్తి, జిల్లా సీనియర్ నాయకులు వెంకన్న, బూర్ల విష్ణు, మంద రాజేష్ రెడ్డి, రావుల రమే ష్, రాజేశ్వర్ రెడ్డి, కత్తుల రాజు యాదవ్, దీగోజు వెంక టయ్య, కొమురయ్య , శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్యారడైజ్ హొటల్‌లో హలీం ఫెస్టివల్ ప్రారంభం




**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ముస్లిం సోదరుల పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానుంది. ఈ క్రమంలో హైదరాబాద్ నగరవాసులకు సంప్రదాయ వంటకమైన హలీంను అందించేందుకు సికింద్రాబాద్ ప్యారడైజ్ హొటల్‌లో హలీం ఫెస్టివల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. గురువారం ప్యారడైజ్ హొటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హొటల్ సీఈఓ గౌతమ్ గుప్తా వివరాలు వెల్లడించారు. మటన్ అండ్ చికెన్ హలీం అందించనున్నట్లు తెలిపారు. వినియోగదారులకు డెలివరీ సదుపాయాన్ని కూడా కల్పించినట్లు చెప్పారు. ఇక ఆలస్యం ఎందుకు.. నగరవాసులు రుచికరమైన హలీంను ఆరగించండి.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన పుట్ట మధు



**మల్హర్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** మండలంలోని నాచారం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిదురాల పురుషోత్తం ను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గురువారం పరామర్శించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఉప్పుల రాజు, ఉప్పుల శంకర్‌ల కుటుంబాన్ని అలాగే వేముల సంతోష్ కుటుంబాన్ని పుట్ట మధుకర్ పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాఘవరెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు గోనె శ్రీనివాస్ రావు, నాయకులు పుట్టపాక శ్రీనివాస్, వాల యాదగిరి రావు, కాసాని రామయ్య శ్రీశైలం, సది, రాజేందర్, భాస్కర్, వెంకయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల 68.51 శాతం.. టీచర్లది 94.63 శాతం

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం జరిగిన పట్టభద్రుల,టీచర్ ఎమ్మెల్సీ స్థానాల కోసం జిల్లా వ్యాప్తంగా 41 కేంద్రాలు ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 677 మంది పురుషులు, 273 మంది మహిళా టీచర్లు మొత్తం 950 మంది ఉండగా, పురుషులు 640,మహిళలు 259 మంది మొత్తం 899 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.పోలింగ్ శాతం 94.63 గా నమోదయింది.పట్టబద్రులలో 13,772 పురుషులు 8,625 మంది, మహిళలు మొత్తం 22,397 ఉన్నారు. వీరిలో



9,523 మంది పురుషులు 5,821 మంది మహిళలు మొత్తం 15,344 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం మొత్తం 68.51గా నమోదయింది.

# మెహదీపట్నంలో జింక ప్రత్యక్షం




**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిమల్కాపూర్ సాయిబాబా టెంపుల్ వద్ద ఓ జింక ప్రత్యక్షమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని, స్థానికుల సహాయంతో జింకను పట్టుకున్నారు. అనంతరం జింకను పోలీసులు అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గుడిమల్కాపూర్‌లో ప్రత్యక్షమైన జింకను నెహ్రూ జూపార్కులో వదిలేశారు. అయితే జింక ఎక్కడ్నుంచి వచ్చిందనే కోణంలో అటవీశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# అధికారులు అందుబాటులో ఉండాలి

- జిహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండలని జిహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జోనల్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో అందుబాటులో ఉండలని, అధికారులు సిబ్బంది సమయ పాలన పాటించాలని అందుకు ఆర్టిఫీషియల్ సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. హెడ్ ఆఫీసులో హెచ్ఓడి లు కూడా అందుబాటులో ఉండేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

జోనల్, డిప్యూటీ కమీషనర్ కార్యాలయాల్లో కూడా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఐటి అడిషనల్ కమీషనర్ ను కోరారు. హెడ్ ఆఫీస్ లో హెచ్ఓడి లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టి అదేవిధంగా జోనల్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలకు మీరే భాధ్యత కాబట్టి అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించే విదంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# మార్చి 1 నుంచి 11 వరకు యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** యాదగిరిగుట్ట నరసింహస్వామి ఆలయంలో మార్చి 1 నుంచి 11 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మార్చి 7న ఎదుర్కోలు మహొత్సవం, 8వ తేదీన తిరు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. మార్చి 9న దివ్య విమాన రథోత్సవం జరగనుంది. అలాగే బ్రహ్మోత్సవాల దృష్ట్యా కల్యాణాలు, హొమాలు, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చణ సేవను రద్దు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. యాదగిరిగుట్ట పంచనారసింహస్వామి పుణ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఈ ఏడాదితో 70 సంవత్సరాలు పూర్తవుతాయి. కృష్ణశిలతో పునర్ నిర్మితమైన ఆలయంలో మూడోసారి జరగనున్న వేడుకలు 50.5 అడుగుల ఎత్తు, ఐదంతస్థుల కృష్ణశిల విమానం (గోపురం) బంగారు కవచాలతో రూపొంది మహాదివ్యంగా తీర్థ జనులకు దర్శనమిస్తోంది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1న ప్రారంభమై 11న నిర్వహించే సహస్ర ఘటాభిషేకంతో ముగుస్తాయి.

# మంచినీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు

- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్..



**గోదావరిఖని, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** గత పాలకుల అసమర్థ నిర్ణయాల వల్ల వేసవి కాలం రాకముందే రామగుండం నియోజకవర్గంలోని గోదావరి నదిలో నీరు లేక దాదాపుగా పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఏర్పడిన తరుణంలో గురువారం మధ్యాహ్నం రామగుండం అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సింగరేణి సంస్థ సహకారంతో గోదావరి నదిలో ప్రోక్లైన్ ను స్వయంగా నడిపి ఇసుక మేటలు తోడి పనులను ప్రారంభించి సంబంధిత అధికారులకు అవసరమగు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యేతో పాటు సింగరేణి సంస్థ ఆర్జి-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, తాజా మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# నిర్మాత కేదార్ మృతిపై అనుమానాలున్నాయి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** దుబాయ్ లో కేదార్ అనుమానాస్పదంగా మృతి చెందటం పలు అనుమానాలకు దారి తీస్తోంది అన్నారు కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి. కేదార్ మర్డర్ మిస్టరీపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. నిందితులు ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. డ్రగ్స్ దందాలో సినీ ప్రముఖుల ప్రమేయం ఉందని ఇప్పటికే పలుమార్లు బయటికి వచ్చినట్లు గుర్తు చేశారు.

సినీ ప్రముఖులు బ్రాండ్ అంబాసిడర్ పేరుతో విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారని, తర్వాత ఆ చీటర్స్ చేతిలో స్టార్స్ మోసపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా హవాలా దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం అయ్యే అవకాశం ఉందన్నారు.

# 1న సనత్ నగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** సనత్‌నగర్ లయన్స్ క్లబ్, సంకేత్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి ఒకటో తేదీన సనత్ నగర్‌లోని వెజిటబుల్ మార్కెట్ గ్రౌండ్స్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నాయి. ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు, సరోజినీ దేవి కంటి ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్- బల్కంపేట శంకర్ నేత్రాలయ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ రవీందర్ గౌడ్ నేతృత్వంలో ఈ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారు. ఈ ఉచిత వైద్య శిబిరం మార్చి ఒకటో తేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో భాగంగా కంటి పరీక్షలు చేయించుకునే వారికి అవసరమైతే కంటి అద్దాలు, అత్యవసరమైతే ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తామని డాక్టర్ ఎస్ రవీందర్ గౌడ్ తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎస్సార్ నగర్ ఏసీపీ పీ వెంకట్ రమణ, సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు అతిథులుగా విచ్చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానికులకు సంకేత్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు మురళి ఫణి విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిదే గెలుపు

**ముస్తాబాద్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండల కేంద్రం జెడ్పి ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కేకే మహేందర్రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డిపై గెలుపు ధీమా వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధిపై, విద్యా విద్యార్థి రంగాలకు అందిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై పట్టబద్రులు సానుకూలంగా స్పందిస్తున్నారని అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల



బాల్రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు, నాయకులు కొండం రాజిరెడ్డి, దీటి భాను, నరేష్ ప్రశాంత్, తలారి నరసయ్య, ఏఎంసి వైస్ చైర్మన్ వెల్మల రామిరెడ్డి, దీటి నరసింహులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు ఎయిర్‌పోర్టులు?..

## వచ్చే ఏడాది మార్చినాటికి అమ్మేయనున్న కేంద్రం!



విమానాశ్రయాల ప్రైవేటీకరణను మోదీ సర్కారు మళ్లీ మొదలుపెట్టింది. ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది.

విమానాశ్రయాల ప్రైవేటీకరణను మోదీ సర్కారు మళ్లీ మొదలుపెట్టింది. ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని ఇంటర్‌-మినిస్టీరియల్ కన్సల్టేషన్‌లో ప్రస్తావనకు తీసుకొచ్చినట్టు కూడా చెప్తున్నారు.

జాతీయ నగదీకరణ ప్రణాళిక కింద 2022 నుంచి 2025 వరకు మొత్తం దేశవ్యాప్తంగా 25 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని కేంద్రం నిర్ణయించుకున్నది. వీటిలో భువనేశ్వర్, వారణాసి, అమృత్‌సర్, తిరుచ్చి, ఇండోర్, రాయ్‌పూర్, కాలికట్, కోయంబత్తూర్, నాగ్‌పూర్, పాట్నా, మధురై, సూరత్, జోధ్‌పూర్, రాంచీ, చెన్నై, విజయవాడ, రాజమండ్రి, వడోదర, భోపాల్, తిరుపతి, హుబ్లీ, ఇంఫాల్, అగర్తల, డెహ్రాడూన్, ఉదయ్‌పూర్ ఉన్నాయి. ఈ క్రమంలోనే ముందుగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బోర్డు (ఏఏఐ) 13 ఎయిర్‌పోర్టులను గుర్తించింది. దీంతో వీటి ప్రైవేటీకరణకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కేబినెట్ అనుమతికి సిద్ధమైంది. అయితే మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. రాయ్‌పూర్, ఇండోర్ విమానాశ్రయాల ప్రైవేటీకరణకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో సదరు జాబితా 11 ఎయిర్‌పోర్టులకు తగ్గింది. ఈలోగా గత ఏడాది లోక్‌సభ ఎన్నికలు రావడంతో ప్రైవేటీకరణకు బ్రేక్ పడింది. కానీ మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరడంతో ఇప్పుడిక మళ్లీ విమానాశ్రయాల ప్రైవేటీకరణపై సర్కారు పెద్దలు దృష్టి సారించారు.

> ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది.

ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణపై రాష్ట్రాల నుంచి గట్టిగానే విమర్శలు వస్తున్నాయి. లాభాల్లో ఉన్న విమానాశ్రయాలు ఈ దెబ్బతో నష్టాల్లోకి జారుకుంటాయని, ప్రైవేట్ రంగంలో కొన్ని బడా కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యంలోకి దేశీయ విమానయాన పరిశ్రమ వెళ్లిపోతుందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ప్యాసింజర్లపై అనవసరపు చార్జీలు వచ్చిపడతాయని, పారదర్శకత లోపిస్తుందని అంటున్నారు. ముఖ్యంగా అదానీ గ్రూప్ కోసమే ఈ ప్రైవేటీకరణ తంతు అన్న ఆరోపణలూ వస్తున్నాయి. ఇక ఇప్పటికే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో.. రాబోయే ఐదేండ్లలో ప్రభుత్వ ఆస్తులను అమ్మి రూ.10 లక్షల కోట్లను ఖజానాకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ తిరిగి పట్టాలెక్కుతున్నది. ఇదిలావుంటే ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగా తొలిసారి 6 పెద్ద ఎయిర్‌పోర్టులతో 7 చిన్న ఎయిర్‌పోర్టులను కలిపేయాలని భావిస్తున్నారు. వారణాసితో ఖుషీనగర్‌-గయా, అమృత్‌సర్‌తో కంగ్రా, భువనేశ్వర్‌తో తిరుపతి, రాయ్‌పూర్‌తో ఔరంగాబాద్, ఇండోర్‌తో జబల్‌పూర్, తిరుచిరాపల్లితో హుబ్లీ క్లబ్ చేయాలని చూస్తున్నారు.

# ఈ వృద్ధితో ఉద్యోగాలు పుట్టవ్



ఇటీవలికాలంలో బలహీనపడ్డ భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ఇప్పటికే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ, ఇంకోవైపు ఆయా రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇదే అంచనాల్ని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

ఇటీవలికాలంలో బలహీనపడ్డ భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ఇప్పటికే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ, ఇంకోవైపు ఆయా రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇదే అంచనాల్ని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈసారి జీడీపీ వృద్ధిరేటు అంచనాలను కూడా పెంచుతున్నాయి. అయితే ఈ అంచనాలు ఏమంత గొప్పగా లేవని రాజన్ పెదవి విరిచారు. ప్రస్తుతం చికాగో యూనివర్సిటీ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్.. తాజాగా ఓ బ్లూంబర్గ్ టెలివిజన్ ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ.. దేశ జీడీపీ గాడినపడుతున్నదని ఆనందించాల్సిన అవసరం లేదని, ఇప్పుడున్న వృద్ధి అంచనాలు.. కొత్తగా జాబ్ మార్కెట్‌లోకి రాబోయే వాళ్లకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేవని తేల్చిచెప్పారు.

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్‌-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 6 శాతానికిపైగానే ఉంటుందన్న అంచనాలు విస్తృతంగా వస్తున్న సంగతి విదితమే. బ్లూంబర్గ్ సర్వేలో ఆర్థికవేత్తలు సైతం ఇదే చెప్పారు. జూలై-సెప్టెంబర్‌తో పోల్చితే (నాడు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయిని తాకుతూ 5.4 శాతంగా నమోదైంది) ఇది ఎక్కువే. అయినప్పటికీ భారత్ ఇంకా మెరుగైన వృద్ధిరేటును సాధించవచ్చని రాజన్ అభిప్రాయపడ్డారు. ఇంకో 2 శాతం పెరిగి 8 శాతం స్థాయిని అందుకోవాలని, అప్పుడే ఏటా మార్కెట్‌లోకి వస్తున్న నిరుద్యోగ యువతకు తగ్గ ఉద్యోగావకాశాలను సృష్టించగలమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన భారత్‌కు ఇప్పుడున్న స్థాయి వృద్ధి సరికాదన్నారు. కాగా, ఈ శుక్రవారం అక్టోబర్‌-డిసెంబర్‌కుగాను దేశ జీడీపీ గణాంకాలు అధికారికంగా విడుదల కానున్నాయి.

మందగించిన దేశ జీడీపీ వృద్ధిరేటును పరుగులు పెట్టించేందుకు దాదాపు ఐదేండ్ల తర్వాత ఆర్బీఐ ఇటీవలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేటును పావు శాతం కోత పెట్టినది తెలిసిందే. ఈ నెలారంభంలో కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా రెపో రేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తెచ్చారు. దీంతో ఆయా బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. అయితే ఎకానమీని బలపర్చేందుకు ఈ నిర్ణయం ఒక్కటే చాలదని రాజన్ వ్యాఖ్యానించారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి దోహదం చేసే చర్యలు కూడా తీసుకోవాల్సి ఉందన్నారు. ఉద్యోగావకాశాలు ఎంతగా పెరిగితే ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలు అంత గట్టిగా సాగుతున్నట్టవుతుందన్నారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తు,సేవలపై అధిక సుంకాలను ప్రకటిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ కారణంగానే దేశీయ స్టాక్ మార్కెట్లు సైతం తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. అయితే ఈ సుంకాలపై రాజన్ స్పందిస్తూ.. అమెరికాతో సత్సంబంధాలు లాభదాయకమని, ఆ దేశం నుంచి చమురు, రక్షణపరమైన కొనుగోళ్లను పెంచడం మంచిదని అభిప్రాయపడ్డారు. అలాగే చాలా వస్తూత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గించే వీలుందన్నారు. నిజానికి దీనివల్ల దేశ వృద్ధిరేటు ప్రగతికి వచ్చే నష్టమేమీ లేదన్న ఆయన.. పైగా పరిశ్రమలో పోటీ వాతావరణం నెలకొంటుందని, అది మంచిదేనని వ్యాఖ్యానించారు. ఇక ఆర్బీఐ గవర్నర్‌గా 2013 నుంచి 2016 వరకు రాజన్ పనిచేశారు.



# ఎట్టకేలకు లాభాల్లోకి సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లాయి. వరుసగా ఐదు రోజులుగా పతనమైన సూచీలకు ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ షేర్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 147.71 పాయింట్ల లాభంతో 74,602 వద్ద నిలిచింది. దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లాయి. వరుసగా ఐదు రోజులుగా పతనమైన సూచీలకు ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ షేర్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 147.71 పాయింట్ల లాభంతో 74,602 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ మాత్రం వరుసగా ఆరోరోజూ నష్టపోయింది. 5.80 పాయింట్లు కోల్పోయి 22,547.55 వద్దకు జారుకున్నది. ఫార్మా, మెటల్, ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో సూచీ తగ్గుముఖం పట్టింది. మార్కెట్లో మహీంద్రా అండ్ మహీంద్రా 2.61 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. జొమాటో, నెస్లె, బజాజ్ ఫిన్‌సర్వ్, మారు తి, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టాటా మోటర్స్ షేర్లు నష్టపో యాయి. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 1,542.45 పాయింట్లు లేదా 2 శాతం నష్టపోయిన విషయం తెలిసిందే.

# తులం ధర ఎంతకు చేరిందంటే..?

రూపాయి పతనం నేపథ్యంలో వరుసగా రెండోరోజూ బంగారం ధర పెరిగింది. పసిడి ధర రూ.250 పెరగడంతో తులం ధర రూ.89,350కి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రూ.250 పెరిగి పది గ్రాములకు రూ.88,950కి చేరుకుంది. ఇక వెండి ధరలు మాత్రం రూ.500 తగ్గి కిలోకు రూ.99,500 పలుకుతున్నది. రూపాయి పతనం నేపథ్యంలో వరుసగా రెండోరోజూ బంగారం ధర పెరిగింది. పసిడి ధర రూ.250 పెరగడంతో తులం ధర రూ.89,350కి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రూ.250 పెరిగి పది గ్రాములకు రూ.88,950కి చేరుకుంది. ఇక వెండి ధరలు మాత్రం రూ.500 తగ్గి కిలోకు రూ.99,500 పలుకుతున్నది. డాలర్ ఇండెక్స్ పెరుగుల కారణంగా వెండి ధర తగ్గిందని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి పేర్కొన్నారు. ట్రంపు సుంకాల భయాలు, ఒత్తిడి కారణంగా ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సైతం ఇబ్బందులుపడుతున్నాయి. అయితే, యూఎస్ ట్రెజరీ దిగుబడిలో తిరోగమనం వెండి ధరలు పెరుగుదల తక్కువగానే ఉండవచ్చని అంచనా. వాణిజ్య సుంకాలపై అనిశ్చితి మధ్య.. యూఎస్ డాలర్‌తో పోలిస్తే మంగళవారం రూపాయి 51 పైసలు తగ్గి రూ.87.23 వద్ద ముగిసింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (%వీజశ%)లో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో ఏప్రిల్ డెలివరీకి సంబంధించిన బంగారం కాంట్రాక్ట్ ధర 10 గ్రాములకు రూ.275 పెరిగి రూ.86,459కి చేరుకుంది. అదే సమయంలో కామెక్స్ బంగారం 2,930 నుంచి 2,955 మధ్య ట్రేడయ్యింది. మరోవైపు మార్చి డెలివరీకి సంబంధించిన వెండి ఫ్యూచర్స్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో కిలోకు రూ.241 పెరిగి రూ.95,330కి చేరుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ కమోడిటీ అనలిస్ట్ సౌమిల్ గాంధీ మాట్లాడుతూ.. మంగళవారం విడుదల కానున్న సీబీ కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్, రిచ్‌మండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండెక్స్‌తో సహా స్థూల డేటా.. బులియన్ ధరలకు దిశానిర్దేశం చేసే యూఎస్ ఫెడరల్ రిజర్వ్‌లోని కొంతమంది సభ్యుల ప్రసంగాల కోసం వ్యాపారులు ఎదురు చూస్తున్నారన్నారు. దేశంలోని వివిధ నగరాల్లోని ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో 22 క్యారెట్స్ గోల్డ్ రూ.80,750 ఉండగా.. 24 క్యారెట్స్ పసిడి ధర రూ.88,090 ధర పలుకుతున్నది. ముంబయిలో 22 క్యారెట్స్ బంగారం రూ.80,750 ఉండగా.. 24 క్యారెట్ల పుత్తడి రూ.88,090 ధర ఉన్నది.

# కుప్పకూలిన ఆర్మీ విమానం.. 46 మంది సైనికులు దుర్మరణం

సైనికులతో వెళ్తున్న విమానం కుప్పకూలిపోయింది. ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఆ విమానం.. జనావాసాల మధ్య కూలింది. ఈ ఘటనలో 46 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఇంకా స్థానికులు కూడా చనిపోయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. అయితే గాల్లోకి ఎగిరిన ఆర్మీ విమానం.. ఎందుకు కూలిపోయింది అనేది ఇంకా అంతుచిక్కడం లేదు. సూడాన్‌లో ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్మీ విమానం కూలిపోయింది. వైమానిక స్థావరం నుంచి బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కాసేపటికే కూలిపోవడం గమనార్హం. ఇక ఈ ఘోర విమాన ప్రమాదంలో ఆ విమానంలో ప్రయాణిస్తున్న 46 మంది జవాన్లు మృతి చెందారు. అంతేకాకుండా ఆ విమానం ఇళ్ల మధ్యలో కుప్పకూలిపోవడంతో స్థానిక ప్రజలు కూడా ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 10 మందికిపైగా గాయాలపాలైనట్లు సూడాన్ అధికారులు వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతుండగా.. మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నట్లు తెలిపారు.



మంగళవారం సూడాన్‌లోని వాడి సయిద్నా వైమానిక స్థావరం నుంచి ఓ ఆర్మీ విమానం టేకాఫ్ అయింది. అయితే కొద్దిసేపటి తర్వాత ఆ విమానం రాడార్ నుంచి సిగ్నల్స్ కట్ అయిపోయాయి. ఈ క్రమంలోనే ప్రజలు నివసించే ప్రాంతాల్లో కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలో వెళు తున్న 46 మంది సైనికులు ప్రాణాలు విడిచారు. అంతేకాకుండా విమానం కూలిపోవడంతో అక్కడ ఉన్న స్థానికులు కూడా కొందరు మరణించారు. ఇక ఈ ఘటనలో 10 మందికి పైగా గాయపడినట్లు సూడాన్ అధికారులు బుధవారం వెల్లడించారు. అయితే ఈ ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటికి తీస్తున్నట్లు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సైనిక విమానం ఎలా కూలిపోయింది.. అసలు ఈ ప్రమాదానికి గల కారణాలు ఏంటి అనేది మాత్రం ఇంకా తెలియరాలేదు. మరోవైపు.. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

ఇక సూడాన్‌లో గత కొంత కాలంగా అంతర్యుద్ధం కొనసాగుతోంది. సూడాన్‌పై పట్టు సాధించడం కోసం సూడాన్ సైన్యం, పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం ఇటీవలి కాలంలో మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలోనే న్యాలా ప్రాంతంలో ఇటీవల ఒక సైనిక విమానాన్ని కూల్చివేసినట్లు డార్ఫర్ పశ్చిమ ప్రాంతాన్ని పాలిస్తున్న ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్‌-ఆర్ఎస్ఎఫ్ ప్రకటించింది. అయితే ప్రస్తుతం జరిగిన విమాన ప్రమాదానికి.. సూడాన్ అంతర్యుద్ధానికి ఏదైనా సంబంధం ఉందా అని సూడాన్ అధికారులు విచారణ జరుపుతున్నారు. గతంలో లాగే ఈ సైనిక విమానాన్ని కూడా ఆర్ఎస్ఎఫ్ కూల్చివేసిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



# ప్రభుత్వ చాట్ టూల్‌లో గలీజు పనులు.. 100 మందికిపై నిఘా అధికారులపై వేటు!

కీలక ప్రభుత్వ సమాచార మార్పిడి కోసం నిర్దేశించిన టూల్‌ను కొందరు నిఘా అధికారులు అశ్లీల మేసేజ్‌లు చాటింగ్ కోసం వేదికగా మార్చుకున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఓ సామాజిక హక్కుల కార్యకర్త ఈ భాగోతాన్ని బయటపెట్టారు. దీంతో ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. వెంటనే అటువంటి అధికారులు గుర్తించాలని ఆదేశాలు జారీచేసిన ఎన్ఎస్ఏ డైరెక్టర్.. చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం అగ్రరాజ్యం అమెరికాలో సంచలనంగా మారిన ఈ వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించారు.

అతి ముఖ్యమైన సమాచార మార్పిడి కోసం నిర్దేశించిన చాట్ టూల్‌ను అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుకునే వేదికగా మార్చుకున్నారనే ఆరోపణలపై 100 మందికిపై ఇంటెలిజెన్స్ అదికారులపై వేటు వేసేందుకు అమెరికా నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ సిద్ధమయ్యారు. అతి సున్నితమైన అంశాలను చర్చించేందుకు వినియోగించే ప్రభుత్వ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన చాట్ టూల్‌లో కొందరు అధికారులు అసభ్యకరమైన సందేశాలను పంపుకుంటున్నట్టు అధికారులు ఇటీవల గుర్తించారు. ఇటువంటి అధికారులపై చర్యలు తీసుకుంటున్నట్లు ఫ్యాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తులసీ గబ్బార్డ్ వెల్లడించారు.

'చాట్‌టూల్‌లో అభ్యంతరకరమైన మేసేజ్‌లు పంపిన 15 ఏజెన్సీలకు చెందిన 100 మందికి పైగా అధికారులపై చర్యలు తీసుకుంటున్నాం.. వారి భద్రతా క్లియరెన్స్‌ను సైతం తొలగించాలని ఆదేశించాం.. ఇది భద్రతా విభాగం నమ్మకాన్ని, వృత్తిపరమైన నియమాలను ఉల్లంఘించడమే.. ట్రంప్ యంత్రాంగంలో ఇది ఆరంభం మాత్రమే.. క్షేత్రస్థాయిలో అవినీతిని నిర్మూలించి వ్యవస్థను శుభ్రం చేస్తాం.. తిరిగి నమ్మకాన్ని తీసుకొస్తాం' అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ అసభ్యకరమైన చాటింగ్‌లో పాల్గొన్న అధికారులను శుక్రవారంలోగా గుర్తించాలని తులసీ గబ్బార్డ్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని ఎన్ఎస్ఏ కార్యాలయ ప్రతినిధి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. అటు, ప్రభుత్వ చాట్ టూల్‌ను కొందరు అధికారులు దుర్వినియోగం చేయడాన్ని సహించేది లేదని ఎన్ఎస్ఏ స్పష్టం చేసింది. వారిని విధుల నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్ఎస్ఏ, డీఎన్ఐలు ఎక్స్‌లో పేర్కొన్నాయి. కాగా, చాట్ టూల్‌లో అసభ్యకరమైన మేసేజ్‌లు పంపుతున్న విషయాన్ని తొలుత హక్కుల కార్యకర్త క్రిస్టోఫర్ రూఫో గుర్తించారు. ట్రాన్స్ జెండర్‌లకు చెందిన మెసేజ్‌లు ప్రభుత్వ చాట్‌టూల్ ఇంటర్‌లింక్‌లో కనిపించినట్లు 'సిటీ జర్నల్'లో రూఫో పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో తులసీ గబ్బార్డ్ స్పందంచారు.

> ట్రంప్ యంత్రాంగంలో ఇది ఆరంభం మాత్రమే.. క్షేత్రస్థాయిలో అవినీతిని నిర్మూలించి వ్యవస్థను శుభ్రం చేస్తాం.. తిరిగి నమ్మకాన్ని తీసుకొస్తాం' అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ అసభ్యకరమైన చాటింగ్‌లో పాల్గొన్న అధికారులను శుక్రవారంలోగా గుర్తించాలని తులసీ గబ్బార్డ్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని ఎన్ఎస్ఏ కార్యాలయ ప్రతినిధి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. అటు, ప్రభుత్వ చాట్ టూల్‌ను కొందరు అధికారులు దుర్వినియోగం చేయడాన్ని సహించేది లేదని ఎన్ఎస్ఏ స్పష్టం చేసింది.

మరోవైపు, బైడెన్ హయాంలో సీఏఐ, ఎన్ఎస్ఏలోని వైవిధ్య కార్యక్రమాల్లో పనిచేసిన ఉద్యోగులను తొలగిస్తూ జారీచేసిన ఉత్తర్వులను ఫెడరల్ జడ్జ్ తాత్కాలికంగా నిలిపివేశారు. దీనిపై గురువారం తీర్పు వెలువడే అవకాశం ఉంది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలువురు ఉద్యోగులను వేర్వేరు కోర్టుల్లో వ్యాజ్యాలు దాఖలు చేశారు.

# నిర్భయ తరహా ఘటన.. బస్సులో మహిళపై అత్యాచారం..

ఆర్టీసీ బస్సులోనే మహిళపై అత్యాచారానికి ఓ దుండగుడు తెగబడ్డాడు. అది కూడా పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ దారుణం చోటు చేసుకోవడం గమనార్హం. ఢిల్లీలో నిర్భయ తరహాలోనే బస్సులో మహిళపై అత్యాచారం చేసిన ఘటన.. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం.. నిందితుడికి ఉరిశిక్షే సరైందని పేర్కొన్నారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని సీఎం తెలిపారు. ఇక ఈ ఘటనతో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

మహారాష్ట్రలోని పూణే నగరంలో ఘోరం చోటు చేసుకుంది. పోలీస్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలోనే ఆగి ఉన్న ఆర్టీసీ బస్సులో ఓ మహిళపై అత్యాచారం జరిగింది. ఈ ఘటన మహారాష్ట్రలో సంచలనంగా మారింది. రద్దీగా ఉండే బస్టాండ్ పక్కనే ఈ దారుణం చోటు చేసుకోవడంతో ప్రభుత్వం తీరుపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. మహారాష్ట్రలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ మండిపడుతున్నాయి. దీంతో ఈ అత్యాచార ఘటన కాస్తా రాజకీయ రంగు పులుముకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. త్వరలోనే ఆ నిందితుడిని పట్టుకుంటామని మహారాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది.

పూణేలోని నిత్యం రద్దీగా ఉండే స్వర్‌గేట్ బస్టాండ్‌లో ఈ ఘటన జరిగింది. సతారా జిల్లాలోని ఫల్తానా ప్రాంతానికి చెందిన ఓ మహిళ.. పూణేలోని ఇళ్లలో పని చేసుకుని జీవనం సాగిస్తూ ఉంటుంది. ఈ క్రమంలోనే మంగళవారం తెల్లవారుజామున ఆమె స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలో ఉన్న స్వర్‌గేట్ బస్టాండ్‌లో బస్సు కోసం వేచిచూస్తోంది. ఈ క్రమంలోనే ఆమెను గమనించిన ఓ వ్యక్తి.. అక్కడికి వచ్చి.. బస్సు ముందు ఉందంటూ తీసుకెళ్లాడు. అక్కడ అంతా చీకటిగా ఉండగా.. బస్సులో ప్రయాణికులు నిద్రపోతున్నారని.. అందుకే లైట్లు ఆన్ చేయలేదని మహిళను నమ్మించాడు. దీంతో అది నమ్మిన ఆ మహిళ బస్సు ఎక్కగానే.. వెంటనే లోపలికి చేరుకున్న ఆ వ్యక్తి డోర్ వేసి.. ఆ మహిళపై అత్యాచారానికి ఒడిగట్టాడు.

ఆ దారుణం తర్వాత.. బయటికి వచ్చి మరో బస్సు ఎక్కిన ఆ మహిళ.. తనపై జరిగిన అత్యాచార ఘటన గురించి తన స్నేహితురాలికి చెప్పింది. దీంతో ఆ విషయం కాస్తా వెలుగులోకి వచ్చింది. అనంతరం బాధితురాలు పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అక్కడ ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. వాటి ఆధారంగా నిందితుడు 36 ఏళ్ల దత్తాత్రేయ రాందాస్‌గా గుర్తించారు. గతంలో దత్తాత్రేయ రాందాస్ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. దీంతో అతడిని పట్టుకునేందుకు 8 స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు.



ఇక ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందించారు. ఒక ఆడబిడ్డకు ఇలా జరగడం దురదృష్టకరమని.. పేర్కొన్నారు. నేరస్థుడికి ఉరి శిక్ష వేయడమే సరైందని పేర్కొన్నారు. ఆ వ్యవహారాన్ని స్వయంగా పరిశీలించి దర్యాప్తు చేయాలని.. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని పూణే పోలీస్ కమిషనర్‌కు అజిత్ పవార్ ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు.. ఈ ఘటనపై స్పందించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దీన్ని తీవ్రంగా పరిగణించి పోలీసులను ఆదేశించారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని ట్వీట్ చేశారు. ఇక ఈ ఘటనపై మహారాష్ట్రలోని ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. పూణేలో శాంతి భద్రతలు క్షీణించాయని.. రోజురోజుకూ నేరాలు పెరిగిపోతున్నాయని మండిపడ్డాయి. మహారాష్ట్ర ప్రజలకు రక్షణ కల్పించడంలో దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం విఫలమైందంటూ ఆరోపించాయి. ప్రమాదం జరిగిన బస్టాప్ వద్ద శివసేన (యూబీటీ) నేతలు నిరసనలు వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఇలాంటి దారుణం జరిగిందని.. చట్టం పట్ల కొందరికి భయం లేకుండా పోయిందని పేర్కొన్నాయి. మహిళకు అన్యాయం జరుగుతుంటే పట్టించుకోలేదని.. పూణేలో నేరాలను అరికట్టడంలో హోంశాఖ విఫలమైందని ఎన్సీపీ (ఎస్పీ) ఆరోపించింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
28 ఫిబ్రవరి 2025

# సంగారెడ్డి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

## జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 27( జనం సాక్షి )**





మెదక్, కరీంనగర్ ,నిజామా బాద్, ఆదిలాబాద్, గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలవరకు ప్రశాంతంగా జరిగాయని కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి తార డిగ్రీ కళాశాల,జోగిపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా బిఎల్వోల ద్వారా ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్పులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వికలాంగులకు పోలింగ్ కేంద్రాల్లో కి వెళ్లేందుకు వీలుగా అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంప్ లు ఏర్పాటు చేయడంతో పాటు వీల్ చైర్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 40 పోలింగ్ కేంద్రాలు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మొత్తం 600 మంది ఎన్నికల సిబ్బందితో పోలింగ్ ప్రారంభమైనట్లు కలెక్టర్ తెలిపారు ఈ ఎన్నికల్లో 2690 మంది ఓటర్లు టీచర్స్ ఎమ్మెల్సీ కోసం 25652 మంది ఓటర్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం జిల్లాలోని సంగారెడ్డి లో 1621 మంది ఓటర్ లకు గాను 1313 81 శాతం, అందోల్ 185 కు గాను 169,శాతం, 91.35, నారాయణ్ ఖేడ్ 375 కు గాను 347 92.53 శాతం, జహీరాబాద్ 509 కి గాను 476, 93.52 శాతం నమోదు కాగా జిల్లా వ్యాప్తంగా 26 90 మందికి గాను 23 0 5 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 85.69 శాతం నమోదు అయినట్టు తెలిపారు.

# కాటారంలో భారీ బందోబస్తు

**కాటారం, ఫిబ్రవరి 27( జనం సాక్షి ):**



మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల స్థానంతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్ లో భారీ ఎత్తున ఓటర్లు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగిన పోలింగ్ ప్రక్రియలో ఉదయం కొంత మందకోడిగా కొనసాగినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత పోలింగ్ ఉపందుకొన్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, మహాదేవపూర్, పలిమల, మహ ముత్తారం, మలహర్ మండలాల్లో పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కాటారం సిఐ నాగార్జున రావు, ఎస్ ఐ అభినవ్ నిరంతరం గస్తీ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు ఆయా రాజకీయ పార్టీ నేతలు, కార్యకర్తలను పోలింగ్ కేంద్రం పరిసరాల్లోకి రాకుండా గట్టి చర్యలు చేపట్టారు. కాటారం 498 పోలింగ్ స్టేషన్ లో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానానికి 877 మంది ఓటర్లు ఉండగా 656 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.80 శాతం ఓట్లు నమోదైనట్లు తెలిపారు. ఇందులో పురుషులు 442, మహిళలు 214 మంది ఉన్నట్లు తహసిల్దార్ నాగరాజు తెలిపారు. అలాగే 273 పోలింగ్ కేంద్రం టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో 40 మందికి గాను 36 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 25, మహిళలు 11 మంది 90 శాతం తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు సెక్టోరల్ అధికారి రాజశేఖర్ తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు వెల్లడించారు.

# మొదలైన ఎండాకాలం గోస

## సింగరేణిలో పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి



**రామకృష్ణపూర్, (ఫిబ్రవరి 27(జనంసాక్షి):**

వేసవికాలం మొదట్లోనే ఎండలు దంచి కొడుతున్నాయి. అటు వాతావరణ శాఖ అధికారులు ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని ప్రజలని హెచ్చరిస్తున్నారు. ఇటువంటి సమయంలో కోల్ బెల్ట్ ప్రాంతంలో పని చేస్తున్న కార్మికుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితి. సింగరేణిలో పర్మినెంట్ గా పని చేస్తున్న కార్మికులకు యాజమాన్యం కొంతవరకు ఎండాకాలం నుండి ఉపశమనం పొందే విధంగా వెసులుబాటు సౌకర్యాలు కల్పిస్తుంది. కానీ మందమర్రి ఏరియాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికుల వ్యధ దారుణంగా కనిపిస్తుంది. ఈ మేరకు మందమర్రి ఏరియా సిఐటియు యూనియన్ నాయకులు కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికులకు వేసవి తాపం నుండి ఉపశమనం పొందడానికి సౌకర్యాలు కల్పించాలని సివిల్ ఎస్ఈ రాములకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్షులు సాంబార్ వెంకటస్వామి మాట్లాడుతూ ఉపరితల గనిలో కార్మికులకు ఇచ్చిన విధంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయడంతో పాటు, ఫిల్టర్ బెడ్ లో పనిచేస్తున్న కార్మికులకు టార్చ్ లైట్లను అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా ఏరియాలో పనిచేయు నటువంటి మినరల్ వాటర్ ప్లాంట్లను రిపేర్ చేయవలసిందిగా సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సివిల్ ఫిట్ సెక్రెటరీ అగిడి రాజ్ కుమార్, ప్రవీణ్, రాజశేఖర్ లు ఉన్నారు.

# నలుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

## విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవు

## నిర్మల్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఖానాపూర్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి)**



ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైతే ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. గురువారం నియోజకవర్గం లోని ఇంద్రవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు శ్రీకాంతోపాటు సిహెచ్ఓ సందీప్, పీహెచ్ఎన్ జ్యోతి, సూపర్వైజర్ సురేష్, ఎం ఎల్ హెచ్ పి పూజలు ఎలాంటి సమాచారం లేకుండా విధులకు కాలేదు. జిల్లా కలెక్టర్ తనఖీ సమయంలో ఈ విషయం కలెక్టర్ దృష్టికి రావడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఎలాంటి అనుమతి లేకుండా వీధులకు హాజరుకాని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అదనపు డీఎం అండ్ హెచ్ ఓ మనోహర్ కు ఫోన్ ద్వారా ఆదేశించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆసుపత్రిలోని స్టోర్ రూమ్, ప్రసవాల గది, ఈసీజి లను సందర్శించిన కలెక్టర్ రోగులకు అందిస్తున్న మందులను, ఇంజక్షన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ఆసుపత్రి రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందించాలే తప్ప ఎలాంటి అనుమతులు పొందకుండా విధులకు హాజరు కాకపోవడం క్రమశిక్షణ రాహిత్యమే అని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డాక్టర్ పూజిత, తదితరులు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ జరగాలి : ఎంపి ఈటల

**హైదరాబాద్ (జనంసాక్షి)**



ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ జరగాలని దీనికి హైదరాబాద్ పెద్దన్న పాత్ర పోషించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం హైదరాబాద్ లో జరిగిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణకు ఎంపీలు అందరం మద్దతుగా ఉంటామన్నారు. బీఎస్ఎన్ఎల్ గొప్ప సంస్థగా ఎదగడానికి కావాల్సిన ప్రణాళికలను రూపొందించాలని, టెలికాం విభాగంలో మేమే సుప్రీం అనే భావనకు బీఎస్ఎన్ఎల్ రావాలన్నారు. తాడు బొంగరం లేని సంస్థలు ఎదుగుతున్నప్పుడు, ఇన్ని ఆస్తులు ఉండి, ఇంతమంది మాన్ పవర్ ఉన్నప్పుడు మనం ఎందుకు ఎదగడం లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు బాగుపడాలనేది ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచన అని చెప్పారు. మనం ఎలక్ట్రానిక్ యుగంలో ఉన్నామని, గవర్నమెంట్ పాలసీలు ఎలా ఉన్నా మీ ఇన్నోవేషన్, కమిట్మెంట్, ప్రయత్నం ఉండాలని అది ఉంటే మీకు ప్రభుత్వం తోడుగా ఉంటుందన్నారు. లాభనష్టాల కోసం కాకుండా సర్వీస్ ఓరియెంటేషన్ తో పనిచేసే సంస్థ బీఎస్ఎన్ఎల్ అన్నారు.

# పోటాపోటీగా పంపకాలు

**బోథ్, ఫిబ్రవరి 27(జనంసాక్షి)** : ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుచర వర్గం పోటాపోటీగా పంపకాలు చేపట్టారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఓటర్లను ఆకర్షించి కాసులు వెదజల్లారు. వ్యక్తిగతంగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో లక్షల్లో ఓటర్లు ఉండటంతో 500 నుండి 1000 వరకు పంచుతుంటారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికలు తక్కువ ఓటర్లు ఉండడం ఆర్థికంగా బలమైన అభ్యర్థులు ఉండటంతో ఒక్కో ఓటర్ కు 2000 నుండి 5000 వరకు పంపిణీ చేశారు. డబ్బు ప్రభావంతో మొదటి లేదా రెండవ ప్రాధాన్య ఓటు దక్కుతుందని ఆశిస్తున్నారు. రెండో ప్రాధాన్య ఓట్లు గెలుపునకు కీలకంగా మారుతాయని ఆశిస్తున్నారు.

# రామప్ప దేవాలయంలో మెరుగైన వైద్య సేవలు

**ములుగు/వెంకటాపూర్,ఫిబ్రవరి27(జనం సాక్షి):**



మహాశివరాత్రి సందర్భంగా రామప్ప లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం ను 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు నాలుగు రోజులు మహా శివరాత్రి రామప్ప కి వచ్చే భక్తుల కొరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని వెంకటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్.శ్రీకాంత్ తెలిపారు.ఈ శిబిరం 24 గంటలు నిర్వహించే విధంగా, నిర్దిష్టమైన ప్రణాళికలను తయారు చేసుకుని ఉదయము, సాయంత్రము వేళల్లో పనిచేసే టట్లు,షిఫ్టు ఏర్పాటుచేసి,రామప్ప కు వచ్చే భక్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని, గురువారం రోజున 785 మందికి వైద్య సేవలు అందించామని తెలిపారు .గురువారం రోజున మహిళ భక్తురాలు కళ్ళు తిరిగి పడితే వెంటనే భక్తురాలకి వైద్య సేవలు అందించామని,ఎండ ఎక్కువగా ఉంటుందందున భక్తులు మంచినీరును మరియు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని డాక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్స్ శ్రీకాంత్,డాక్టర్ చందన,హెల్త్ సూపర్వైజర్ పుష్ప కుమారి, ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అతివేగంతో మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టిన కారు

**హైదరాబాద్ (జనంసాక్షి)**

అతివేగంతో మెట్రో పిల్లర్‌ను ఢీ కొట్టిన కారు నుజ్జునుజ్జైంది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురి వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటాన్ చెరు ప్రాంత షిఫ్ట్ కారు (టీ ఎస్ 15 ఎఫ్ ఎఫ్ 7542) బుధవారం అర్ధరాత్రి సమయంలో కూకట్‌పల్లి నుంచి పటాన్ చెరు వైపుకు వెళుతుండగా అతి వేగంతో జాతీయ రహదారిపై కేపీహెచ్‌బీ కాలనీలో 750వ నంబర్ పిల్లర్‌ను షిఫ్ట్ కారు ఢీకొట్టింది. కారు నుజ్జు నుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారు ప్రస్తుతం ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. కాగా ఈ ప్రమాదంలో షిఫ్ట్ కారును వెనకాల వచ్చిన క్రెటా కారు ఢీకొట్టగా అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలయ్యాయి. దీనిపై బాధితుల నుంచి ఎటువంటి పిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# విద్యార్థులకు వేడిగా వండిన ఆహారాన్ని అందించాలి

## ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పిఓ చిత్రా మిశ్రా

**ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 27(జనంసాక్షి) :**



ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటీడీఏ ఏటూరునాగారం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ట్రైబల్ వెల్ఫేర్, ఆయన బృందంతో కలిసి ములుగు మండలం జగ్గన్నపేటలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికలు సందర్శించి అవసరమైన మరమ్మతు పనులను పరిశీలించారు. కిచెన్, డైనింగ్ ఏరియాను పరిశీలించి, రెండు ప్రాంతాలలో ఫ్లోరింగ్ మరమ్మతు పనులు చేపట్టాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఆవరణను శుభ్రంగా ఉంచాలని హెడ్ మాస్టర్, వార్డెన్‌లను ఆదేశించారు. ప్రతిసారీ విద్యార్థులకు వేడిగా వండిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. టాయిలెట్ బ్లాకులను పరిశీలించి, పని నాణ్యత, పెయింటింగ్‌తో అదనపు టాయిలెట్ బ్లాక్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. డార్మిటరీ భవనాన్ని పరిశీలించి, కిటికీలకు మెష్‌ను అమర్చాలని, తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్‌ల మరమ్మత్తులు, పెయింటింగ్‌లో ఏవైనా ఉంటే వాటిని పరిష్కరించాలని ఇంజనీర్లను ఆదేశించారు. జీసీసీ ఆహార పదార్థాల సరఫరా, ఆహార పదార్థాల సరైన నిల్వ, స్టాక్ రిజిస్టర్ నిర్వహణ, అనుసరించిన రోజువారీ మెనూ మొదలైన వాటిపై హెడ్ మాస్టర్, వార్డెన్‌తో విచారించారు. ఈ తనిఖీ సమయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ట్రైబల్ వెల్ఫేర్ డి వీరభద్రం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రశాంత్, అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మణ్, టెక్నికల్ ఆఫీసర్ సురేష్, సంబంధిత హెడ్ మాస్టర్, వార్డెన్ తదితర సిబ్బంది ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంట ఉన్నారు.

# సరోత్తమ్ రెడ్డికి ఓటు వేసిన వారికి కృతజ్ఞతలు

## భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల



**పాలకుర్తి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి)**

భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్ రెడ్డి గెలుపు కోసం మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు, ఆయన గెలుపు కోసం కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు అని బారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి అన్నారు ,ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా భాజపా మండల అధ్యక్షుడు మారం రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ - వరంగల్- ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కడ అడిగిన ఉపాధ్యాయులు సరోత్తమ రెడ్డికి ఓటు వేశారు అని, భారతీయ జనతా పార్టీ గెలుపు తథ్యమని అన్నారు, రానున్న రోజుల్లో కూడా భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో కూడా అధికారం లోకి రావడం తథ్యం అని అన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సౌడా రమేష్ ,జిల్లా ఉపాధ్యక్షులు దొంగరి మహేందర్,ఎమ్మెల్సీ నియోజకవర్గ ప్రభారి శివరాజ్ యాదవ్,నియోజకవర్గ కన్వీనర్ పుసాల శ్రీమాన్,జిల్లా జిల్లా నాయకులు కమ్మగని శ్రీకాంత్, కడుదుల నిరంజన్ రెడ్డి, దుంపల సంపత్,మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవరాజు, పెనుగొండ సోమేశ్వర్, పబ్బ సంతోష్, రాజు, పూజారి మహేష్, బెల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు,

# ఎక్కడ సమస్యలు తలెత్తినా పరిష్కరించేందుకు కృషి చేస్తా

**చంపాపేట, ఫిబ్రవరి 27 : జనంసాక్షి)**



నియోజవర్గం పరిధి లో ఎక్కడ సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్ డిఫెన్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. తమ కాలనీలో నిధుల లేమితో నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ పునఃనిర్మించేలా చూడాలని కోరారు. అదే విధంగా కాలనీలో నెలకొన్న తాగునీటి లోప్రెషర్ సమస్య, విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు డిఫెన్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందించి నియోజకవర్గం పరిధిలో ఎక్కడ సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే వాటిని తప్పకుండా

పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కాలనీవాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి ఐలపాక ఉమామహేశ్వర్, బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, మాజీ డివిజన్ ప్రెసిడెంట్ చీర శ్రీనివాస్, సీనియర్ నాయకులు మేక సురేందర్‌రెడ్డి, సదానందరెడ్డి ముద్ద కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తుండగా మొబైల్ స్నాచింగ్

**హైదరాబాద్ (జనంసాక్షి)**

రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి మొబైల్ లాక్కుని వెళ్లిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనాసరుల్ రహ్మాన్(45) అనే వ్యక్తి సయ్యద్‌నగర్‌లో నివాసం ఉంటూ ఫిలింనగర్‌లో మగ్గం వర్క్స్ చేస్తుంటాడు. గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో పని ముగించుకుని మరో ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్ మీద ఇంటికి వెళ్తున్నాడు. సయ్యద్‌నగర్‌లోని అబ్దుల్లా బేకరీ వద్దకు రాగానే రెండు బైకుల మీద నలుగురు వ్యక్తులు వారికి ఎదురుగా వచ్చారు. ఓ బైక్ మీద వెనకాల కూర్చున్న గుర్తుతెలియని వ్యక్తి రహ్మాన్ చేతిలో ఉన్న రియల్ మీ ఫోన్‌ను లాక్కుని పారిపోయారు. ఈ మేరకు బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బీఎన్ఎస్ 304(2) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# దివ్యాంగుడ్ని దారుణంగా కర్రలతో కొట్టిన పోలీసులు

**పాట్నా: (జనంసాక్షి)**

దివ్యాంగుడైన వ్యక్తిని పోలీసులు కర్రలతో దారుణంగా కొట్టారు. అతడిపై అకారణంగా దాడి చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేశారు. హోంగార్డులను విధుల నుంచి తొలగించారు. బీహార్‌లోని కతిహార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సమేలిలోని చోహార్ గ్రామంలో మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి రోడ్డుపై కూర్చొన్నాడు. అక్కడ పార్క్ చేసిన పోలీస్ వాహనానికి అతడు ఆనుకున్నాడు. కాగా, ఇది చూసి పోలీసులు ఆగ్రహించారు. జనం చూస్తుండగా దివ్యాంగుడైన ఆ వ్యక్తిపై అకారణంగా దాడి చేశారు. కర్రలతో కాళ్లు, చేతులపై దారుణంగా కొట్టారు. ఆ వ్యక్తిని అక్కడి నుంచి పక్కకు ఈడ్చుకెళ్లారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి.
మరోవైపు ఈ సంఘటనపై కతిహార్ ఎస్పీ స్పందించారు. పోథియా పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ కేదార్ ప్రసాద్ యాదవ్, కానిస్టేబుల్ ప్రీతి కుమారిని సస్పెండ్ చేశారు. హోంగార్డులు సికందర్ రాయ్, కిషోర్ మహతోను ఏడాది పాటు విధుల నుంచి తొలగించారు. దివ్యాంగుడ్ని దారుణంగా కొట్టిన డ్రైవర్ బంబం కుమార్‌పై కేసు నమోదు చేశారు.

# డాక్టర్ సుమంత్ రెడ్డిపై హత్యాయత్నం

**కేసులో ముగ్గురు అరెస్ట్**

**నిందితుల్లో సుమంత్ రెడ్డి భార్య ఫ్లోరా, జిమ్ సెంటర్ ట్రైనర్ శామ్యూల్, ఏఆర్ కానిస్టేబుల్ రాజ్ కుమార్**

**వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్**



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 27 (జనంసాక్షి)**

: అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడుతో కలిసి భర్తను చంపాలని పథకం వేసిన భార్య వారికి సహకరించిన ప్రియుడి స్నేహితుడు రాజ్ కుమార్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ లను మిల్స్ కాలనీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల డాక్టర్ సుమంత్ రెడ్డి తన క్లినిక్ కాజీపేటలో డ్యూటీ ముగించుకొని తన ఇంటికి వెళ్తున్న క్రమంలో బట్టుపల్లి శివారులో ఎస్ ఆర్ స్కూల్ దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి చంపడానికి ప్రయత్నించినారని తన తండ్రి ఫిర్యాదు మేరకు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో హత్యయత్నం కేసు నమోదు చేసి, సీరియస్ గా తీసుకోని అన్ని కోణాలలో దర్యాప్తు ముమ్మరం చేసి ఇట్టి కేసులోని నిందితులను అరెస్ట్ చేశామని ఎసిపి తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. వరంగల్ హంటర్ రోడ్‌కు చెందిన డాక్టర్ సుమంత్‌రెడ్డి, షిరిడిసాయి నగర్‌కు చెందిన ఫ్లోరా మరియాలకు 2016 సంవత్సరంలో ప్రేమ వివాహం జరిగింది. 2018 సంవత్సరంలో సంగారెడ్డి లో సుమంత్ రెడ్డి బంధువుల విద్యాసంస్థలు ఉండగా వాటిని చూసుకోవడం కోసం అతని భార్య ఫ్లోరా మరియా, డాక్టర్ సుమంత్ రెడ్డి సంగారెడ్డికి షిఫ్ట్ అయ్యారు. అక్కడ డాక్టర్ సుమంత్ రెడ్డి, సంగారెడ్డి పీహెచ్సీలో కాంట్రాక్టు పద్ధతిన మెడికల్ ఆఫీసర్ గా పనిచేస్తుండగా, తన భార్య ఫ్లోరా మరియా స్కూల్లో టీచర్ గా పనిచేస్తుండేది. బరువు తగ్గడానికి ఆమె సంగారెడ్డి లోని సిద్దు జిమ్ సెంటర్ కి వెళు ఒడేది అట్టి జిమ్ సెంటర్లో కోచ్ పని చేస్తున్న, ఏర్రోల్ల శామ్యూల్ ఆదర్శ కాలనీ, కొండాపూర్, సంగారెడ్డి అనే అతను పరిచయమై వారిద్దరి మధ్య అక్రమ సంబంధంనకు దారితీసింది. ఈ విషయం డాక్టర్ సుమంత్ రెడ్డికి తెలవగా భార్యా భర్తలకు గొడవలు జరిగినవి. ఇట్టి గొడవల వలన డాక్టర్ సుమంత్ రెడ్డి అక్కడి నుండి తన ఫ్యామిలీని వరంగల్ కి షిఫ్ట్ చేసినారు. తరువాత 2019 సంవత్సరంలో సదరు ఫ్లోరా మరియా ప్రభుత్వ లెక్చరర్ ఉద్యోగం పొంది జనగాం జిల్లాలోని పెంబర్తి సోషల్ వెల్ఫేర్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం చేసుకుంటూ అక్కడ వుండేవారు. తర్వాత అట్టి కాలేజ్ వరంగల్ లోని రంగశాయిపేట్ మారడం తో డాక్టర్ సుమంత్ రెడ్డి వరంగల్ లోని వాసవి కాలనీలో ఉంటూ కాజీపేటలో ప్రైవేట్ హాస్పిటల్ నడుపుకుంటూ ఉదయం వెళ్లి రాత్రి తన ఇంటికి వస్తుండేవాడు. సదరు ఫ్లోరా మరియా మాత్రం సంగారెడ్డిలో పరిచయమై వివాహేతర సంబంధం పెట్టుకున్న శామ్యూల్ తో తరచుగా ఫోన్లు మాట్లాడడం వీడియో కాల్స్ మాట్లాడడం డాక్టర్ సుమంత్ రెడ్డి లేని సమయంలో సదరు శామ్యూల్ నీ ఇంటికి పిలిపించుకొని అతనితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ ఉండగా అది తెలుసుకున్న డాక్టర్ సుమంత్ రెడ్డి ఆమెను మందలించేవారు అట్టి విషయం లో వారిద్దరికీ తరుచుగా గొడవలు జరుగుతుండేవి. దానితో సదరు ఫ్లోరా మరియా మరియు శామ్యూల్ లు డాక్టర్ సుమంత్ రెడ్డిని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నారు. తరువాత శామ్యూల్ ఇట్టి విషయాన్ని తన స్నేహితుడైన రాజ్ కుమార్ అనే ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్కి ఇట్టి విషయం చెప్పి నీవు డాక్టర్ సుమంత్ రెడ్డి హత్య కి సహకరిస్తే నీకు సంగారెడ్డిలో ఇంటిని నిర్మించి ఇస్తానని చెప్పగా దానికి సదరు హెడ్ కానిస్టేబుల్ రాజ్ కుమార్ ఒప్పుకొన్నాడు. తరువాత అందాదా 15 రోజుల క్రితం ఒక్క లక్ష రూపాయలు ఫ్లోరా మరియా, శామ్యూల్ కి ట్రాన్స్ఫర్ చెయ్యగా అందులో నుండి ఖర్చులకు 50 వేల రూపాయలు శామ్యూల్ తీసుకోని, మిగిలిన 50 వేల రూపాయలు శామ్యూల్, హెడ్ కానిస్టేబుల్, రాజ్ కుమార్ కి ఇచ్చినాడు. ఈనెల 22 న మధ్యాహ్నం సంగారెడ్డిలో ఒక సుత్తిని కొనుగోలు చేసి రాజకుమార్ యొక్క రాయల్ ఎన్ ఫీల్డ్ మోటార్ సైకిల్ పై బయలుదేరి కాజీపేటకు వచ్చి ముందుగా వారు అనుకున్న ప్రకారం డాక్టర్ సుమంత్ రెడ్డిని సీసీ కెమెరాలు మరియు జనసంచారం లేని చీకటి ప్రదేశాన్ని ఎంచుకొని, రెక్కీ చేసుకుని వాళ్లు అనుకున్న పథకం ప్రకారం డాక్టర్ సుమంత్ రెడ్డి రాత్రి తన క్లినిక్ ముగించుకొని కారులో బట్టుపల్లి రోడ్డు నుండి రంగాశాయపేట వెళ్తున్న క్రమంలో తన వెనుక ఫాలో అయ్యి బట్టుపల్లి శివారులో ఎస్సార్ స్కూల్ దాటిన తరువాత ఉన్న చిన్న బ్రిడ్జి వద్ద డాక్టర్ తన కారు వేగాన్ని తగ్గించగా అట్టి చీకటి ప్రదేశంలో అదే అదునుగా భావించిన శామ్యూల్ తన తో తెచుకున్న సుత్తితో కారు వెనుక ఇండికేటర్ ను కొట్టగా అట్టి శబ్దానికి డాక్టర్ సుమంత్ రెడ్డి తన కారును పక్కకు ఆపి ఇండికేటర్ వద్దకు వచ్చి చూస్తుండగా శామ్యూల్ మరియు రాజకుమార్ లు సదరు డాక్టర్ సుమంత్ రెడ్డి ని విచక్షణారహితంగా కొట్టి, గాయపర్చి, అతడు చనిపోయాడు అని భావించి అక్కడి నుండి వారు పారిపోయినారు. తరువాత ఇట్టి కేసును వరంగల్ ఏసీబీ నంది రామ్ ఆధ్వర్యంలో మిల్స్ కాలనీ సిఐ వెంకట్రత్నం, టాస్క్ ఫోర్స్ సీఐ రంజిత్ కుమార్, మిల్స్ కాలనీ ఎస్సై సురేష్, కానిస్టేబుల్ లు బావ్ సింగ్, చంద్రశేఖర్, వెంకన్న, రాజు, జెలెందర్, కానిస్టేబుల్ ఎండి గౌస్, టెక్నికల్ గా సహకరించిన ఏ ఏ ఓ సల్మాన్, ఐటీ కోర్ టీం కానిస్టేబుల్ నగేష్ నిందితుల కోసం ప్రత్యక బృందాలుగా ఏర్పడి ఇట్టి కేసులోని నిందితులైన ఏ 1. ఏర్రోల్ల శ్యామ్యూల్ కొండాపూర్, సంగారెడ్డి, ఏ 2. గాదే ఫ్లోరా మరియా షిరిడి సాయి నగర్, వరంగల్ మరియు మంచుకురి రాజ్ కుమార్ ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ రైతు బజార్ ఎదురుగా, సంగారెడ్డి లను వార్లని పట్టుకొని గురువారం రిమాండ్ కు తరలించడం జరుగుతున్నది. ఇట్టి కేసులో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభకనభరిచిన పోలీస్ అధికారులను వరంగల్ ఏసీబీ నందిరామ్ అభినందించారు.

# రైస్ మిల్లర్లపై బర్డ్ ఫ్లూ ప్రభావం

**ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 27(జనంసాక్షి)**





**నష్టాల బాటలో పౌల్ట్రీ ఫార్మ్స్, రైస్ మిల్లర్లు**

**తౌడు, నూకలు, పరంకు తగ్గిన డిమాండ్**

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలను వన్నిస్తున్న బర్డ్ ఫ్లూ వ్యాధితో అటు పౌల్ట్రీ రంగం తీవ్ర నష్టాల పాలవుతుంది. పౌల్ట్రీ రంగంతో రైస్ మిల్లర్ల కు అవినాభా సంబంధం ఉండడంతో బర్డ్ ఫ్లూ కారణంగా మిల్లర్లపై భారం పడి రైస్ మిల్లర్లు కూడా నష్టాల బాటలో కూరుకు పోతున్నారు. గత 15 రోజుల నుండి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో బర్డ్ ఫ్లూ వ్యాధి విజ్రుమించడంతో పౌల్ట్రీ రంగం కుదేలవుతుంది ఆంధ్రప్రదేశ్ లోనైతే ఏకంగా చికెన్ సెంటర్ లను మూసివేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో చికెన్ అమ్మకాలు నిలిచిపోయాయి. తెలంగాణలో సైతం దాని ప్రభావం ఉండడంతో ఇక్కడ కూడా చికెన్ నమ్మకాలు నిలిచిపోవడంతో పౌల్ట్రీ రంగంలో వినియోగించే తౌడు, నూకలు, పరం వినియోగం వందకు వందశాతం తగ్గిపోయింది. కోళ్ల పరిశ్రమలో కోళ్లకు దానాగా వినియోగించే తౌడు పరం నూకలు కొనుగోలుతో రైస్ మిల్లర్లకు ఆర్థికపరంగా లాభం ఉండేది ఈ క్రమంలో సుమారు కోళ్ల పరిశ్రమలో కోళ్ల అమ్మకాలు నిలిచిపోయి నెలరోజులు కావస్తు న్నాడంతో మిల్లర్లపై పెనుబారం పడింది రైస్ మిల్లర్లు సీఎంఆర్ ధాన్యమును మిల్లింగ్ చేసి బియ్యాన్ని ఎఫ్సీఐకి సివిల్ సప్లై కి అందజేస్తారు మిగిలిన బైప్రొడక్ట్స్ అయినా నూకలు, పరం, తౌడును అమ్ముకొని ఖర్చులు ఎల్లతీసు కుంటారు. ఈ నేపథ్యంలో బర్డ్ ఫ్లూ కారణంగా పౌల్ట్రీ రంగం నిలిచిపోవడం తో దాని ప్రభావం రైస్ మిల్లర్లపై పడింది. దీనితో ములుగు జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్లు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వరంగల్ సీపీ

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :**



వరంగల్ - ఖమ్మం - నల్గొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా గురువారం సందర్శించారు. ఈ రోజు ఉదయం హసన్ పర్తి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలతో పాటు హన్మకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని వరంగల్ సిపి సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించడంతో పాటు పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లు పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతుల ఏర్పాట్ల పై సీపీ ఏసీపీలు, ఇన్స్ స్పెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

# పంటలు ఎండిపోతున్నాయి... సాగునీరు ఇవ్వండి

**అధికారులను కోరిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**పాలకుర్తి/దేవరుప్పుల ఫిబ్రవరి 27 (జనంసాక్షి)**



సాగునీరు లేక, బోర్లు పోయాక, రైతుల పంటలు ఎండిపోతున్నాయని, రైతులు అరి గోసలు పడుతున్నారని, వెంటనే రైతులకు సాగునీరు అందించాలని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కోరారు, గురువారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం లోని పొట్టిగుట్ట తండా గ్రామ రైతుల పంట పొలాలు కాలువలో సాగునీరు రాక, చేతికి వచ్చిన పంట పొలాలు నీళ్లు లేక ఎండిపోయి నెర్రెలు పట్టాయని, చేసేది ఏమి లేక గొర్రెల మేతకు పంటను వదిలేసామని, సాగునీటి కోసం బిక్కు బిక్కు మంటూ ఎదురు చూస్తున్నామంటూ, అటువైపు వెళ్తున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ను కలిసి రైతులు తమ గోడు వెళ్ళబోసుకోగా, వారి సమస్య తెలుసుకొని సంబంధించిన అధికారులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో నీళ్లు వచ్చేలాగా చూడాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ గత పది ఏళ్ల కాలంలో పాలకుర్తి నియోజకవర్గంలో ఎండాకాలం కూడా చెరువులు మత్తడి పడేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు కష్టాలు వచ్చాయని, రైతులు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, ఈ కాలువ ధ్వారా దాదాపు పాలకుర్తి నియోజకవర్గం లో సుమారు 1000 ఎకరాల పైచిలుకు పంటలకు సాగునీరు అందుతుంది అన్నారు, తక్షణమే ప్రభుత్వం స్పందించి నీళ్లు విడుదల చేయాలని కోరారు.

# కేటీకే 8 ఇంక్లైన్ 2 సిమ్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

**జిఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా**

**భూపాలపల్లి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి):**




సింగరేణి యాజమాన్యం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-8 ఇంక్లైన్ 2 సిమ్ ప్రైవేటుపరం చేయడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ డిమాండ్ చేశారు. కేటీకే8 ఇంక్లైన్ సిమ్ టూ ను ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం భూపాలపల్లి జిఎం కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈనెల 25,26 నుండి రెండు రోజులు నల్లబ్యాడ్జీలు, మెమోరండాలు ఇవ్వడం జరిగింది. చివరి రోజుగా జీఎం కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. కేటీకే 8 ఇంక్లైన్ ప్రైవేటు పరం చేయడం వల్ల సింగరేణికే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని, వెంటనే సింగరేణి యాజమాన్యం సిమ్ 2 సింగరేణి ఆధ్వర్యంలోనే బొగ్గు వెలికి తీయాలని ఆయన కోరారు. ఎన్నో సంవత్సరాల నుండి సింగరేణి సంస్థ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, ప్రైవేటుపరం చేయడం వల్ల డిపెండెంట్ ఉద్యోగాలు రాక కార్మిక పిల్లలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. సింగరేణిలో నూతన గనులు ఏర్పాటుకు యాజమాన్యం చర్యలు చేపట్టాలని లేదంటే సింగరేణి మనుగడకే ప్రమాదం పొంచి ఉందన్నారు. సింగరేణి కి రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ 20 వేల కోట్ల అప్పులను వెంటనే సింగరేణి కి చెల్లించాలని అన్నారు. సింగరేణి అభివృద్ధి చెందితేనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అందుకని వెంటనే కేటీకే 8 ఇంక్లైన్ 2 సిమ్ ను యాజమాన్యమే సింగరేణి బొగ్గు తీసే పనులను చేపట్టాలని రమేష్ డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎస్ ఓ టు జిఎం కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు గురుజ పెల్లి సుధాకర్ రెడ్డి, ఎం విజేందర్, జి శ్రీనివాస్, ఎండి ఆసిఫ్ పాషా, రవికుమార్, తోట రామచందర్, నూకల చంద్రమౌళి, ఫిట్ సెక్రటరీలు సదయ్య, దోర్నాల తిరుపతి, గణేష్, ఎల్ శంకర్, కరిముల్లా, శ్రీనివాస్, రమేష్, కృష్ణారెడ్డి, మల్లికార్జున్ సుమారు 200 మంది కార్మికులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలి

**తెలంగాణ -కేరళ అంతరాష్ట్ర యువజన సమ్మేళనంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**

**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 27 (జనం సాక్షి)**




తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళనంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. గురువారం హనుమకొండ లోని హరిత హోటల్ లో భారత ప్రభుత్వ యువజన, క్రీడల శాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో తెలంగాణ- కేరళ అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు ఒక రాష్ట్రం మరొక రాష్ట్రానికి యువతను పంపించి ఆ రాష్ట్ర భాషా , సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం భిన్నత్వంలో ఏకత్వం సాధించడమే లక్ష్యంగా అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళనంలో భాగంగా పరస్పర సంస్కృతి సాంప్రదాయ పద్ధతులను తెలుసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఇక్కడి సంస్కృతి సాంప్రదాయాలను తెలుసుకునేందుకు ఇదొక మంచి అవకాశం అని పేర్కొన్నారు. కేరళ యువత తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను, అదేవిధంగా స్థానిక చారిత్రక, సాంప్రదాయ, ఆచార వ్యవహారాలను క్షేత్రస్థాయిలో సందర్శించి తెలుసుకోవాలన్నారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఎన్నో యువజన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చిన కేరళ యువత గురువారం నుంచి ఐదు రోజుల పాటు (ఫిబ్రవరి 27 నుండి మార్చి 3 వరకూ) పల్లె పట్టణ, చారిత్రక ప్రదేశాలను సందర్శించి తెలుసుకుంటారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన కేరళ యువతకు డ్రెస్, టోపీలతో కూడిన కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ మాట్లాడుతూ ఐదు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల గురించి నిపుణుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాజ్ కుమార్, ఇతర అధికారులతో పాటు నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధులు, కేరళకు చెందిన 27 మంది యువతి యువకులు పాల్గొన్నారు.

# చెక్ డ్యామ్‌ను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**చిట్యాల ఫిబ్రవరి 27 (జనంసాక్షి)**



చెక్ డ్యామ్ ను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ బాబు అన్నారు. ఈ మేరకు గురువారం బిఆర్ఎస్ నాయకులు మండలంలోని నవాబుపేట గ్రామ శివారు మొగుళ్లపల్లి మండలం బద్దం పల్లి గ్రామాల నడుమ చలివాగుపై బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి రైతుల సంక్షేమం కొరకు నిర్మించిన చెక్ డ్యామ్ ను పరిశీలించారు. అనంతరం వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు 10 కోట్ల రూపాయలతో నిర్మించిన చెక్ డ్యామ్ ను ధ్వంసం చేయడం హేయనీయమైన చర్య అని అన్నారు. దీనికి ఇరిగేషన్ అధికారులు బాధ్యత వహించాలన్నారు. బాంబులతో కూలగొట్టిన వారిని గుర్తించి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని లేనిచో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్, యూత్ అధ్యక్షులు తౌటం నవీనచ,పాండ్రాల వీరస్వామి, ఆరేపల్లి సమ్మయ్య, సోషల్ మీడియా ఇంచార్జి కూస ప్రశాంత్ రెడ్డి, ఏలేటి సురేందర్ రెడ్డి, నరిగె అశోక్, మర్రి నరేష్,నవాబుపేట్ గ్రామ అధ్యక్షుడు సాదరాజు గలబూజ నరేష్ వేముల అశోక్ సంపంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న బస్సు కండక్టర్, డ్రైవర్

**భూపాలపల్లి, ఫిబ్రవరి 27 (జనం సాక్షి):**



బుధవారం రోజున కాలేశ్వరం బస్టాండ్ లో శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన క్యాంపులో ఒక ప్రయాణికురాలు బ్యాగు ,ట్యాబు భూపాలపల్లి డిపో బస్సు నంబర్ 0010 లో పోగొట్టుకున్నది . అట్టి పోగొట్టుకున్న బ్యాగును కండక్టర్ సిహెచ్ బాలు 653 145 భూపాలపల్లి డిపో కాలేశ్వరంలో అప్పగించగా కాలేశ్వరం బస్టాండ్ లో కండక్టరు , కంట్రోలర్ కే. గంభీర్ రెడ్డి , డిపో మేనేజర్ భూపాలపల్లి ఇందు సమక్షంలో ప్రయాణికురాలికి అందజేయడం చేశారు. ఈ సందర్భంగా డిఎం ఇందు కండక్టర్ బాలును, డ్రైవర్ ను అభినందించారు. పోగొట్టుకున్న విలువైన సమాచారం నిక్షిప్తమైన ట్యాబును, పర్సు ను తిరిగి ఇవ్వడం పట్ల ప్రయాణికురాలు ధన్యవాదాలు తెలిపారు.

# విధులకు గైర్హాజర్ అయిన వైద్య సిబ్బంది

**అదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి)**

ఇంద్రవెల్లి మండలం లోని ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆ సమయంలో మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ తో పాటు సీఎచ్ఓ సందీప్, పిఎచ్ న్ జ్యోతి, సూపర్వైజర్ సురేష్ , యంఎల్ఎచ్ పి పూజ లు లేకపోవడంతో ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజర్ అవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం అదనపు డీఎంఎచ్ ఓ మనోహర్ తో ఫోన్లో మాట్లాడి విధులకు గైర్హాజరైన వారి పై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎల్లవేళలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు ఆసుపత్రి లోని మెడిసిన్ స్టోర్ రూమ్, ఒపితో పాటు ప్రసవాల గది, ప్రాథమిక పరీక్ష గది, ఈసీజీ గదులను, ఏ ఆర్ యు, ఏఎస్ వి, టీటి ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయా లేదా, ఐరెన్ పోలిక్ మాత్రలు పాఠశాలల లో ప్రతి వారం అందించాల్సి ఉంటుందనీ, విద్యార్థులకు ఇరన్ పోలిక్ మాత్రలు ఇస్తున్నారా లేదా, తదితర వివరాలను డాక్టర్ పూజిత ను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న అటెండెన్స్ రిజిస్టర్ చెక్ చేసి రిజిస్టర్ లో సంతకం చేసిన ప్రకారం వైద్యులు, సిబ్బంది ఉన్నారా , లేరా ? పరిశీలించి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన వారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ ను ఆదేశించారు. ఆస్పత్రిలో వైద్య సేవల కోసం వచ్చిన రోగులతో ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు.రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా స్టాక్ పూర్తికాక ముందే ఇండెంట్ చేసి మందులను తెప్పించుకోవాలనీ, గర్భిణీల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని అన్నారు. అనంతరం టాయిలెట్ ను పరిశీలించగా శుభ్రంగా లేకపోవడం తో అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ తో పాటు డాక్టర్ పూజిత, రజినీకాంత్, డీఎంఎల్టీ అన్సారి, తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
28 ఫిబ్రవరి 2025

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కార్మికుల ప్రాణాలకు ముప్పు

- లోపభూయిష్ట విధానాల వల్లే టన్నెల్ కూలింది
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లిందని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎస్ఎల్ బీసీ దుర్ఘటనా స్థలాన్ని సందర్శించకుండా బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన మాజీ మంత్రులు హరీష్ రావు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జగదీశ్ రెడ్డి శ్రీనివాస్ గౌడ్ డాక్టర్ లక్ష్మారెడ్డి తదితరులు రోడ్డుపై బైటాయింపు చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సమైక్య ఆంధ్ర పాలకుల లోప భూయిష్ట విధానాలు,ప్రస్తుత పాలకుల సమన్వయ లోపం వల్లనే ఎస్ఎల్ బీసీ టన్నెల్ కూలిపోయిందని అన్నారు. చాలా కాలంగా వాడుకలో లేనందున బురద పేరుకుంటుందన్న కనీస జ్ఞానం లేకుండా పనులకు పురమాయించడం తెలివి తక్కువతనమని ధ్వజమెత్తారు .ఎస్ఆర్బీసీలోని పోతిరెడ్డిపాడు పనులు వేగవంతంగా పూర్తిచేసుకొని నీటిని రాయలసీమకు తీసుకెళుతుంటే అప్పట్లో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కళ్ళు మూసుకున్నారని ఎద్దేవా చేశారు .63 కిలో మీటర్ల పొడవు 11.5 కిలో మీటర్ల వెడల్పుతో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు టన్నెల్స్ పనులను కేవలం మూడేళ్ళ లోపునే పూర్తి చేశామని గుర్తు చేశారు. నల్లగొండ ప్రజలకు నీళ్ళిచ్చేందుకు చిత్తశుద్ధి లేకనే ఎస్ఎల్ బీసీ కాలువ టన్నెల్స్ పనులను పట్టించుకోలేదని దుయ్యబట్టారు.చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాధితులకు ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్మికులు టన్నెల్ లో చిక్కుకొని 6రోజులు గడుస్తున్న సహాయక చర్యలు ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడాని నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సహాయక చర్యల కోసం ఎన్డిఆర్ఎఫ్, రైల్వే, సింగరేణి,నేవి బృందాలు అక్కడికి చేరుకున్నా వాటిని సమన్వయం చేసే తెలివి తేటలు,సామర్థ్యం ప్రభుత్వంతో లేకపోవడంతో ఆ బృందాలు నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నాయని అన్నారు.మంత్రులు రోజు ఉదయం,సాయంత్రం అక్కడికి వచ్చి కేవలం ప్రెస్ మీట్లకు హాజరై ఒక పర్యాటక కేంద్రానికి వచ్చినట్లు రావడం పట్ల నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. కార్మికుల ప్రాణాలు కాపాడడానికి నిరంతరం కృషి చేస్తున్న ఎన్.డి.ఆర్.ఎఫ్, రైల్వే,నేవి,సింగరేణి బృందాలు చేపడుతున్న చర్యలను నిరంజన్ రెడ్డి గారు అభినందించారు.ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసి టన్నెల్ లో చిక్కుకున్న వారి ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలంపూర్ శాసన సభ్యుడు విజయుడు మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు భీరం హర్షవర్ధన్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# కృష్ణాబేసిన్ ప్రాజెక్టలను బీఆర్ఎస్ నాశనం చేసింది

- ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ గురించి ప్రశ్నించే హక్కు వారికెక్కడిది?
- గత ప్రభుత్వ తప్పిదాలకు మాపై అభాంఢాలా?
- సొరంగంలో చిక్కుకున్న వారిని బయటకు తెచ్చేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నాం
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** కృష్ణ బేసిన్ లోని సాగునీటి ప్రాజెక్ట్ లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేసిందని, మళ్లీ ఇప్పుడు వచ్చి తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మెఘారెడ్డి, ఎంపీ మల్లురవితో కలిసి మంత్రి జూపల్లి మీడియా సమావేశంలో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ వంటి ప్రాజెక్టలను పూర్తి చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కృష్ణాబేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్టలను పూర్తి చేయాలనే చిత్తశుద్ధి గత ప్రభుత్వానికి లేదని ధ్వజమెత్తారు. ఈ ప్రాజెక్టలను పూర్తి చేస్తే కాంగ్రెస్ కు ఎక్కడ పేరొస్తుందని పెండింగ్‌లో పెట్టారా? అని ప్రశ్నించారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ గురించి ప్రశ్నించే హక్కు, మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. బీఆర్ఎస్ తొమిదన్నర ఏళ్ల తమ పాలనలో ఎందుకు ఎల్ఎల్బీసీ పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఎస్ఎల్బీసీని సందర్శించే నైతిక హక్కు హరీష్ రావు లాంటి బీఆర్ఎస్ నేతలకు లేదని స్పష్టం చేశారు. అప్పుడే మీరు ఈ ప్రాజెక్ట్ ను పూర్తి చేసి ఉంటే ఇవాళ ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని బయటకు తెచ్చేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నామని, 11 సంస్థలకు చెందిన వివిధ రంగాల నిపుణుల పర్యవేక్షణలో ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నా యని, ఇవాళ లేదా రేపటిలోగా సహాయక చర్యలు పూర్తి అవుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎస్ఎల్బీసీ సంఘటన స్థలాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించలేదని బీఆర్ఎస్ నేతలు చిలుక పలుకులు వల్లిస్తున్నారని, గతంలో కొండగట్టు బస్సు ప్రమాదం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ లో ప్రమాదం, శ్రీశైలం పవర్ హౌజ్‌లో ప్రమాదాలు జరిగినప్పుడు కేసీఆర్ కనీసం బయటకు రాలేదని పేర్కొన్నారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ వయబుల్ కాదని, ఆర్థిక ప్రయోజనాలు నెరవేరవని గతంలో కేసీఆర్ మాట్లాడారని, కానీ కాళేశ్వరం లాంటి ప్రాజెక్ట్ నిర్వహణ, విద్యుత్ వినియోగానికి వేల కోట్ల రూపాయాలు ఖర్చవుతున్నాయని, దాంతో పోల్చుకుంటే ఎస్ఎల్బీసీ రూ. 4 వేల కోట్ల వ్యయంతో 20 టీఎంసీల నీటిని వాడుకుని 3 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చని, నీటిని పంపింగ్ చేయాల్సిన అవసరం లేదని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు మానుకోవాలని, శవ రాజకీయాలు చేయొద్దని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

## తీయని మాటలతో
# సైబర్‌నేరగాళ్ల బురిడీ

- అమాయకులను దోచుకుంటున్న సైబర్‌నేరగాళ్లు
- ఓ వ్యక్తి నుంచి రూ. 17 లక్షలు కాజేసిన వైనం

**హైదరాబాద్, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** సైబర్ నేరగాళ్లు రోజుకో పంథాను ఎంచుకుంటున్నారు. అమాయకులను ఫోన్లు చేసిన మొదట తీయని మాటలతో వారిని మభ్యపెడుతున్నారు. తీరా వారి మాటలను నమ్మిన తరువాత వారికి కావాల్సిన వివరాలు తెలుసుకొని నగదును కాజేస్తున్నారు. తాజాగా తెలుగులో మాట్లాడి సైబర్ మోసగాళ్లు ఓ వ్యక్తి నుంచి 17 లక్షలు గుంజేశారు. తెలుగులో మాట్లాడే వ్యక్తి నుంచి బాధితుడికి ఫోన్ కాల్ వచ్చింది. మోసగాడు తెలుగులో మాట్లాడటం వల్ల అవతలి వ్యక్తి చెప్పేది నిజమే అనుకున్నారు. మంచి ఆఫర్ దొరికిందని సంబరపడ్డాడు. సాధారణంగా చీటర్స్ తెలుగు సరిగ్గా మాట్లాడరు కదా మాయలో పడ్డాడు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ కేసును పరిశీలించి, మోసగాళ్లు వాయిస్ ట్రాన్స్‌లేటర్ ఉపయోగించి మోసం చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. డిసెంబర్‌లో, 31 ఏళ్ల బాధితుడికి ఫేస్‌బుక్‌లో ఒక ఫ్రెండ్ రిక్వెస్ట్ రావడంతో.. దాన్ని యాక్సెప్ట్ చేశాడు. ఆ తర్వాత మోసగాడు వాట్సాప్‌కు వచ్చి తనను "టాన్యా"గా పరిచయం చేసుకున్నాడు. ఫ్లిఫ్‌కార్ట్, కుకాయిన్ వంటి బ్రాండ్‌లను ప్రమోట్ చేసే పార్ట్-టైమ్ ఉద్యోగ అవకాశాన్ని వివరించాడు. వాటిని లైక్ చేయడం, చెల్లింపులు చేయడం వంటి పనులను చేసి కమీషన్‌తో రిఫండ్ అందుకోవచ్చని నమ్మించాడు. దీంతో మొదట చిన్న మొత్తాల్లో చెల్లింపులు చేసి రిఫండ్ అందుకున్న బాధితుడు, నమ్మకం పెరిగాక పెద్ద మొత్తాలు చెల్లించసాగాడు. చివరికి అతను 17 లక్షల రుపాయలు కోల్పోయాడు. ఎవరు ఫోన్ కాల్స్ చేసినా ఈ తరహా ఆఫర్లు, టాస్కులు ఇస్తే ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. ప్రతి రోజు ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ అనుకోని పరిస్థితులలో డబ్బులు చెల్లిస్తే వెంటనే 1930కు కాల్స్ చేసి ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు.

# దేవాదాయ శాఖలోకి చార్మినార్ భాగ్యలక్ష్మి గుడి





**హైదరాబాద్, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** హిందూ, ముస్లింల ఐక్యతతోపాటు, మత విద్వేషాలు చెలరేగకుండా చూడాల్సిన సున్నితమైన ప్రదేశం భాగ్యలక్ష్మి ఆలయం. ఇంతలా ప్రధాన్యత ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం తాజాగా దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లనుంది. ఇకపై హైదరాబాద్ పాతబస్తీలో చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయ నిర్వహణ దేవాదాయశాఖ పరిధిలోకి రానుంది. ఈ మేరకు దేవాదాయ శాఖను ట్రైబ్యూనల్ ఆదేశిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. భాగ్యలక్ష్మీ ఆలయ చరిత్ర గురించి మాట్లడుకుంటే..1960 సంవత్సరంలో చార్మినార్ వద్దనున్న ఈ అమ్మవారి ఆలయ పరిధిలో బస్సు ప్రమాదం జరగడంతో అమ్మవారి విగ్రహం కూలిపోయింది. స్థానిక భక్తులు విరాళాలు సేకరించి అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించారు. అంతకుముందు పోచమ్మ పేరుతో ఉన్న అమ్మవారి పేరును అప్పటి నుంచి భాగ్యలక్ష్మీ అమ్మవారిగా మార్చారు. అలా నాటి నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసే మహంత్ రామ్‌చంద్ర దాసు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్ మోహన్ దాసు అనే వ్యక్తిని పూజారిగా నియమించారు. టెంపుల్ ట్రస్టీ మీద గతంలో ఉన్న సుప్రీంకోర్టు తీర్పు కారణంగా హెరిడెటరీ ట్రస్టీ ఆర్డర్స్‌తో ఆలయాన్ని తన ఆధీనంలోకి తీసుకొని ఆదాయాన్ని రాజ్ మోహన్‌దాసు ఒక్కరే అనుభవిస్తూ వచ్చారు. దీనిపై మహంత్ రామ్‌చంద్ర దాసు కుమార్తె భాగ్యలక్ష్మీ ఆలయం అజామాయిషీ చేస్తున్న వారిపై కోర్టును ఆశ్రయించారు. కోట్లాది రూపాయాల ఆలయ నిధులను ప్రస్తుత నిర్వహకులు దుర్వినియోగం చేస్తున్నట్టు సాక్షాధారాలను కూడా ట్రబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడంతో భాగ్యలక్ష్మీ ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించాలని తాజాగా తీర్పు ఇచ్చినట్టు దేవాదాయశాఖ అధికార వర్గాల సమాచారం. ప్రస్తుతం ఉన్న భాగ్యలక్ష్మీ ఆలయ నిర్వహణ బాధ్యతను మహంత్ మనోహర్ దాసు, మహంత్ రామ్‌చంద్రదాసు నుంచి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోనుంది. 1960 దశకం నుంచి వీరు ఆలయ నిర్వహణ భాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు నిర్వహణ బాధ్యతలను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆలయానికి తక్షణమే ఈఓను నియమించి ఆలయంలో ఎటువంటి అవకతవకలులేకుండా , అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్ళాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ట్రైబ్యునల్ ఆదేశించింది. ఈ ఆలయ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదులపై కోర్టు విచారణ అనంతరం ఈ ఆదేశాలు జారీ అయినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. అంతేకాదు ఇప్పటి వరకూ ఆలయ ఆదాయం, ఖర్చులు ఇతర వివరాలను సేకరించడంతోపాటు భక్తుల విరాళాలు, నిధుల దుర్వినియోగంపై విచారణ జరపడంతోపాటు, ఒకవేళ అవకతవకలు జరిగితే తగిన చర్యలు తీసుకోవాలని ట్రైబ్యునల్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# నిర్మాత కేదార్ మృతిపై అనుమానాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** సినీ నిర్మాత కేదార్ చుట్టూ తెలంగాణ రాజకీయం తిరుగుతోంది. దుబాయ్‌లో ఉన్న కేదార్ సెలగం శెట్టి అనుమానాస్పద స్థితిలో చనిపోయారు. ఫిబ్రవరి 25న తన ఫ్లాట్‌లో నిద్రలోనే చనిపోయారు కేదార్. దీంతో ఆయన మృతిపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. మూడు రోజులైనా కేదార్ మృతదేహం ఇండియాకు తీసుకురాలేదు. కేదార్ మృతిపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. కుటుంబ సభ్యులు కోరితే కేదార్ మృతిపై దర్యాప్తు జరిపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇదిలాఉంటే.. గత ఏడాది ర్యాడిసన్ డ్రగ్స్ కేసులో కేదార్ అరెస్ట్ అయ్యారు. ఆనంద్ దేవరకొండ నటించిన గం గం గణేశా చిత్రానికి ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు కేదార్. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌తో కేదార్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. షకీల్ సైతం ప్రస్తుతం దుబాయ్‌లోనే ఉంటున్నారు. సెలబ్రిటీలకు, ఇతర రాజకీయ ప్రముఖులకు దుబాయ్‌లో ప్రాపర్టీస్ కొనుగోళ్లు, ఇతర వ్యాపారల్లో మధ్యవర్తిగా కేదార్ వ్యవహరించేవాడని సమాచారం.. ఈ క్రమంలో కేదార్ హఠాన్మరణం.. పలు అనుమానాలకు తావిస్తోంది.


# గూగుల్‌లో ఉద్యోగుల తొలగింపు

- బ్లూమ్‌బర్గ్ కథనంలో వెల్లడి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి27 (జనంసాక్షి) :** ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ తాజాగా ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ చేపట్టింది. క్లౌడ్ డివిజన్‌లోని ఉద్యోగుల సంఖ్యను తగ్గించిందని సమాచారం. సంబంధిత వ్యక్తులు ఈవిషయాన్ని వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగించిందనే విషయం మాత్రం తెలియరాలేదు. వంద మందికి పైగా ఉండొచ్చని, అది కూడా కొన్ని టీమ్స్‌పై మాత్రమే తొలగింపుల ప్రభావం ఉందని తెలుస్తోంది. ఇదంతా కూడా ఖర్చు తగ్గించుకునే ప్రయత్నంలో భాగమని అంటున్నరు. కంపెనీ దీర్ఘకాలిక విజయాల కోసం వ్యాపారానికి కీలకమైన రంగాల్లో పెట్టుబడులు పెంచేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. అందులోభాగంగా కొన్ని మార్పులు చేస్తున్నామని గూగుల్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో అవకాశాల్ని అందిపుచ్చుకొనేందుకు అనేక సర్దుబాట్లు చేశామని వెల్లడించారు. మరోవైపు ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో గూగుల్ తన క్లౌడ్ వ్యాపారంలో ఆదాయ అంచనాలను అందుకోలేకపోయింది. 2025 మూలధన వ్యయాలు కూడా అంచనాలకు మించిపోయాయి. ఈనేపథ్యంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం గమనార్హం.

# ఫలితాలపై రాష్ట్రమంతటా ఉత్కంఠ



**సాధరణ ఎన్నికలను తలపించేలా సాగిన ఉమ్మడి మెదక్ - ఆదిలాబాద్ -నిజామాబాద్ -కరీంనగర్ పట్టభద్రుల, ఉపధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మూడు జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఎన్నికల్లో పోలింగ్ 74 శాతం,టీచర్ల ఎన్నికల్లో 94.14 పోలింగ్ శాతం జరిగింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది.**

చాడ వేణుగోపాల్ రెడ్డి (ప్రత్యేక ప్రతినిధి)

- గెలుపుపై లెక్కల్లో అభ్యర్థులు.. బ్యాలెట్ పెట్టెల్లో భవితవ్యం
- ప్రశాంతంగా ముగిసిన ఉత్తర తెలంగాణ పట్టభద్రుల, టీచర్ల ఎన్నికలు



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయిన తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలపై తెలంగాణ రాష్ట్రమంతటా కన్పిస్తుంది. ఇటు గ్రాడ్యుయేట్లు, అటు టీచర్ల తీర్పు ఎలా ఉండబోతుందనేది. దీంతో ఎలాగైనా గెలిచేందుకు ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ పార్టీ పోటికి దూరంగా ఉండటం.. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా ప్రయత్నం చేశాయి. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే ఎన్నికలుగా చేప్పున్న ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఫలితాలకోసం వేచిచూడల్సిందే.

### ఉమ్మడి మెదక్ జిల్లాలో పెరిగిన పోలింగ్

ఉమ్మడి మెదక్ జిల్లా పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ 74 శాతం జరిగింది. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో పట్టభద్రుల ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలో 73.19 శాతం, మెదక్ జిల్లా 75.26 శాతం, శాతం, సిద్ధిపేట జిల్లా 72.83 నమోదైంది. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 25652 మంది పట్టభద్రులు ఉండగా 18774 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిద్ధిపేట జిల్లాలో మొత్తం 32589 మంది పట్టభద్రులు ఉండగా 23736 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### టీచర్ల ఎన్నికల్లో 94.14 శాతం పోలింగ్

ఉమ్మడి మెదక్ జిల్లా టీచర్ల ఎన్నికల్లో 94.14 పోలింగ్ శాతం జరిగింది. ఇంకా కొంచెం పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలో 92.57 శాతం, మెదక్ జిల్లా 95.03 శాతం, సిద్ధిపేట జిల్లా లో 94.83 శాతం నమోదైంది. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 2690 మంది టీచర్ల ఓటర్లు ఉండగా 2490 మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిద్ధిపేట జిల్లాలో మొత్తం 3212 మంది టీచర్ల ఓటర్లు ఉండగా 3046 మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉమ్మడి మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి పట్టభద్రుల స్థానానికి 64శాతం, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 85 శాతనికి పైగా పోలింగ్ నమోదైనట్లు తెలుస్తుంది.



### చెప్పుకోదగిన స్థాయిలో పెరగని పోలింగ్

ఎన్నికల షెడ్యూల్ ప్రక టించక ముం దేనుంచే పోటీలో ఉండలనుకునే వారు చేపట్టిన ఓటర్ నమోదు కార్యక్రమం, ఎన్నికల సంఘం, జిల్లా అధికారుల విస్త్రత ప్రచారం కారణంగా పట్టభద్రులు భారీఎత్తున ఓట్లను నమోదు చేసుకున్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే లక్షన్నరకుపైగా కొత్తగా ఓట్లను నమోదు చేసుకున్నారు. అయితే ఓట్లు లక్షన్నర పైగా పెరిగినా గ్రాడ్యుయేట్ పోలింగు శాతం మాత్రం, 2019 పోలింగ్ శాతంతో పోల్చితే కేవలం నాలుగు నుండి ఐదు శాతం మాత్రమే పెరిగింది. అభ్యర్థుల ప్రచారం, ప్రలోభలు భారీగా చేసిన చెప్పుకోదగిన స్థాయిలో పట్టభద్రులు పోలింగు కేంద్రాలకు రాలేదనే చెప్పాలి. అయితే ఓవారల్ గా పోలింగ్ శాతం పెరిగినా.. అభ్యర్థులు అశించిన స్థాయిలో మాత్రం పట్టభద్రుల పోలింగ్ శాతం పెరగలేదనే చెప్పాలి. 15 జిల్లాలలో విస్తరించిన ఈ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం లో 64.4 శాతం, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలలో 85.12 పోలింగ్ జరిగినట్టు తెలుస్తుంది.

### పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ భద్రత

2013 కౌన్సిల్ ఎన్నికలలో ఉత్తర తెలంగాణ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో కేవలం 37.38% పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ నియోజకవర్గంలో 90.18% పోలింగ్ జరిగింది. 2019 సంవత్సరం, కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 59.03% పోలింగ్ నమోదైంది. ఈసారి పట్టభద్రుల ఎన్నికల్లో సుమారు 63.09 పోలింగ్ జరిగిందని ప్రాథమిక అంచనా వేస్తున్నారు . ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు జరగడంతో ఉత్తర తెలంగాణ పట్టభద్రుల నియోజకవర్గం ఇప్పటివరకు అత్యధిక పోలింగ్ ఈసారి ఎన్నికల్లో జరిగింది. పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు సాగింది. 4 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. ఏజెంట్ల సమక్షంలో సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను గట్టి బందోబస్తు మధ్య కరీంనగర్ లోని స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచి వాటికి సీల్ వేశారు. స్ట్రాంగ్‌రూంల వద్ద స్థానిక పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ భద్రతను ఏర్పాటు చేశారు.

### గెలుపు లెక్కల్లో అభ్యర్థులు

ఎమ్మెల్సీ ఎన్నికపై ఆసక్తి ఉన్నా ఓటు వేసేందుకు మాత్రం పట్టభద్రులు సమయం కేటాయించలేదు. దీంతో గత ఎన్నికకంటే ప్రస్తుత ఎన్నికలో పోలింగ్ శాతం తగ్గింది. ఈసారి పోటి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రథమ ప్రాధన్య ఓట్లు తో కాకుండా ద్వితీయ ప్రాధాన్య ఓటుతోనే ఫలితం వెలువడుతుందని అంతా అంచనా వేస్తున్నారు. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ , స్వతంత్ర అభ్యర్థులు పట్టభద్ర ఓటర్లుకు ప్రసన్నం చేసుకొవడానికి భారీగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ ,బిజెపీ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకొవడంతో మొదటి ప్రాధాన్య ఓట్లు అధికంగా ఎవరికి పడ్డాయి? రెండో ప్రాధాన్య ఓట్లు ఎవరికి వచ్చాయనే దానిపై చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లాల వారీగా నమోదైన పోలింగ్ శాతం ప్రకారం అభ్యర్థులు లెక్కలను బేరీజు వేసుకుంటున్నారు. ఏ జిల్లాలో ఎక్కడ పోలింగ్ సరళి అనుకూలంగా ఉందనేది ఏజెంట్లు, అనుచరులు, పార్టీ కార్యకర్తల ద్వారా తెలుసుకుంటున్నారు. వచ్చే నెల మూడవ తేదిన పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది. పట్టాభద్రుల ఓట్లు ఎక్కువగా ఉండటం తో పాటు, ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించడంతో ఓట్ల లెక్కింపునకు 48 గంటలుపైగా టైం పట్టే అవకాశం ఉంది. టీచర్ల ఎమ్మెల్యే ఫలితం ఒక్క రోజులో వచ్చే అవకాశం ఉంది. ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ ఎన్నికలు దూరంగా ఉన్న ఈ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబొతున్నయనే ఉత్కంఠ పోటిచేసిన అభ్యర్థుల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో అనే అసక్తి రాష్ట్ర వ్యాప్తంగా నెలకొంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370